దేశరాజధాని ఢిల్లీలో
ఈరోజు బంగారం ధర
తులం బంగారం
(10 గ్రాములు)
1,44,050/-
(22 క్యారెట్స్)
1,55,400/-
(24 క్యారెట్స్)

# ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 సంచిక: 46 ఎడిటర్: మేనం శ్యామ్ శుక్రవారం 04-09-2026 పేజీలు: 10

## సిరా చుక్క

తల్లి కళ్లలో కన్నీరు...
పొయ్యి మీద ఖాళీ గిన్నె..
ఇదే ఆకలి రాసిన తొలి కవిత.
చేతిలో డిగ్రీ ఉన్నా...
జేబులో చిల్లిగవ్వ లేక యువకుడి కలలు
ఉరికంబం ఎక్కుతున్నాయి.
దేశానికి అన్నం పెట్టే రైతు ఇంట్లోనే...
ఆకలి కడుపు మంటగా మారుతోంది.
కూలీ చేతుల్లో దేశం ఎదుగుతోంది...
కానీ ఆ చేతుల గూటిలోనే చీకటి
మిగులుతోంది.
ఒకే గాలి పీల్చే మనుషుల మధ్య...
"నన్ను తాకకు" అనే గోడ
ఇంకా ఎందుకు.?
పేదరికం అన్నం అడిగితే...
సమాజం ఎందుకు అవమానాన్ని
వడ్డిస్తోంది.?
నిరుద్యోగం భవిష్యత్తు అడిగితే...
పాలకుల తలుపులు ఎందుకు
మూసుకుపోతున్నాయి.?
ఎన్ని గొంతులు నొక్కినా...
కన్నీటి నుంచి పుట్టిన ప్రశ్నను మాత్రం
ఎవ్వరూ చంపలేరు.
ఆ కన్నీరు నినాదమైతే...
ఆ నినాదం ఉద్యమమవుతుంది;
ఆ ఉద్యమం చరిత్రను రాస్తుంది.
ఆకలి ఓడాలి... అసమానత కూలాలి...
మనిషి గెలవాలి..
అదే ఈ కన్నీటి పర్వం చివరి అక్షరం

కోటియా నాయక్ భూక్యా ....
కోదాడ, సూర్యాపేట జిల్లా...

# నన్ను ఎవరూ ధమ్కీ ఇచ్చి భయపెట్టలేరు..

# హైదరాబాద్‌లో సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు!

- చంచల్‌గూడ–సంతోష్‌నగర్ స్టీల్ ఫ్లైఓవర్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- పాతబస్తీని 'ఒరిజినల్ సిటీ'గా అభివర్ణించిన ముఖ్యమంత్రి
- మీరాలం చెరువులో 3 కిలోమీటర్ల మేర కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రకటన
- వచ్చే ఎన్నికల్లోగా గౌలిగూడ–చాంద్రాయణగుట్ట మెట్రో పూర్తి చేస్తామని హామీ
- హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడతామని వెల్లడి



**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :** చంచల్‌గూడ–సంతోష్‌నగర్ స్టీల్ ఫ్లైఓవర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో హైదరాబాద్ అభివృద్ధి, మెట్రో విస్తరణ, మౌలిక వసతులు, పేదల సంక్షేమంపై సీఎం పలు కీలక ప్రకటనలు చేశారు. గత ప్రభుత్వం కేవలం కొబ్బరి కాయ కొట్టి ఫ్లైఓవర్ నిర్మాణాన్ని పట్టించుకోలేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. బ్రిడ్జి నిర్మాణానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం నిధులు కేటాయించి పనులను పూర్తి చేసిందని తెలిపారు.

**పాతబస్తీపై సీఎం కీలక వ్యాఖ్యలు...**

పాతబస్తీపై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తాను గతంలోనే చెప్పినట్లు ఇది ఓల్డ్ సిటీ కాదని.. 'ఒరిజినల్ సిటీ' అని అన్నారు. ఇక్కడి ప్రతి గల్లీ తనకు తెలుసని పేర్కొన్నారు. అసదుద్దీన్ ఓవైసీ కోరిన అభివృద్ధి పనులను మంజూరు చేయాలని అధికారులను ఈ వేదికగా ఆదేశిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే అబ్దుల్లా బలాలా కళాశాల అభివృద్ధికి రూ.20 కోట్లు కోరగా.. రూ.25 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ప్రభుత్వం నిధులు ఇస్తుందని, ఏడాదిన్నరలోపు అభివృద్ధి పనులు పూర్తి చేసే బాధ్యత ఎమ్మెల్యేదేనని స్పష్టం చేశారు. విద్య కోసం ఎంత ఖర్చు చేయడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

**దేశభక్తి విషయంలో అందరం ఒక్కటే..**

ఆపరేషన్ సింధూర్ సమయంలో అసదుద్దీన్ ఓవైసీ దేశానికి మద్దతుగా నిలిచి దేశభక్తిని చాటుకున్నారని రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయ సిద్ధాంతాలు వేర్వేరుగా ఉండొచ్చని.. దేశభక్తి విషయంలో మాత్రం అందరం ఒక్కటేనని పేర్కొన్నారు. ప్రస్తుతం కేబుల్ బ్రిడ్జిని చూడాలంటే దుర్గం చెరువుకు వెళ్లాల్సి వస్తోందని సీఎం అన్నారు. అందుకే మీరాలం చెరువులో సుమారు 3 కిలోమీటర్ల మేర కేబుల్ బ్రిడ్జిని నిర్మించనున్నట్లు తెలిపారు.

**మెట్రో విస్తరణపై కీలక హామీలు...**

వచ్చే ఎన్నికల్లోగా గౌలిగూడ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మెట్రో రైలు సేవలను పూర్తి చేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. వచ్చే ఎన్నికల సమయంలో మెట్రోలో ప్రయాణిస్తూ ప్రజలను ఓట్లు అడుగుతామని వ్యాఖ్యానించారు. నాగోల్ నుంచి ఎల్‌బీనగర్, వనస్థలిపురం, రాజేంద్రనగర్, శంషాబాద్

మిగతా 2లో

## కొండా సురేఖకు కాంగ్రెస్ అధిష్ఠానం షాక్..

## బర్తరఫ్‌పై సంచలన ఆరోపణలు..

- కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం
- రాజీనామా చేయాలని సూచించినా అంగీకరించకపోవడంతో బర్తరఫ్‌కు మొగ్గు
- తన బర్తరఫ్ వెనుక రేవంత్ బ్రదర్స్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారని సురేఖ ఆరోపణ
- కుమార్తె వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం అన్యాయమన్న మాజీ మంత్రి
- ఎమ్మెల్యేగా కొనసాగుతూ నియోజకవర్గ ప్రజలకు సేవ చేస్తానని స్పష్టం



**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :** తెలంగాణ కాంగ్రెస్‌లో కొండా సురేఖ ఎపిసోడ్‌కు ఎట్టకేలకు తెర పడింది. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. రాజీనామా చేయాలని అధిష్ఠానం సూచించినప్పటికీ సురేఖ అంగీకరించకపోవడంతో.. ఆమెను బర్తరఫ్ చేసేందుకు హైకమాండ్ మొగ్గుచూపింది. ఈ పరిణామంపై కొండా సురేఖ తీవ్రంగా స్పందిస్తూ సీఎం రేవంత్‌రెడ్డిపై సంచలన ఆరోపణలు చేశారు.

**నాకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు..**

దేవాదాయ శాఖ మంత్రిగా తనను అన్యాయంగా పదవి నుంచి తొలగించారని కొండా సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. ఉరిశిక్ష పడిన వ్యక్తికీ చివరిసారిగా ఏదైనా చెప్పుకునే అవకాశం ఇస్తారని, తనకు మాత్రం ఎలాంటి అవకాశం ఇవ్వకుండా

మిగతా 2లో

## కొండా సురేఖపై హైకమాండ్ నిర్ణయమే ఫైనల్

- కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు
- కొండా సురేఖ విషయంలో పార్టీ హైకమాండ్ వద్ద పూర్తి సమాచారం ఉందన్న రాజగోపాల్‌రెడ్డి
- హైకమాండ్ నిర్ణయానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని సూచన
- కేబినెట్ విస్తరణలో ఎవరికి చోటు కల్పించాలనేది అధిష్ఠానమే నిర్ణయిస్తుందని వెల్లడి
- పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన కార్యకర్తలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి
- సురేఖ కుమార్తె వ్యాఖ్యలపై పార్టీలో విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో వ్యాఖ్యలు

2 లో

## నీళ్లివ్వకుంటే నడిచొస్తా

- సాగర్ ఆయకట్టుకు నీటి షెడ్యూల్‌పై కేటీఆర్ డెడ్‌లైన్
- 10 రోజుల్లో ప్రకటించకుంటే కోదాడ–హాలియా పాదయాత్ర
- రైతు హామీలు, యూరియా, కరెంట్ సరఫరాపై కాంగ్రెస్ విఫలమయ్యింది
- వెయ్యి రోజులు కావస్తున్నా రైతులకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదు
- ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేసిన మాజీ మంత్రి కేటీఆర్



**.ప్రజా వాయిస్,మిర్యాలగూడ.**నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ పరిధిలోని ఎన్ఎస్పి క్యాంపు గ్రౌండ్ లో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు మహాధర్నా సభలో ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం పై ఘాటు విమర్శలు చేసారు.నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద పంటలను కాపాడేందుకు తక్షణమే నీటిని విడుదల చేయాలని, లేకుంటే రైతులతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.. సాగర్ ఆయకట్టుకు నీటి విడుదలపై ప్రభుత్వం స్పష్టమైన షెడ్యూల్‌ను పది రోజుల్లో ప్రకటించాలని డెడ్‌లైన్ విధించారు. గడువులోగా స్పందించకపోతే రైతులతో కలిసి కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర చేపడతానని ప్రకటించారు.సాగర్‌లో సరిపడా నీరు ఉన్నప్పటికీ ఆయకట్టుకు నీటిని విడుదల చేయకుండా రైతుల పంటలను ఎండబెడుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. నీళ్లు ఎప్పుడు, ఎంత మేర, ఎన్ని తడులకు విడుదల చేస్తారో స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. 2003లో కేసీఆర్ ఇదే ప్రాంత రైతుల నీటి సమస్యపై పాదయాత్ర చేసి పోరాటం చేశారని గుర్తుచేస్తూ.. అదే స్ఫూర్తితో ఇప్పుడు మరో ఉద్యమానికి సిద్ధమవుతున్నామని చెప్పారు.కాంగ్రెస్

మిగతా 2లో

## పదవి ఉన్నా.. లేకున్నా నా గౌరవం నాకుంది.. చిన్నారెడ్డి కీలక వ్యాఖ్యలు

- తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి తొలగించడంపై చిన్నారెడ్డి స్పందన
- తనను నమ్ముకున్న కార్యకర్తలను ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోనని స్పష్టం
- సమస్యకు ప్రధాన కారణం మల్లు రవేనని ఆరోపణ
- పదవులు వస్తుంటాయి.. పోతుంటాయి, ప్రజలు–కార్యకర్తలతో అనుబంధం శాశ్వతమని వ్యాఖ్య
- పదవి లేకపోయినా ప్రజల మధ్యనే ఉంటానని స్పష్టీకరణ

2 లో

## 'కాంగ్రెస్ లక్ష్మణ రేఖ దాటితే చర్యలు తప్పవు'

- మల్లు రవి కీలక వ్యాఖ్యలు
- కొండా సురేఖ, చిన్నారెడ్డిపై తీసుకున్న చర్యలే ఇందుకు ఉదాహరణ: మల్లు రవి
- ఆరోపణలపై క్రమశిక్షణ కమిటీ నివేదిక ఆధారంగానే నిర్ణయం తీసుకున్నామని వెల్లడి
- పార్టీ లైన్ దాటితే ఎంతటి వారిపైనైనా చర్యలు ఉంటాయని స్పష్టం
- సీఎం రేవంత్‌పై ఆరోపణలు చేస్తే ఖండించాల్సిన బాధ్యత మంత్రిపై ఉంటుందన్న రవి
- కొండా సురేఖ పార్టీలోనే కొనసాగాలని కోరుకుంటున్నామని వెల్లడి



**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :** కాంగ్రెస్ లక్ష్మణ రేఖ దాటితే ఎంతటి వారిపైనైనా చర్యలు ఉంటాయని తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి తేల్చి చెప్పారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై తీసుకున్న చర్యలే ఇందుకు ఉదాహరణ అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ లైన్ దాటినందుకే వారిని పదవుల నుంచి తొలగించారని తెలిపారు.

**ఆలస్యమైనా ప్రజాస్వామ్యయుతంగా నిర్ణయం..**

కొండా సురేఖ, చిన్నారెడ్డిపై వచ్చిన ఆరోపణలపై క్రమశిక్షణ కమిటీ నివేదిక రూపొందించి కాంగ్రెస్ అధిష్ఠానానికి సమర్పించిందని మల్లు రవి తెలిపారు. ఇద్దరి వ్యాఖ్యలను పరిశీలించి సీరియస్ యాక్షన్ తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. తెలంగాణ కాంగ్రెస్ కేడర్‌కు స్పష్టమైన సందేశం వెళ్లేలా చర్యలు ఉండాలని విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ అంశంపై ఇప్పటికే ఆలస్యంగా నిర్ణయం తీసుకున్నామని చాలా మంది ప్రశ్నించారని.. ప్రజాస్వామ్యయుతంగా సమస్యను పరిష్కరించాలనే ఉద్దేశంతో ఆలస్యమైందని వివరించారు. కేసీ

మిగతా 2లో

## బొల్లారంలో 160 డిటోనేటర్లు.. ఆర్మీకి సంబంధం లేదు

- మల్కాజ్‌గిరి డీసీపీ
- ఆర్మీ ప్రాంతంలో డిటోనేటర్లు లభించలేదని స్పష్టం చేసిన డీసీపీ శ్రీధర్
- ఓ ప్రైవేట్ వెంచర్‌లో 160 డిటోనేటర్లు గుర్తించినట్లు వెల్లడి
- డిటోనేటర్లు ఆర్మీకి చెందిన ఆస్తులు కావని స్పష్టీకరణ
- గతంలో వెంచర్ డెవలపర్లు వాటిని ఉపయోగించి ఉండవచ్చని పోలీసుల అనుమానం
- ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్న పోలీసులు

2 లో

## చంద్రాయణగుట్టలో బాలికపై అత్యాచారం.. ఇద్దరు ఆటో డ్రైవర్ల అరెస్ట్

- కూలి పనికి వెళ్తున్న 15 ఏళ్ల బాలికను బలవంతంగా ఆటోలో ఎక్కించుకున్న నిందితులు
- మైనర్ కావడంతో నిందితులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు
- నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి బాలికపై అఘాయిత్యానికి పాల్పడినట్లు ఆరోపణ
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు.. దర్యాప్తు కొనసాగింపు
- అహ్మద్, అస్లామ్‌లను అరెస్ట్ చేసిన పోలీసులు

2 లో

## కొండా సురేఖకు కాంగ్రెస్ అధిష్ఠానం షాక్..
# బర్తరఫ్‌పై సంచలన ఆరోపణలు..

**మొదటి పేజీ తరువాయి**

శిక్షించారని అన్నారు. తన కుమార్తె కొండా సుస్మిత పటేల్ చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదని పేర్కొన్నారు. ఆమె అభిప్రాయంతో తనకేం సంబంధమని కాంగ్రెస్ పెద్దలను సురేఖ ప్రశ్నించారు.రాజీనామా చేయమంటే చేసేదాన్నని, తన వివరణ అడిగి చర్యలు తీసుకుంటే బాగుండేదన్నారు. నిజంగా తాను తప్పు చేసి ఉంటే బర్తరఫ్ చేసినా పర్వాలేదని, తప్పు చేయకుండా తనపై చర్యలు తీసుకోవడం పార్టీ తప్పిదమని అన్నారు.

**బ్లాక్‌మెయిల్ రాజకీయాలతో బర్తరఫ్ చేశారు..**

తన బర్తరఫ్ వెనుక రేవంత్ బ్రదర్స్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, కొండల్‌రెడ్డి ఏకమై తనను ఇబ్బంది పెట్టారని కొండా సురేఖ ఆరోపించారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేసి తనను బర్తరఫ్ చేశారని అన్నారు. తనకు ఏఐసీసీ నుంచి తొలగించాలనే ఆలోచన లేదని, పరిస్థితులను కొందరు తమకు అనుకూలంగా మార్చుకున్నారని వ్యాఖ్యానించారు.'మంత్రి పదవి నాకు ఆభరణం మాత్రమే. కారణం చెప్పకుండా తొలగించడం బాధాకరం' అని సురేఖ అన్నారు. గతంలో మంత్రి పదవికి తానే స్వయంగా రాజీనామా చేశానని గుర్తుచేశారు. ప్రస్తుతం మంత్రులు సంతోషంగా లేరని, ఈ విషయాన్ని గుండెపై చేయి వేసుకొని వారు చెప్పాలని వ్యాఖ్యానించారు. మంత్రులంతా బయటకు వచ్చి మాట్లాడాలని కోరారు.

**సుమంత్ వ్యవహారంపై ప్రభుత్వానికి విజ్ఞప్తి..**

తన మాజీ ఓఎస్డీ సుమంత్‌పై కేసు వ్యవహారాన్ని కూడా కొండా సురేఖ ప్రస్తావించారు. డబ్బులు వసూలు చేసిన వ్యక్తే సుమంత్‌పై కేసు పెట్టాడని ఆరోపించారు. సుమంత్ పేరు చెప్పి కిరణ్ అనే వ్యక్తి డబ్బులు వసూలు చేశాడని అన్నారు. తమ ప్రభుత్వంలో తమ మనుషులనే ఇబ్బంది పెట్టుకోవడం చరిత్రలో ఎక్కడా లేదని పేర్కొన్నారు. సుమంత్‌ను ఇబ్బంది పెట్టడం ఆపేయాలని ప్రభుత్వాన్ని కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం సరిదిద్దుకోవాల్సిన, మార్చుకోవాల్సిన అంశాలు కొన్ని ఉన్నాయని సురేఖ అన్నారు. ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాలంటే చాలా మార్పులు జరగాలని సూచించారు. మోనోపాలీ లాగా వెళ్లడం సరైంది కాదని, నిర్ణయాలు తీసుకునేటప్పుడు చర్చించాల్సిన అవసరం ఉందన్నారు.

# 'కాంగ్రెస్ లక్ష్మణ రేఖ దాటితే చర్యలు తప్పవు'

**మొదటి పేజీ తరువాయి**

వేణుగోపాల్ విదేశాల్లో ఉండటంతో నిర్ణయం మరింత ఆలస్యమైందన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రెండుసార్లు కలిసే అవకాశం ఇచ్చారని, దీంతో కొండా సురేఖ తన వాదనను అధిష్ఠానం ముందు చెప్పుకున్నారని తెలిపారు.

**బ్లాక్‌మెయిల్ చేసి చర్యలు తీసుకుంటే నేరుగా చేసేవారు.**

.సీఎం రేవంత్ బ్లాక్‌మెయిల్ చేసి చర్యలు తీసుకునే వ్యక్తి అయితే నేరుగా చర్యలు తీసుకునే వారని మల్లు రవి అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఆ విధానం ఉండదని స్పష్టం చేశారు. మంత్రి పదవి నుంచి తొలగించిన తర్వాత కొండా సురేఖ చేస్తున్న వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. పార్టీలో ఏమైనా సమస్యలు ఉంటే కూర్చుని మాట్లాడుకోవాలని సూచించారు.బీఆర్ఎస్ హయాంలో రాజయ్యను సమాచారం లేకుండానే ఉప ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించిన విషయాన్ని ఈ సందర్భంగా మల్లు రవి గుర్తు చేశారు. లక్ష్మణ రేఖ దాటితే ఎంతటి వారైనా చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఏఐసీసీ నిర్ణయం ద్వారా స్పష్టమైందన్నారు.

**కుమార్తె వ్యాఖ్యలను సురేఖ ఖండించలేదు..**

ముఖ్యమంత్రిపై తన కుమార్తె చేసిన వ్యాఖ్యలను కొండా సురేఖ ఖండించలేదని మల్లు రవి మండిపడ్డారు. సీఎంను ఎవరైనా విమర్శిస్తే వాటిని ఖండించాల్సిన బాధ్యత కేబినెట్ మంత్రిపై ఉంటుందని అన్నారు. తన కుమార్తె చేసింది తప్పు అని ఖర్గే వద్ద కూడా సురేఖ చెప్పలేదని పేర్కొన్నారు.కొండా సురేఖపై తనకు ఫిర్యాదులు అందాయని, కోమటిరెడ్డి బ్రదర్స్‌పై ఫిర్యాదులు వస్తే వారిపైనా చర్యలు తీసుకుంటామని మల్లు రవి తేల్చి చెప్పారు. కొండా సురేఖ, మురళీ, చిన్నారెడ్డిపై తనకు వ్యక్తిగతంగా ఎలాంటి వ్యతిరేకత లేదన్నారు. సురేఖ చేసిన తప్పుల ఆధారంగానే చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. కులాల ఆధారంగా పార్టీలో చర్యలు ఉండవని, దీనిని కుట్రగా ఆమె భావిస్తే తానేమీ చేయలేనని వ్యాఖ్యానించారు.

**సీఎం విషయంలో హైకమాండ్‌దే తుది నిర్ణయం..**

పార్టీకి వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడితే జిల్లా అధ్యక్షుడు, పీసీసీ అధ్యక్షుడి నుంచి వచ్చే ఫిర్యాదులను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని మల్లు రవి చెప్పారు. పార్టీ నేతలు, కార్యకర్తలను ఉత్సాహపరిచేందుకే రేవంత్‌రెడ్డి టికెట్ల ప్రకటన, సీఎంగా తానే ఉంటానని చెప్పారని అన్నారు. దానిని సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు.కాంగ్రెస్ పార్టీ కోసమే ముఖ్యమంత్రి మాట్లాడుతున్నారని.. సొంత ప్రయోజనాల కోసం కాదని మల్లు రవి పేర్కొన్నారు. సీఎంగా ఎవరుండాలి, టికెట్ ఎవరికి ఇవ్వాలనే అంశంపై కాంగ్రెస్ హైకమాండ్ తుది నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు.కొండా సురేఖను మంత్రిగా తొలగించినప్పటికీ ఆమె కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగాలని తాము కోరుకుంటున్నామని మల్లు రవి తెలిపారు.

## బొల్లారంలో 160 డిటోనేటర్లు.. ఆర్మీకి సంబంధం లేదు



**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :** హైదరాబాద్ బొల్లారంలో డిటోనేటర్లు లభించిన ఘటనపై మల్కాజ్‌గిరి డీసీపీ శ్రీధర్ కీలక వివరాలు వెల్లడించారు. 160 డిటోనేటర్లు ఆర్మీ ప్రాంతంలో లభించలేదని.. ఓ ప్రైవేట్ వెంచర్‌లో గుర్తించినట్లు స్పష్టం చేశారు. ఈ డిటోనేటర్లు ఆర్మీకి చెందిన ఆస్తులు కావని తెలిపారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో పోలీసులు చేపట్టిన తనిఖీల్లో భాగంగా వీటిని గుర్తించినట్లు వెల్లడించారు.

**ప్రైవేట్ వెంచర్‌లో డిటోనేటర్లు..**

గతంలో ప్రైవేట్ వెంచర్ డెవలపర్లు అక్కడ డిటోనేటర్లను ఉపయోగించి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే వాటిని అక్కడ ఎవరు ఉపయోగించారు, ఎప్పటి నుంచి అక్కడ ఉన్నాయి, ఏ అవసరం కోసం వినియోగించారనే అంశాలపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ వ్యవహారంపై అనవసరమైన అపోహలు, ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని పోలీసులు స్పష్టం చేశారు.

**ఆర్మీ ఘటనతో సంబంధం లేదు..**

ప్రస్తుతం వెలుగులోకి వచ్చిన ఆర్మీకి సంబంధించిన ఘటనతో ప్రైవేట్ వెంచర్‌లో లభించిన డిటోనేటర్లకు ఎలాంటి సంబంధం లేదని డీసీపీ శ్రీధర్ స్పష్టం చేశారు. ఆర్మీ కేసు, ప్రైవేట్ వెంచర్‌లో డిటోనేటర్లు లభించిన ఘటన రెండూ వేర్వేరు అంశాలని తెలిపారు.

**కేసు నమోదు.. దర్యాప్తు కొనసాగింపు..**

డిటోనేటర్లు లభించిన వ్యవహారంపై ఇప్పటికే కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు డీసీపీ శ్రీధర్ తెలిపారు. వాటి వినియోగం, నిల్వకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. మరోవైపు ఆర్మీకి సంబంధించిన కేసులోనూ దర్యాప్తు కొనసాగుతోందని.. అందులో ఏవైనా తదుపరి పరిణామాలు చోటుచేసుకుంటే అధికారికంగా వెల్లడిస్తామని డీసీపీ స్పష్టం చేశారు.

# కొండా సురేఖ బర్తరఫ్‌పై కొండా మురళి ఘాటు ట్వీట్

- రాజకీయ దాడులు చేసినా వెనక్కి తగ్గం
- కొండా సురేఖ బర్తరఫ్ నేపథ్యంలో కొండా మురళి సంచలన వ్యాఖ్యలు
- తమపై ఎన్ని రాజకీయ దాడులు జరిగినా దృఢంగా నిలబడతామని స్పష్టం
- అవసరమైతే మొండిగా ఎదురెళ్లగలమంటూ ఘాటు హెచ్చరిక
- 'ఇదేం కొత్త కాదు.. ఉన్నది ఉన్నట్టు మాట్లాడితే ఎవరు తట్టుకోరు' అంటూ ట్వీట్
- మీడియా ముందుకు వచ్చిన సమయంలో మీసం మెలేసిన కొండా మురళి



**వరంగల్, ప్రజావాయిస్ బ్యూరో :** కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసిన నేపథ్యంలో ఆమె భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి చేసిన ఘాటు ట్వీట్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తమపై ఎన్ని రాజకీయ దాడులు జరిగినా దృఢంగా నిలబడతామని ఆయన తేల్చి చెప్పారు. అవసరమైతే మొండిగా ఎదురెళ్లగలమంటూ హెచ్చరించారు. అంతకుముందు మీడియా ముందుకు వచ్చిన కొండా మురళి చిరునవ్వుతో మీసం మెలేస్తూ కనిపించడం కూడా ఆసక్తిని రేకెత్తించింది.

**ఇదేం కొత్త కాదు.. ఎవరు తట్టుకోరు..**

కొండా సురేఖ బర్తరఫ్ తర్వాత తొలిసారి ఎక్స్ వేదికగా స్పందించిన కొండా మురళి.. పరోక్షంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇదేం కొత్త కాదు.. ఉన్నది ఉన్నట్టు, కుండబద్దలు కొట్టినట్టు మాట్లాడితే ఎవరు తట్టుకోరు. ఇవాళ మేము.. రేపు ఎవరో? అంటూ ట్వీట్ చేశారు.పదవులు ఉన్నా లేకపోయినా తమ గౌరవం తమకు ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతి విషయానికీ వెంటనే స్పందించకపోయినా.. జరుగుతున్న ప్రతి పరిణామాన్ని తాము గమనిస్తూనే ఉంటామని పేర్కొన్నారు.

**వెనక్కి తగ్గేది లేదు..**

తమపై అన్ని శక్తులు ఏకమై రాజకీయ దాడులు చేస్తున్నా తాము వెనక్కి తగ్గబోమని కొండా మురళి స్పష్టం చేశారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా దృఢంగా నిలబడతామని, అవసరమైతే మొండిగా ఎదురెళ్లగలమని పేర్కొన్నారు. దీంతో ఆయన చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీశాయి.

**మీసం మెలేసిన కొండా మురళి..**

మరోవైపు కొండా మురళి సాయంత్రం తన ఇంటి నుంచి బయటకు వచ్చిన సమయంలో చిరునవ్వుతో కనిపించారు. ఈ సందర్భంగా ఆయన మీసం మెలేస్తూ కనిపించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది. కొండా సురేఖ బర్తరఫ్ తర్వాత మురళి చేసిన ట్వీట్, ఆయన హావభావాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.



# నీళ్లివ్వకుంటే నడిచొస్తా

**మొదటి పేజీ తరువాయి**

ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు వెయ్యి రోజులు కావస్తున్నా రైతులకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని కేటీఆర్ విమర్శించారు. రైతు భరోసా, వ్యవసాయ రుణాలు, రుణమాఫీ వంటి కీలక హామీల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు రైతు డిక్లరేషన్ పేరుతో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు వాటిని విస్మరిస్తోందని ఆరోపించారు.యూరియా కొరతపైనా కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులకు సకాలంలో ఎరువులు అందక ఇబ్బందులు పడుతున్నారని, యూరియా కోసం రైతులు బారులు తీరాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. మరోవైపు వ్యవసాయానికి అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరాలో కోతలు విధించడం వల్ల రైతులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.రైతుల సమస్యలపై శాంతియుతంగా నిర్వహించే ర్యాలీలకు సైతం పోలీసు అనుమతులు నిరాకరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ప్రభుత్వం పోలీసు వ్యవస్థను ఉపయోగించుకుంటోందని మండిపడ్డారు. రైతులు తమ సమస్యలపై ప్రశ్నించే హక్కును అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు.సాగర్ ఆయకట్టు రైతుల సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, నీటి విడుదలకు స్పష్టమైన షెడ్యూల్ ప్రకటించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. "పది రోజుల్లో షెడ్యూల్ ఇవ్వకుంటే వేలాది మంది రైతులతో కలిసి పాదయాత్ర చేస్తాం.. రైతుల హక్కుల కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం'' అని ఆయన స్పష్టం చేశారు.ఈ సభలో ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి,ఎమ్మెల్సీ ఎంసి.కోటిరెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్,మాజీ ఎమ్మెల్యే లు నల్లమోతు భాస్కర్ రావు, రవీంద్ర కుమార్, గాదరి కిషోర్,నోముల భగత్ కుమార్,ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్, భారత రాష్ట్ర సమితి కార్యకర్తలు తదితరులు హాజరయ్యారు.

## చంద్రాయణగుట్టలో బాలికపై అత్యాచారం.. ఇద్దరు ఆటో డ్రైవర్ల అరెస్ట్

**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :** నగరంలోని చంద్రాయణగుట్టకు చెందిన 15 ఏళ్ల బాలికపై ఇద్దరు ఆటో డ్రైవర్లు అత్యాచారానికి పాల్పడ్డారు. కూలి పనికి వెళ్తున్న బాలికను అటుగా వెళ్తున్న ఇద్దరు ఆటో డ్రైవర్లు బలవంతంగా ఆటోలో ఎక్కించుకున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఆమెను నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడినట్లు పేర్కొన్నారు.

**ఇద్దరు నిందితుల అరెస్ట్..**

ఈ ఘటనకు సంబంధించి అహ్మద్, అస్లామ్ అనే ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. బాధితురాలు మైనర్ కావడంతో నిందితులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

**ఘటనా స్థలంలో పోలీసుల పరిశీలన..**

దర్యాప్తులో భాగంగా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు. బాలికను ఎలా ఆటోలోకి ఎక్కించారు, ఎక్కడికి తీసుకెళ్లారు అనే అంశాలపై కూడా పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

## పదవి ఉన్నా.. లేకున్నా నా గౌరవం నాకుంది.. చిన్నారెడ్డి కీలక వ్యాఖ్యలు



**వనపర్తి, ప్రజావాయిస్ బ్యూరో :** పదవి ఉన్నా.. లేకున్నా తన గౌరవం తనకు ఉంటుందని మాజీ మంత్రి జి.చిన్నారెడ్డి అన్నారు. తనను నమ్ముకున్న కార్యకర్తలను ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోనని స్పష్టం చేశారు. పదవిలో ఉన్నా, లేకున్నా వారి కోసం ఏ పని చేయడానికైనా సిద్ధంగా ఉంటానని తేల్చి చెప్పారు. గురువారం గోపాల్ పేట మండలంలోని తన స్వ గ్రామం జయన్న తిరుమలాపూర్ లో వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన ఆయ న మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడి పదవి నుంచి తనను తొలగించడం పై స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.

**ప్రభుత్వం ఇచ్చిన సౌకర్యాలను ముందే వెనక్కి పంపా..**

క్యాబినెట్ హోదా ఉన్న సమయంలోనే ప్రభుత్వం తనకు కల్పించిన కారు, డ్రైవర్, సెక్యూరిటీ తదితర సౌకర్యాలను తిరిగి పంపించానని చిన్నారెడ్డి తెలిపారు. తనకు ఇచ్చిన ప్రణాళిక సంఘం ఉపాధ్యక్ష పదవికి సంబంధించిన ఉత్తర్వుల్లో 'ఇంటిగ్రేటెడ్ ఆర్డర్'గా పేర్కొన్నారని, అయితే ఎన్ని సంవత్సరాల పాటు పదవిలో కొనసాగాలనే విషయాన్ని అందులో ప్రస్తావించలేదన్నారు.తన కుమారుడికి ఏదైనా పదవి ఇప్పించాలని ముఖ్యమంత్రి వద్ద తాను ఎప్పుడూ అడగలేదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో వి.హనుమంతరావు తర్వాత తానే సీనియర్ నాయకుడినని పేర్కొన్నారు. ప్రస్తుతం తలెత్తిన సమస్యకు ప్రధాన కారణం కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవేనని చిన్నారెడ్డి ఆరోపించారు.

**తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేశా..**

తన రాజకీయ ప్రస్థానాన్ని, పార్టీ కోసం చేసిన సేవలను చిన్నారెడ్డి గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో 42 మంది ఎమ్మెల్యేలతో వనపర్తిలో భారీ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఆ సమయంలో సంతకాలు సేకరించి ఉద్యమానికి తాను ఊపిరి పోసినట్లు పేర్కొన్నారు.పదవులు వస్తుంటాయి.. పోతుంటాయని, అయితే ప్రజలు, కార్యకర్తలతో తన అనుబంధం మాత్రం శాశ్వతమని చిన్నారెడ్డి అన్నారు. పదవి లేకపోయినా ప్రజల మధ్యనే ఉంటానని స్పష్టం చేశారు.

**కార్యకర్తలను ఎట్టి పరిస్థితుల్లోనూ వదలను..**

తనను నమ్ముకుని ఉన్న కార్యకర్తలకు అండగా ఉంటానని చిన్నారెడ్డి తేల్చి చెప్పారు. పదవులు లేకపోయినా వారి కోసం ఏ పని చేయడానికైనా సిద్ధంగా ఉంటానన్నారు. రాజకీయంగా ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ప్రజలు, కార్యకర్తలతో తన అనుబంధాన్ని కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

## నన్ను ఎవరూ ధమ్కీ ఇచ్చి భయపెట్టలేరు..
## హైదరాబాద్‌లో సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు!



వరకు మెట్రోను విస్తరించే ప్రణాళికలు ఉన్నాయని వెల్లడించారు.

**హైదరాబాద్ అభివృద్ధే లక్ష్యం..**

హైదరాబాద్ నగరంలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మించబోతున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. హిందువులు, ముస్లింలు కలిసి ముందుకు సాగితేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి బీజేపీ, బీఆర్ఎస్ నేతలు అడ్డంకులు సృష్టిస్తున్నారని సీఎం ఆరోపించారు. మూసీని అభివృద్ధి చేసి నగరంలో నైట్ ఎకానమీని ప్రోత్సహిస్తామని తెలిపారు. పేద ముస్లింలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.ప్రతి పేద కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు ఉంటాయని.. ఎన్నికలు పూర్తయ్యాక అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. అందరూ కలిసి హైదరాబాద్ నగరాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు.

**'నన్ను ఎవరూ ధమ్కీ ఇచ్చి భయపెట్టలేరు'**

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనను ఎవరూ ధమ్కీ ఇచ్చి భయపెట్టలేరని స్పష్టం చేశారు. పదవులు, బెదిరింపులకు తాను లొంగే ప్రసక్తే లేదన్నారు. తనను ప్రేమతో మాత్రమే గెలవగలరని, ఎలాంటి ఒత్తిళ్లకు తాను తలవంచనని సీఎం పేర్కొన్నారు.

# సింగరేణి ప్రాజెక్టులో భారీ పేలుడు.. ఐదుగురు కార్మికులకు గాయాలు

- అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులో నైట్ షిఫ్ట్ ముగింపు సమయంలో పేలుడు
- భారీ శబ్దంతో పేలిన ఎయిర్ ట్యాంకర్
- ఐదుగురు కార్మికులకు గాయాలు.. ఇద్దరు అస్వస్థత
- గోదావరిఖని సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలింపు
- ప్రమాదంపై విచారణకు సిద్ధమవుతున్న అధికారులు



**పెద్దపల్లి, ప్రజావాయిస్ బ్యూరో :** పెద్దపల్లి జిల్లాలోని రామగిరి సింగరేణి ఆర్‌జీ-3 ఏరియాలోని అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులో ప్రమాదం చోటు చేసుకుంది. నైట్ షిఫ్ట్ ముగింపు సమయంలో ఎయిర్ ట్యాంకర్ ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలింది. ఈ ఘటనతో ప్రాజెక్టులో పనిచేస్తున్న కార్మికులు భయాందోళనకు గురయ్యారు. పేలుడు ధాటికి ఐదుగురు కార్మికులు గాయపడినట్లు సమాచారం.

**ఐదుగురు కార్మికులకు గాయాలు..**

ప్రమాదం జరిగిన వెంటనే తోటి కార్మికులు అప్రమత్తమై గాయపడిన వారిని బయటకు తీసుకొచ్చారు. అనంతరం ఐదుగురిని చికిత్స నిమిత్తం గోదావరిఖని సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారిలో ఇద్దరు కార్మికులు అస్వస్థతకు గురికాగా, మరో ముగ్గురికి గాయాలైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బాధితులకు వైద్యులు చికిత్స అందిస్తూ ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

**భారీ శబ్దంతో ఉలిక్కిపడ్డ కార్మికులు..**

ఎయిర్ ట్యాంకర్ పేలడంతో భారీ శబ్దం వినిపించింది. దీంతో ప్రాజెక్టులో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఘటనపై సమాచారం అందుకున్న సింగరేణి అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు.

# కొండా సురేఖపై హైకమాండ్ నిర్ణయమే ఫైనల్

**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :** తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అంశంలో పార్టీ హైకమాండ్ నిర్ణయమే ఫైనల్ అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆమె విషయంలో పార్టీ అధిష్ఠానం వద్ద పూర్తి సమాచారం ఉందని అన్నారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి కేబినెట్ విస్తరణలో ఎవరికి చోటు ఉంటుందనేది పార్టీ హైకమాండ్ చూసుకుంటుందని తెలిపారు. హైకమాండ్ నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని పార్టీ నేతలతోపాటు శ్రేణులకు సూచించారు.

**కొండా సురేఖ అంశంపై కొనసాగుతున్న ఉత్కంఠ..**

కొండా సురేఖ జన్మదినం సందర్భంగా వరంగల్ జిల్లా గీసుకొండలో నిర్వహించిన వేడుకలకు ఆమె కుమార్తె సుస్మిత పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిపై ఆమె చేసిన తీవ్ర వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. దీంతో పార్టీలో కొండా సురేఖ కుమార్తె వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో కొండా సురేఖకు పార్టీ నోటీసులు జారీ చేసింది.పార్టీ క్రమశిక్షణ కమిటీ కూడా ఈ వ్యవహారంపై స్పందించడంతో.. కొండా సురేఖ లేఖల ద్వారా వివరణ ఇచ్చారు. అయితే ఆమెపై పార్టీ అధిష్ఠానం ఆగ్రహంగా ఉందని, తీవ్ర నిర్ణయం తీసుకునే అవకాశం ఉందనే చర్చ రాజకీయ వర్గాల్లో కొనసాగుతోంది.

**కేబినెట్ విస్తరణపై అధిష్ఠానానిదే నిర్ణయం..**

మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి తన కేబినెట్‌ను పునర్వ్యవస్థీకరిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కేబినెట్‌లోకి కొత్త వారిని తీసుకునే అవకాశం ఉందనే చర్చ కూడా సాగుతోంది. ఈ నేపథ్యంలోనే కొండా సురేఖ అంశంపై రాజగోపాల్‌రెడ్డి స్పందించారు.ఎవరికి మంత్రి పదవులు ఇవ్వాలి, ఎవరిని కేబినెట్‌లోకి తీసుకోవాలనే విషయాన్ని పార్టీ హైకమాండ్ నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు. అధిష్ఠానం నిర్ణయాన్ని అందరూ గౌరవించి, కట్టుబడి ఉండాలని సూచించారు.

**కార్యకర్తలకు న్యాయం చేయాలి..**

బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు కొనసాగిన సమయంలో కాంగ్రెస్ పార్టీ కోసం పోరాటం చేసిన కార్యకర్తలకు న్యాయం జరగాలని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పార్టీ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. పదేళ్లుగా పార్టీ కోసం పనిచేసిన వారికి తగిన గుర్తింపు, అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.కొండా సురేఖ విషయంలో హైకమాండ్ వద్ద పూర్తి సమాచారం ఉందని, అందువల్ల ఈ అంశంపై తుది నిర్ణయం అధిష్ఠానమే తీసుకుంటుందని రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు.

# అన్నారంలో 'గురుకులం' పేరుతో నిబంధనలకు తిలోదకాలు?

- లక్షల్లో ఫీజులు.. విద్యార్థులకు పడుకునేందుకు బెడ్లు కరువు!
- అనుమతులు, గుర్తింపు లేకుండానే నిర్వహణ సాగుతోందా..?
- అధికారుల తనిఖీలు ఎప్పుడు?





**ప్రజా వాయిస్,మిర్యాలగూడ.**మిర్యాలగూడ మండలం అన్నారం గ్రామంలో 'గురుకులం–నవోదయ కోచింగ్' పేరుతో ఓ విద్యా సంస్థ గత కొంతకాలంగా నిర్వహిస్తున్నప్పటికీ.. దానికి సంబంధించి అవసరమైన అనుమతులు, గుర్తింపు, నిర్వహణ నిబంధనలు పాటిస్తున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎలాంటి స్పష్టమైన బోర్డు లేకుండా, సంబంధిత శాఖల అనుమతులు లేకుండానే విద్యార్థులను ఉంచి నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు విద్యార్థుల నుంచి లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉండగా.. వారికి కనీస వసతులు కూడా కల్పించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

## లక్షల్లో ఫీజులు.. పడుకునేందుకు బెడ్లు కరువు!

'గురుకులం–నవోదయ కోచింగ్' పేరుతో విద్యార్థుల నుంచి లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. అయితే ఇంత మొత్తంలో ఫీజులు చెల్లిస్తున్న విద్యార్థులకు కనీస వసతులు అందుతున్నాయా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ముఖ్యంగా చిన్నారులు రాత్రివేళ పడుకునేందుకు సరిపడా బెడ్లు కూడా లేకపోవడం, బాత్‌రూమ్‌ల నిర్వహణ సరిగా లేకపోవడం, పరిశుభ్రతకు సంబంధించిన కనీస ప్రమాణాలు పాటించడం లేదన్న సమాచారం ఆందోళన కలిగిస్తోంది.ఒకవైపు భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు.. మరోవైపు పడుకునేందుకు బెడ్ కూడా లేకపోవడంపై తల్లిదండ్రుల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు సమాచారం. వసతి, భోజనం, తాగునీరు, పారిశుధ్యం, భద్రత తదితర సౌకర్యాల కోసం వసూలు చేస్తున్న ఫీజులకు అనుగుణంగా వసతులు కల్పిస్తున్నారా? ఫీజుల వసూళ్లకు రసీదులు ఇస్తున్నారా? అన్న అంశాలపై కూడా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

## విద్యార్థుల వసతులపై ఆందోళన

ఈ కేంద్రంలో విద్యార్థులకు సరైన వసతి సౌకర్యాలు కల్పించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. బెడ్లు లేకపోవడం, బాత్‌రూమ్‌ల నిర్వహణ సరిగా లేకపోవడం, పరిశుభ్రతకు సంబంధించిన కనీస ప్రమాణాలు పాటించడం లేదన్న సమాచారం ఆందోళన కలిగిస్తోంది. చిన్నారులను నివాసంలో ఉంచుతున్న సందర్భంలో తాగునీరు, పారిశుధ్యం, నిద్రించే సదుపాయాలు, భద్రత వంటి అంశాలపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

## బోధించే సిబ్బంది అర్హతలపైనా సందేహాలు

ఇక్కడ విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుల విద్యార్హతలు, నియామకానికి సంబంధించిన వివరాలపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బోధనా సిబ్బందికి నిబంధనల ప్రకారం అవసరమైన విద్యార్హతలు ఉన్నాయా? వారి వివరాలు, నియామక విధానం ఏమిటి? అన్న అంశాలను విద్యాశాఖ అధికారులు పరిశీలించాల్సి ఉంది.

## చదువు ఒకచోట.. నివాసం మరోచోట?

మరో కీలక అంశంగా.. 3, 4, 5వ తరగతులు చదువుతున్న విద్యార్థులు విద్యాభ్యాసం కోసం మరో పాఠశాలలో నమోదై ఉండగా.. నివాసం మాత్రం అన్నారంలోని ఈ కేంద్రంలో ఉంటున్నారన్న సమాచారం వెలుగులోకి వస్తోంది. ఒకవేళ ఇది వాస్తవమైతే విద్యార్థుల హాజరు, పాఠశాల రికార్డులు, వసతి నిర్వహణ, తల్లిదండ్రుల అనుమతులు తదితర అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

## 'కోచింగ్ ' పేరుతో హాస్టల్ నిర్వహణకు అనుమతులున్నాయా?

కేవలం కోచింగ్ నిర్వహిస్తున్నామని చెప్పడం ఒక అంశమైతే.. చిన్నారులను అక్కడే ఉంచి నివాస సదుపాయం కల్పించడం మరో అంశం. అందుకు సంబంధించి సంబంధిత శాఖల నుంచి ఏవైనా అనుమతులు, గుర్తింపులు ఉన్నాయా? భవనం వినియోగానికి అనుమతి ఉందా? అగ్నిమాపక భద్రత, పారిశుధ్యం, తాగునీరు, విద్యార్థుల భద్రతకు సంబంధించిన ప్రమాణాలు పాటిస్తున్నారా? అన్నది తేలాల్సి ఉంది.

## అధికారుల తనిఖీలు జరిగాయా?

గత కొన్ని సంవత్సరాలుగా ఈ కేంద్రం కొనసాగుతున్నట్లు స్థానికంగా సమాచారం ఉన్న నేపథ్యంలో ఇప్పటివరకు విద్యాశాఖ, రెవెన్యూ, పంచాయతీ తదితర సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించారా? నిర్వహించి ఉంటే ఎలాంటి లోపాలు గుర్తించారు? ఏవైనా నోటీసులు ఇచ్చారా? అనుమతులు లేకుంటే చర్యలు ఎందుకు తీసుకోలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

## ఫీజులు.. వసతులపై లెక్క తేల్చాలి

విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న ఫీజులు, వాటికి అందిస్తున్న సౌకర్యాలపై కూడా అధికారులు సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఎంత ఫీజు వసూలు చేస్తున్నారు? ఏ పేరుతో వసూలు చేస్తున్నారు? రసీదులు ఇస్తున్నారా? విద్యార్థుల వసతుల కోసం ఎంత ఖర్చు చేస్తున్నారు? వంటి అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

## విచారణకు ఆదేశించాలి

చిన్నారుల విద్య, ఆరోగ్యం, భద్రతకు సంబంధించిన వ్యవహారం కావడంతో అన్నారం గ్రామంలోని ఈ కేంద్రంపై సమగ్ర తనిఖీ నిర్వహించి, అనుమతులు, విద్యార్థుల వివరాలు, పాఠశాల రికార్డులు, సిబ్బంది అర్హతలు, ఫీజుల వసూళ్లు, వసతి–పారిశుధ్య పరిస్థితులు, భద్రతా ప్రమాణాలను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, ఎలాంటి తప్పిదం లేకపోతే అనుమానాలకు తెరదించేందుకు అధికారులు వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరుతున్నారు.

## ఎంఈఓ ధర్మానాయక్ వివరణ

ఈ విషయంపై మండల విద్యాధికారి ధర్మనాయక్‌ను వివరణ కోరగా.. ఈ విషయం ఇప్పుడే తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. కేంద్రాన్ని పరిశీలించి, అవసరమైన అనుమతులు ఉన్నాయా? లేదా? అనే అంశాన్ని నిర్ధారించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీంతో అధికారులు చేపట్టబోయే తనిఖీపై ఆసక్తి నెలకొంది. తనిఖీలో అసలు వాస్తవాలు ఏమిటో.. కేంద్రం నిర్వహణకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? విద్యార్థులకు నిబంధనల మేరకు వసతులు కల్పిస్తున్నారా? ఫీజుల వసూళ్లకు సంబంధించి నిబంధనలు పాటిస్తున్నారా? అన్నది తేలాల్సి ఉంది.

# హైస్కూల్ లేని మండలం.. పలిమెల విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం!

- 5వ తరగతి దాటితే పక్క ఊళ్లకు పయనం
- 14 పాఠశాలలు ఉన్నా స్థానికంగా పదో తరగతి చదివే వెసులుబాటు శూన్యం
- ఎంపీయూపీఎస్ ను హైస్కూల్ గా అప్ గ్రేడ్ చేయాలని స్థానికుల డిమాండ్

**ప్రజా వాయిస్ పలిమెలా** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లేకపోవడంతో విద్యార్థుల ఉన్నత విద్య కలగానే మారుతోంది. మండలంలో 11 ప్రాథమిక, 2 ఎంపీయూపీఎస్, ఒక కేజీబీవీ పాఠశా లలు ఉన్నప్పటికీ, పదో తరగతి వరకు చదువుకునే వెసులుబాటు స్థానికంగా లేదు.ఐదో తరగతి దాటాక విద్యార్థులు దూర ప్రాంతాల్లోని హాస్టళ్లకు లేదా పక్క మండలాలకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఆర్థిక భారంతో పాటు రవాణా సౌకర్యం లేక ముఖ్యంగా బాలికలు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడింది. మండల కేంద్రంలోని ఎంపీయూపీఎస్ పాఠశాలను తక్షణమే హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేస్తే వందలాది మంది విద్యార్థులకు మేలు జరుగుతుందని గ్రామస్థులు కోరుతున్నారు. విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పలిమెల ఎంపీయూపీఎస్ ను వెంటనే ఉన్నత పాఠశాలగా మార్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.





# డిఫాల్ట్ మిల్లర్ల నుంచి బకాయిలు గుంజేయాలి

- నెల రోజుల్లో మొత్తం వసూలు కావాల్సిందే
- ఆర్ ఆర్ యాక్ట్ ప్రకారం ఆస్తులు గుర్తించి చర్యలు
- తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లు సమన్వయంతో పనిచేయాలి
- సమీక్షా సమావేశంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశం

**ప్రజా వాయిస్ పెద్దపల్లి** డిఫాల్ట్ రైస్ మిల్లర్ల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలను ఆర్‌ఆర్ (రెవెన్యూ రికవరీ) యాక్ట్ ప్రకారం నెల రోజుల్లోగా పూర్తిస్థాయిలో వసూలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను స్పష్టంగా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ బి.శ్రీరాములుతో కలిసి డిఫాల్ట్ మిల్లర్ల బకాయిల రికవరీపై సంబంధిత అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. డిఫాల్ట్ మిల్లర్లు ప్రభుత్వానికి చెల్లించాల్సిన ధాన్యం విలువను లెక్కగట్టి, వారి ఆస్తులను తక్షణమే గుర్తించాలని స్పష్టం చేశారు. బకాయిల రికవరీ కోసం తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లు పరస్పర సమన్వయంతో పక్కా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. మిల్లర్లకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి ఆస్తుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.చట్టప్రకారం చేపట్టాల్సిన ఆస్తుల జప్తు, వసూళ్ల ప్రక్రియను వెంటనే ప్రారంభించి, ఇచ్చిన గడువులోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి అలసత్వానికి తావులేకుండా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ ఉండాలని అధికారులకు తేల్చి చెప్పారు. ఈ సమావేశంలో ఆర్డీవో బి.గంగయ్య, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి గనిలో భారీ ప్రమాదం

- ఎయిర్ ట్యాంకర్ పేలి ఏడుగురికి గాయాలు

**ప్రజా వాయిస్ రామగిరి** మండలంలో ఉన్న సింగరేణి ఆర్‌జీ–3 ఏరియాలోని అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు (ఏఎల్పీ)లో గురువారం తెల్లవారుజామున ప్రమాదం సంభవించింది. గనిలోని ఎయిర్ ట్యాంకర్ భారీ శబ్దంతో పేలిపోవడంతో తీవ్ర కలకలం రేగింది. నైట్‌షిఫ్ట్ విధి నిర్వహణ ముగించుకుని కార్మికులు బయటకు వస్తున్న సమయంలో ఈ సంఘటన జరిగింది. ఈ పేలుడు ధాటికి ఐదుగురు కార్మికులు తీవ్రంగా గాయపడగా, మరో ఇద్దరు ఊపిరాడక/భయాందోళనతో అస్వస్థతకు గురయ్యారు.సమాచారం అందుకున్న వెంటనే తోటి కార్మికులు, అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. క్షేత్రస్థాయి ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను వెంటనే గోదావరిఖనిలోని సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా, ప్రమాదం జరగడానికి గల అసలు కారణాలపై సింగరేణి అధికారులు విచారణ చేపట్టాల్సి ఉంది. పేలుడు తీవ్రతపై భద్రతాధికారులు పూర్తిస్థాయిలో అధ్యయనం చేస్తున్నారు.




# మంచిర్యాల కాంగ్రెస్‌లో ముదురుతున్న అంతర్గత పోరు

- ఎమ్మెల్యే పీఎస్ ఆర్ వర్సెస్ మంత్రి వివేక్ –ఎంపీ వంశీ వర్గం
- మంతెన జగన్ మోహన్ రావు కీలక పాత్ర
- ఎమ్మెల్యే వ్యతిరేక వర్గం ఏకతాటిపైకి?

**ప్రజా వాయిస్ - మంచిర్యాల** మంచిర్యాల కాంగ్రెస్‌లో అంతర్గత రాజకీయాలు రోజురోజుకూ వేడెక్కుతున్నట్లు కనిపిస్తోంది. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు వర్గానికి వ్యతిరేకంగా మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీకృష్ణ వర్గాలు బలపడుతున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. ఈ పరిణామాల్లో మంతెన జగన్‌మోహన్‌రావు కీలకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం.ఈ నేపథ్యంలో గురువారం మంచిర్యాల అసెంబ్లీ పరిధిలోని లక్షింపేట, గుల్లకోట, దొరబండ, సింగరేణి ఏరియా ప్రాంతాలకు చెందిన పలువురు నేతలు హైదరాబాద్‌లోని మంత్రి వివేక్ క్వార్టర్స్‌లో ఆయన సమక్షంలో మంత్రి వర్గంలో చేరినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఉన్న నేతలు ఒక్కొక్కరుగా మంత్రి వర్గం వైపు అడుగులు వేస్తుండటంతో మంచిర్యాల కాంగ్రెస్‌లో కొత్త రాజకీయ సమీకరణాలకు తెరలేస్తున్నట్లు చర్చ జరుగుతోంది.మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో మాజీ మున్సిపల్ చైర్మన్, ప్రస్తుత కార్పొరేటర్ సురిమిండ్ల సౌమ్య వేణు సైతం మంత్రి–ఎంపీ వర్గం వైపు జెండా ఎగురవేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. మంచిర్యాల అసెంబ్లీ పరిధిలో తమ కుటుంబ రాజకీయ బలాన్ని మరింత పెంచుకునే దిశగా కార్యాచరణ సాగుతున్నట్లు సమాచారం.ఇప్పటివరకు ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుకు వ్యతిరేకంగా ఉన్న నేతలు ఒక్కొక్కరుగా ఒకే వేదికపైకి వస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగానే గురువారం అధిక సంఖ్యలో నేతలు మంత్రి వివేక్ చేతుల మీదుగా కండువాలు కప్పుకొని ఆయన వర్గంలో చేరినట్లు తెలుస్తోంది. ఈ చేరికల వెనుక మంతెన జగన్‌మోహన్‌రావు కీలకంగా వ్యవహరించినట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ సాగుతోంది.మంచిర్యాల కాంగ్రెస్‌లో పెరుగుతున్న ఈ అసంతృప్తి జ్వాలలు రాబోయే రోజుల్లో ఎలాంటి రాజకీయ సమీకరణాలకు దారితీస్తాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది అంటున్న పార్టీ కార్యకర్తలు.



# బీసీ ఉద్యమనేత 'గీకురు' అస్తమయం

- శోకసముద్రంలో చిగురుమామిడి..-
- కుటుంబానికి అండగా నిలవాలని మంత్రి పొన్నంకు విజ్ఞప్తి






**ప్రజా వాయిస్ చిగురుమామిడి** చిగురుమామిడి మండల కేంద్రానికి చెందిన బీసీ ఉద్యమ నేత, మాజీ సర్పంచ్, మాజీ జడ్పీటీసీ, ప్రస్తుత డిసిసి ఉపాధ్యక్షులు గీకూరు రవీందర్ (రవి) బుధవారం రాత్రి అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన ఆకస్మిక మృతితో మండల వ్యాప్తంగా తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. ప్రజా నాయకుడు, బీసీల కోసం గళమెత్తే బలమైన గొంతుకను కోల్పోయామని నియోజకవర్గ ప్రజలు శోకసముద్రంలో మునిగిపోయారు.

## పోలీస్ ఉద్యోగానికి స్వస్తి.. మలి దశ తెలంగాణ ఉద్యమంలో ...

సురక్షితమైన పోలీస్ ఉద్యోగాన్ని సైతం త్యాగం చేసి తెలంగాణ మలిదశ ఉద్యమంలో గీకురు రవి కీలక పాత్ర పోషించారు. గడపగడపకూ ఉద్యమ స్ఫూర్తిని నింపి మండలంలో ఉద్యమాన్ని ముందుండి నడిపించారు. బీఆర్ఎస్ పార్టీలో కీలక నాయకుడిగా ఎదిగినప్పటికీ, రాజకీయాలకు అతీతంగా బీసీ సంక్షేమం, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడారు. మండలంలోనే కాకుండా హుస్నాబాద్ నియోజకవర్గం వ్యాప్తంగా తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు.

## కొత్త నాయకత్వానికి అండగా నిలిచిన గికురు

రాజకీయాల్లో ఎంతోమందికి మార్గదర్శకుడిగా నిలిచి అనేకమందిని నాయకులుగా తీర్చిదిద్దిన ఘనత ఆయనది. కష్టాల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా నిలిచి 'నేనున్నానంటూ' ధైర్యాన్నిచ్చారు. ఆయన మరణంతో మండలంలో బీసీల గొంతుక మూగబోయిందని వివిధ బీసీ వర్గాలు, ప్రజా సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## మాతృపార్టీని కాదని పొన్నం గెలుపుకు కృషి..

గత శాసనసభ ఎన్నికల్లో హుస్నాబాద్ నుంచి తెలంగాణ ఉద్యమ నేత పొన్నం ప్రభాకర్ పోటీ చేసిన సమయంలో, గీకురు రవిందర్ తన మాతృపార్టీని సైతం పక్కనబెట్టి ఒక ఉద్యమకారుడిగా పొన్నం విజయం కోసం అహర్నిశలూ శ్రమించారు.

## కన్నీళ్లు పెట్టిస్తున్న కుటుంబ పరిస్థితి.. ప్రభుత్వాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి

రెండు సంవత్సరాల క్రితమే భార్య మరణించడంతో గీకురు రవికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఇప్పుడు తండ్రి కూడా అనారోగ్యంతో కన్నుమూయడంతో ఆ ఇద్దరు బిడ్డల పరిస్థితి అనాథగా మారి, కుటుంబ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా తయారైంది.మలిదశ ఉద్యమకారులకు, అమరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచినట్లే.. తెలంగాణ స్ఫూర్తిని నింపిన గీకురు కుటుంబానికి కూడా ప్రభుత్వం తక్షణమే సహాయం అందించాలని చిగురుమామిడి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిట్టంపెల్లి శ్రీనివాస్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, ఉద్యమకారులు డిమాండ్ చేస్తున్నారు. ఒక బీసీ నాయకుడిగా, తెలంగాణ ఉద్యమ నేతగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక శ్రద్ధ వహించి... గీకురు రవీందర్ కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని, ఇద్దరు కుమార్తెల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని పార్టీలకు అతీతంగా విజ్ఞప్తి చేస్తున్నారు.



## సమావేశంలో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

- కార్యక్రమంలో పాల్గొన్న ధర్మపురి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

**ధర్మపురి, సెప్టెంబర్ 03 (ప్రజా వాయిస్) :**జగిత్యాల జిల్లాలోని ధర్మపురి పట్టణ కేంద్రంలో గల స్థానిక ధర్మపురి నియోజక వర్గ శాసన సభ్యుడి క్యాంపు కార్యాలయం యందు గురువారం రోజు మధ్యాహ్నం వేళలో నిర్వహించిన మీడియా సమావేశం నందు తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి పలు అంశాలను వారికీ తెలియజేశారు. జగిత్యాల జిల్లాలోని ధర్మపురి పట్టణ కేంద్రంలో గల స్థానిక నైట్ కళాశాలను ప్రారంభించడంతో పాటు, జగిత్యాల జిల్లాలోని ధర్మపురి మండలం లోని నేరెళ్ల గ్రామ సమీపంలో సుమారు 200 కోట్ల రూపాయలతో ఇంటి గ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి మీడియాకు తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలో అభివృద్ధి పనుల నిమిత్తం వివిధ శాఖల నిధుల ద్వారా సుమారు 141 కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులను చేపట్టినట్లు మంత్రి వారికీ వివరించారు. ధర్మపురి లోనే ప్రజలకు అందు బాటులో ఉంటు ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నట్లు మంత్రి అడ్లూరి పేర్కొన్నారు.ధర్మపురి నియోజకవర్గంలో శాశ్వత త్రాగు నీటి, సాగు నీటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఇందులో భాగంగానే అమృత పథకం ద్వారా రెండు నూతన నీళ్ల ట్యాంకులను నిర్మించినట్లు మంత్రి మీడియాకు సమావేశం ద్వారా తెలిపారు. ధర్మపురి ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ధర్మపురి రెవెన్యూ డివిజన్ సాధించడంతో పాటు, ధర్మపురికీ బస్ డిపో ఏర్పాటు చేస్తాం అని, అదే విధంగా ధర్మపురి లోనే సబ్ ట్రెజరీ కార్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తానని మంత్రి వారికీ వివరించారు. ఇట్టి కార్యక్రమంలో వారితో పాటు, అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యాలయంలో రాజకీయ సమావేశం ఎందుకు?

- సర్పంచ్ , ఉపసర్పంచ్ లేకుండా సర్పంచ్ భర్తకు సమావేశం పెట్టే అధికారం ఎవరిచ్చారు?
- ప్రభుత్వ పంచాయతీ కార్యాలయమా.. కాంగ్రెస్ పార్టీ కార్యాలయమా?
- అధికారులు వెంటనే స్పందించి విచారణ జరపాలి
- వార్డు సభ్యులు.



**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా:** శాయంపేట మండలం:/ హనుమకొండ జిల్లా భూపాలపల్లి నియోజకవర్గం శాయంపేట మండలం నేరేడుపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్, ఉపసర్పంచ్ లేకుండా సర్పంచ్ భర్త కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించడంతో పాటు విలేకరుల సమావేశం నిర్వహించడంపై వార్డు సభ్యులు పోరండ్ల చరణ్, ఏకెళ్లి సందీప్ అభ్యంతరం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 1న గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మడికొండ ఇందిర, ఉపసర్పంచ్ లేకుండా సర్పంచ్ భర్త రాజకీయ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారని వారు ఆరోపించారు. అనంతరం అదే కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించడంపై ప్రశ్నించారు.

### పంచాయతీ కార్యాలయమా.. పార్టీ కార్యాలయమా?

ప్రభుత్వానికి చెందిన గ్రామపంచాయతీ కార్యాలయంలో రాజకీయ సమావేశాలు నిర్వహించడం ఎంతవరకు సమంజసమని వార్డు సభ్యులు ప్రశ్నించారు. గ్రామ అభివృద్ధి, ప్రజా పరిపాలన, అధికారిక కార్యక్రమాలకు మాత్రమే పంచాయతీ కార్యాలయాన్ని వినియోగించాల్సి ఉండగా రాజకీయ కార్యక్రమాలు నిర్వహించడం ఏమిటని నిలదీశారు. "సర్పంచ్, ఉపసర్పంచ్ లేకుండా సర్పంచ్ భర్తకు సమావేశం నిర్వహించే అధికారం ఎక్కడిది? ఎవరిచ్చారు?"అని వారు ప్రశ్నించారు.

### అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి:

ఈ ఘటనపై అధికారులు తక్షణమే స్పందించి పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యులు డిమాండ్ చేశారు. భవిష్యత్తులో గ్రామపంచాయతీ కార్యాలయాలను రాజకీయ కార్యక్రమాలకు వినియోగించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ విషయంపై జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వార్డు సభ్యులు తెలిపారు.

### ప్రతిరోజు రెండు గ్రామాలు తిరగవలసిన ఎంపీవో ఎక్కడ..?

నిరంతరం గ్రామాలను సందర్శిస్తూ గ్రామ అధికారులకు పాలకవర్గానికి తగు సూచనలు ఇస్తూ పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించవలసిన ఎంపీ ఓ ముఖ్యంగా మౌలిక సౌకర్యాలు తాగునీరు పారిశుద్ధ్యం వీధిలైట్ల నిర్వహణ గ్రామ సభల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించవలసిన అధికారి చుట్టపు చూపుగా వచ్చి వెళ్లిపోవడంతో ప్రజా ప్రతినిధుల కుటుంబ సభ్యులు అవగాహన లోపంతో గ్రామపంచాయతీలో మీటింగ్లు నిర్వహించడం. కింది స్థాయి అధికారులకు పని అప్ప చెప్పి చేతులు దులుపుకోవడంతో సర్పంచ్ భర్త రాజకీయ నాయకులతో గ్రామపంచాయతీలో సమావేశాలు ఏర్పాటు చేసినట్లు కొందరు ప్రజలు అధికారుల పనితీరును తప్పుపడుతున్నారు. ఇలాంటి సంఘటనలు ఫోన్ ప్రభుత్వం కాకుండా ఉండాలంటే గ్రామ సర్పంచి. సంబంధిత మండలాధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్న మండల ప్రజలు.

### గ్రామ పంచాయతీ కార్యదర్శి రాధిక వివరణ కోరగా..

సర్పంచ్ భర్త గ్రామ పంచాయతీలో సమావేశం ఏర్పాటు చేసిన రోజు నేను లీవ్ లో ఉన్నానని ఇట్టి విషయంపై గ్రామాల్లో తెలుసుకొని సంబంధిత మండల అధికారులకు తెలియజేస్తానని తెలిపారు.

### ఎంపీ ఓ రంజిత్ వివరణ కోరగా

గ్రామపంచాయతీలో సర్పంచ్ భర్త పార్టీ సమావేశం ఏర్పాటు చేసిన సంఘటన తన దృష్టికి వచ్చిందని దీనిపై విచారణ చేపట్టి సంబంధిత జిల్లా ఉన్నతాధికారులకు నివేదికను పంపించడం జరుగుతుందని తెలిపారు.

### ఎంపీడీవో వివరణ కోరగా

గ్రామపంచాయతీలో పార్టీ సమావేశాలు ఏర్పాటు చేసిన సంఘటన తన దృష్టికి వచ్చిందని సంబంధిత ఎంపీ ఓ ని విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. సంబంధిత జిల్లా పంచాయతీ రాజ్ అధికారికి నివేదికలు సమర్పిస్తామని తేలిపారు.

## పదవి ఉంటేనే ప్రజల్లో ఉంటారా?

- అధికారం ఉన్నప్పుడు హడావుడి.. ఇప్పుడు నిశ్శబ్దం!
- ఓటమితో మారిన రాజకీయం.. రంజిత్ రెడ్డి ఎక్కడ?
- చేవెళ్ల పార్లమెంట్ ఇంచార్జ్ గా నియమించిన కాంగ్రెస్ పార్టీ
- ప్రజలకు దూరమైతే రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం పడే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ



**ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో:** ఎన్నికల్లో గెలుపోటములు సహజమే. కానీ ప్రజాప్రతినిధిగా ఉన్న సమయంలో ప్రజల మధ్య కనిపించిన నేతలు.. ఓటమి తర్వాత కూడా అదే ప్రజలతో మమేకమై ఉండాలనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో మాజీ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి ప్రజలకు దూరంగా ఉన్నారనే చర్చ ప్రస్తుతం చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో జోరుగా సాగుతోంది.గత లోక్‌సభ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన రంజిత్‌రెడ్డి.. చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. అయితే ఎన్నికల్లో ఘోర పరాజయం ఎదురైంది. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఆయనకు చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించింది. పార్టీ కార్యక్రమాల్లో ఆయన పాత్ర ఉన్నప్పటికీ, గతంలో ఎంపీగా ఉన్న సమయంలో మాదిరిగా ప్రజా సమస్యలపై ప్రత్యక్షంగా స్పందిస్తూ ప్రజల్లో కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### ఎంపీగా ఉన్నప్పుడు హడావుడి.. ఇప్పుడు నిశ్శబ్దమేనా?

బీఆర్ఎస్ ఎంపీగా ఉన్న సమయంలో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలను కలుసుకున్న రంజిత్‌రెడ్డి.. సమస్యల పరిష్కారం కోసం అధికారులను కలుస్తూ, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేవారని ఆయన అనుచరులు గుర్తు చేస్తున్నారు. అయితే పదవి కోల్పోయిన తర్వాత ఆయన ప్రజా కార్యక్రమాలకు దూరంగా ఉండటం పట్ల పలువురు ప్రశ్నలు సంధిస్తున్నారు.

### ఇంతకీ ప్రజల్లోకి వస్తారా?

చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా కీలక బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. ఓటమి వచ్చినా ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యలపై పోరాడితేనే రాజకీయంగా విశ్వసనీయత కొనసాగుతుందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.ఓటమితో రాజకీయ ప్రయాణం ఆగిపోదు.. ప్రజలకు దూరమైతే మాత్రం రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం పడే అవకాశం ఉందనే చర్చ ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో సాగుతోంది.

## కేటీఆర్ రైతు ధర్నాకు ఎమ్మెల్యే బత్తుల కౌంటర్ అటాక్

- పదేళ్ల బీఆర్ ఎస్ పాలనలో రైతులకు ఏం చేశారో చెప్పాలి
- మిర్యాలగూడలో వేలాదిమందితో కాంగ్రెస్ నిరసన ర్యాలీ
- ప్రభుత్వం సంక్షేమ,అభివృద్ధి పథకాలను గ్రామగ్రామానికి తీసుకు వెళతాం
- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి.



**ప్రజా వాయిస్,మిర్యాలగూడ:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్వహిస్తున్న రైతు మహాధర్నాకు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు గట్టి కౌంటర్ ఇచ్చాయి. రైతుల సమస్యలపై కేటీఆర్ ధర్నా నిర్వహించడాన్ని నిరసిస్తూ నియోజకవర్గంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. వేలాది మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, యువత పాల్గొని బీఆర్ఎస్ పాలనపై నినాదాలు చేశారు.

### ప్లకార్డులతో ర్యాలీగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు..

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులకు జరిగిన అన్యాయాలను ప్రజలకు వివరించారు. అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో అమలు చేస్తున్న రైతు, ప్రజా సంక్షేమ పథకాలను ప్రచారం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. పదేళ్లు అధికారంలో ఉండి రైతుల సమస్యలను పట్టించుకోని బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు రైతుల సమస్యలపై ధర్నా చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రైతులకు ఇచ్చిన హామీల అమలుపై కేటీఆర్ ముందుగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత పాలనలో రైతుల కోసం ఏం చేశారో ప్రజలకు వివరించిన తర్వాతే ప్రస్తుత ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని సూచించారు.రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యమని అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. రైతు సంక్షేమం, ప్రజా సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

### మిర్యాలగూడ నుంచే రాజకీయ సమాధానం

కేటీఆర్ రైతు మహాధర్నా నేపథ్యంలో మిర్యాలగూడలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. బీఆర్ఎస్ విమర్శలకు మిర్యాలగూడ నుంచే ప్రజా సమీకరణతో సమాధానం అని అన్నారు.గత పాలనలో రైతులకు జరిగిన అన్యాయాలను ప్రజలకు వివరిస్తూనే.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామగ్రామాన తీసుకెళ్తామని తెలిపారు. బీఆర్ఎస్ రాజకీయ విమర్శలను ప్రజల్లో ఎండగడతామని కాంగ్రెస్ పేర్కొన్నారు.ఈ నిరసన ర్యాలీలో నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతులను నట్టేటా ముంచారు!

- కనిపించిన ప్రతి గుడిలో ఒట్లు వేసింద్రు
- కాంగ్రెస్ పై మెతుకు ఆనంద్ ధ్వజం
- కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనను నిరసిస్తూ కోట్ పల్లిలో రైతు ధర్నా

**ప్రజావాయిస్/కోట్‌పల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో రైతులకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సమరభేరి కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు కోట్‌పల్లి మండల కేంద్రంలో చేపట్టిన రైతు ధర్నాలో వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, శ్రీశైల్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మెతుకు ఆనంద్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపించారు. "కేసీఆర్ హయాంలో ఎకరాకు రూ.10 వేల రైతుబంధు అందించాం. తాము అధికారంలోకి వస్తే ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి రైతులను మోసం చేశారు" అని విమర్శించారు.రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని, ఇప్పటికీ రుణమాఫీ కాని రైతులు అనేక మంది ఉన్నారని ఆయన అన్నారు. రైతు బీమా కింద అందే రూ.5 లక్షల విషయంలోనూ రైతులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. రైతుల సమస్యలపై బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు సుందరి అనిల్,తాజా మాజీ ప్రజా ప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## ఒంటిగంటకే స్కూల్‌కు తాళం!

- చదువుల వేళలోనే పిల్లలకు సెలవు
- పాఠశాల సిబ్బంది తీరుపై తల్లిదండ్రుల ఆగ్రహం

**ప్రజా వాయిస్/మోమిన్‌పేట్:** విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన పాఠశాలలోనే నిర్లక్ష్యం తాండవిస్తోంది. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని చంద్రశేఖర్ నగర్ ప్రాథమిక పాఠశాలకు మధ్యాహ్నం ఒంటిగంటకే తాళం వేసి, విద్యార్థులను ఇళ్లకు పంపించారనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.పాఠశాల సమయాలు పూర్తికాకముందే పిల్లలను ఇంటికి పంపించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారుల చదువుపై శ్రద్ధ చూపాల్సిన సమయంలో పాఠశాలకు తాళం వేయడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు.పిల్లల భవిష్యత్తుతో చెలగాటమా? అంటూ తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నప్పటికీ, కొందరి నిర్లక్ష్యం కారణంగా ఆ లక్ష్యం నీరుగారుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పాఠశాలలు నిర్ణీత సమయం వరకు నిర్వహించబడుతున్నాయా? విద్యార్థులను ముందుగానే ఇళ్లకు ఎందుకు పంపించారు? అనే అంశాలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు తక్షణమే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.చిన్నారుల చదువును నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని, పాఠశాలల పనితీరుపై అధికారులు నిఘా పెట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## పాల్వాయిలో రైతులకు ప్రత్యేక శిక్షణ

- నానో ఎరువులతో పంట దిగుబడులు పెంచే విధానంపై అవగాహన
- చీడపీడలు, తెగుళ్ల నివారణపై శాస్త్రవేత్త కీలక సూచనలు
- ఎరువులను సిఫార్సు మోతాదులోనే వాడాలి
- సన్నరకాల వరి రైతులు ఈ నెల 10లోపు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి

**ప్రజా వాయిస్ : గుర్రంపోడు** మండలం,నల్గొండ జిల్లా, గుర్రంపోడు మండలం లో పాల్వాయి రైతు వేదికలో ఏటీఎంఏ–ఆర్పీఎల్ ఆధారిత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాలియా సహాయ వ్యవసాయ సంచాలకురాలు సరిత, మండల వ్యవసాయ అధికారి మాధవరెడ్డి హాజరయ్యారు.కంపసాగర్ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త బి. అనిల్‌కుమార్ రైతులకు నానో ఎరువుల వినియోగం, ప్రాముఖ్యత, పంటల వివిధ దశల్లో వినియోగించే విధానం, ప్రయోజనాలను వివరించారు. శాస్త్రీయ పద్ధతిలో సిఫార్సు చేసిన మోతాదులో నానో ఎరువులను వినియోగించాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పంటలకు ఆశించే చీడపీడలు, తెగుళ్లు, వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.సన్నరకాల వరి సాగు చేస్తున్న రైతులు తాము విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్ వద్ద ఈ నెల 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సరిత సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు పి. భగీరథ, మనోజ్, నేతాజీ, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.






# మనోహర్‌రెడ్డి అవినీతి చిట్టా ఇదేనా..?

- భూవ్యవహారాల నుంచి ఇసుక మాఫియా వరకు!
- మేము చేసిన ప్రతి ఆరోపణకు ఆధారాలు చూపిస్తాం
- ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారా?
- తాండూరు ఎమ్మెల్యేపై బీఆర్ ఎస్ నేతల ప్రశ్నల వర్షం

**ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో:** తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిపై బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కంటే భూవ్యవహారాలపైనే ఎమ్మెల్యే కుటుంబానికి ఆసక్తి ఉందని విమర్శించారు. ఫ్యూచర్ సిటీ సమీపంలోని తుమ్మలూరులో వివాదాస్పదంగా ఉన్న 24 ఎకరాల భూమి కొనుగోలు, ఇబ్రహీంపట్నం పరిధిలో 33 ఎకరాల ప్రభుత్వ భూమి వ్యవహారం, వికారాబాద్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సుమారు 250 ఎకరాల భూముల లావాదేవీలపై అనేక అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు.డీసీసీబీ చైర్మన్‌గా ఉన్న సమయంలో టెండర్లు లేకుండా నిర్మాణ పనులు కాంట్రాక్టర్‌కు అప్పగించడం, గోదాములు, రైస్‌మిల్లులు, పెట్రోల్ బంకుల పనులు మధ్యలోనే నిలిచిపోవడం వల్ల సహకార సంఘాలు ఆర్థిక ఇబ్బందుల్లోకి వెళ్లాయని పేర్కొన్నారు.అదేవిధంగా తాండూరులో ఇసుక అక్రమ రవాణా, ఎర్రమట్టి తవ్వకాలు, గుట్టల విధ్వంసం జరుగుతున్నా ఎమ్మెల్యే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఆలయాల ఖాళీ స్థలాల్లో దుకాణాల నిర్మాణం, కోఆప్షన్ సభ్యుల ఎంపికపై కూడా ఆరోపణలు చేశారు. తాండూరు–వికారాబాద్ రహదారి నిర్మాణ బడ్జెట్ పెంపుపైనా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.తమ ఆరోపణలకు ఎమ్మెల్యే స్పష్టమైన సమాధానం ఇవ్వాలని, అవినీతి ఆరోపణలు నిజం కాదని నిరూపించేందుకు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారా? అంటూ బీఆర్ఎస్ నాయకులు సవాల్ విసిరారు.



# ఓడేడులో ఆక్రమణల పర్వం..

- ముంపునకు గురవుతున్న నివాసాలు
- సర్పంచ్ తమ ఇంటి ముందు అక్రమంగా కాలువ తవ్వి వదిలేశారు
- దాసరి రమేష్ ఆవేదన

**ప్రజా వాయిస్ ముత్తారం** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల పరిధిలోని ఓడేడు గ్రామంలో వెంకటేశ్వర్లపల్లె ప్రాంతానికి చెందిన నీటి పారుదల కాలువ ఆక్రమణలకు గురికావడంతో పాటు, అనుమతులు లేకుండా ప్రైవేటు వ్యక్తుల నివాసాల ముందు తవ్వకాలు జరపడంపై బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధితుడు దాసరి రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... ఓడేడు – వెంకటేశ్వర్లపల్లె సరిహద్దుల గుండా పొలాలకు సాగునీరు అందించే నీటి కాలువను కొందరు వ్యక్తులు ఆక్రమించి దున్నుకోవడంతో పాటు మోరీని మూసివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పక్కనే ఉన్న కాలువ నీటి ప్రవాహం నిలిచిపోయి, నీరంతా ఉద్ధృతంగా ప్రవహిస్తూ తమ ఇళ్లను ముంచెత్తుతోందని వాపోయారు. ఇంట్లోకి నీరు చేరడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా తమ ఇంటి ముందు అక్రమంగా కాలువ తవ్వి వదిలేశారని దాసరి రమేష్ ఆరోపించారు. ఈ సమస్యపై ప్రశ్నించగా, తమకు ఎటువంటి సంబంధం లేదని, 'మీ నాలుగిళ్లకు మాకు సంబంధం లేదు, మీరేం చేసుకుంటారో చేసుకోండి' అంటూ నిర్లక్ష్యంగా, దౌర్జన్యంగా మాట్లాడారని రమేష్ తీవ్ర ఆవేదన చెందారు. అక్రమ తవ్వకాలు, కాలువల ఆక్రమణల వల్ల ఇళ్లు దెబ్బతింటున్నందున వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి విచారణ జరిపించి, తమకు న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

# కాగ్న వాగు నుండి అక్రమ ఇసుక రవాణా

- ట్రాక్టర్ పట్టివేత

**ప్రజావాయిస్ /యాలాల్:**ఎలాంటి ప్రభుత్వ అనుమతి పత్రాలు లేకుండా కాగ్న వాగు నుండి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ ను పోలీసు అధికారులు పట్టుకున్నారు.బుధవారం సాయంత్రం సుమారు 6 గంటల ప్రాంతంలో తాండూర్ – కోడంగల్ ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ అక్రమ రవాణా వెలుగులోకి వచ్చింది. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ నెం.టీజీ 34 టి 6038 ను అధికారులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ట్రాక్టర్ డ్రైవర్ ముకుందం గా గుర్తించారు.అనుమతి లేకుండా ఇసుక, మట్టి, గ్రావెల్ వంటి ఖనిజాలను అక్రమంగా రవాణా చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, వాహనాలు సీజ్ చేసి భారీ జరిమానాలు విధిస్తామని ఎస్సై విట్టల్ రెడ్డి హెచ్చరించారు.



# మండల స్థాయి ఎస్‌జీఎఫ్ విజేతలకు ఘన సత్కారం

- దేవురుప్పుల మండల కేంద్రంలోని కేజీబీవీ అభివృద్ధికి రూ. 38 లక్షలు
- తరగతి గదులు టాయిలెట్లు శానిటేషన్ పనులకు శంకుస్థాపన
- విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో క్రీడాలు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయి
- విద్యార్థులు చదువుతోపాటు క్రీడాలను ఆసక్తి పెంచుకొని మా ప్రతిభను నిరూపించుకోవాలి.
- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి చేతుల మీదుగా ట్రోఫీలు, మెడల్స్, ప్రశంసా పత్రాలు ప్రదానం



**ప్రజా వాయిస్ /పాలకుర్తి /సెప్టెంబర్ 03**పాలకుర్తి నియోజకవర్గం, సెప్టెంబర్ 3: పాలకుర్తి మండలంలోని జే.తొర్రూరు గ్రామంలో నిర్వహించిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ) క్రీడా పోటీల ముగింపు కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందజేశారు.

## క్రీడలతో విద్యార్థుల్లో సమగ్ర అభివృద్ధి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో క్రీడలు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. క్రీడలు కేవలం శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జట్టు భావన, నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ఆసక్తి పెంచుకుని తమ ప్రతిభను నిరూపించుకోవాలని సూచించారు.

## గ్రామీణ ప్రతిభకు క్రీడా పోటీలు మంచి వేదిక

గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ కలిగిన విద్యార్థులు ఉన్నారని, వారికి ఇలాంటి మండల స్థాయి పోటీలు మంచి వేదికగా నిలుస్తాయని ఎమ్మెల్యే అన్నారు. విద్యార్థులు అందివచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకుని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించాలని ఆకాంక్షించారు. క్రీడల్లో ప్రతిభ చూపే విద్యార్థులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు.

## విజేతలకు ట్రోఫీ లు, మెడల్స్ అందజేత

పోటీల్లో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి చేతుల మీదుగా ట్రోఫీ లు, మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. విజేతలను అభినందిస్తూ ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థి గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యతో పాటు క్రీడల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన క్రీడా సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

## దేవురుప్పుల మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యాలయం లోవిద్యార్థుల సౌకర్యమే లక్ష్యం..

కేజీబీవీ అభివృద్ధికి రూ. 38 లక్షలు విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని సంకల్పంతో దేవరుప్పుల మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో అదనపు తరగతి గదులు టాయిలెట్లు సానిటేషన్ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. దేవరుప్పుల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం లో రూ. 38 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. మౌలిక వసతులు మలోపితమే ప్రభుత్వ లక్ష్యంగా కేజీబీవీ లో అదనపు తరగతి గదులు టాయిలెట్లు సానిటేషన్ తో పాటు ఇతర మౌలిక వసతులు అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అదనపు తరగతి గదుల నిర్మాణంతో విద్యార్థులకు మరింత సౌకర్యవంతమైన విద్యావాతవరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులను బలోపేతం చేసి విద్యార్థులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించేందుకే నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఆడబిడ్డలకు విద్యకు పెట్టే ప్రతి రూపాయి భవిష్యత్తుకు పెట్టుబడి విద్యార్థులు ఆరోగ్యం పరిశుభ్రతకు ప్రార్ధన ఇస్తూ టాయిలెట్లు సానిటేషన్ సౌకర్యాలను మెరుగుపరుస్తున్నామని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. విద్యార్థులు నాణ్యమైన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు కేజీబీవీ పాఠశాల అభివృద్ధికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పనకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, క్రీడా నిర్వాహకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

# కర్రెగుట్టల్లో మందుపాతర పేలి వ్యక్తి మృతి

- వెదురు బొంగుల కొరకు గుట్టపైకి వెళ్లిన మృతుడు
- మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం



**వెంకటాపురం ప్రజావాయిస్ :**ఆపరేషన్ కగార్ ముగిసిందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన, మావోయిస్టు రహిత రాష్ట్రం గా తెలంగాణ ఉందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికి కర్రెగుట్టల్లో పోలీసులే లక్ష్యంగా మావోయిస్టులు అమర్చిన మందు పాతర్లకు అమాయక గిరిజనులు బలవుతున్న ఘటనలు కర్రెగుట్టల్లో జరుగుతూనే ఉన్నాయి.ములుగు జిల్లా వెంకటాపురం మండల పరిధిలోని నూగురు కాలనీకి చెందిన ఆరుగురు గిరిజనులు వెదురు బొంగు సేకరణ కొరకై సోమవారం కర్రెగుట్టల పైకి వెళ్లారు తిరుగు ప్రయాణ సమయంలో మావోయిస్టులు మందుపాతరపై మడకం నాగేశ్వరరావు(55) గిరిజనుడు కాలు వేయడంతో మందు పాతర పేలుడు దాటికి తీవ్ర గాయాలు అయ్యాయని మృతుడితోపాటు ఉన్న గిరిజనులు తెలిపారు. తోటి గిరిజనులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం ఉదయాన్నే వెదురు బొంగుల సేకరణ కొరకై కర్రెగుటలపైకి వెళ్లామని, బుధవారం ఉదయం గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యామని తిరుగు ప్రయాణం దారిలో ఈ ఘటన జరిగిందని, ఘటన జరిగినా అనంతరం భయ భ్రాంతులకు గురయ్యామని, ఆ తర్వాత లుంగీలు కండువాలతో జోల కట్టి తీవ్ర గాయాలతో పడి ఉన్న మడకం నాగేశ్వరరావుని కాలినడకన మూసుకొని వస్తుండగా పాలెం ప్రాజెక్టు సమీపానికి వచ్చేసమయానికి ప్రాణాలు విడిచాడని, గురువారం ఉదయానికి గ్రామానికి చేరుకున్నామని తెలిపారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఇలాంటి ఘటనలు జరగడం చాలా బాధాకరమని, కర్రెగుటల్లో నిరంతరం పోలీసులు మందు పాతరలను వెలికి తీసే పనిలో ఉన్నారని ప్రజలకు రక్షణ కల్పించడమే తమ ధ్యేయమని వెంకటాపురం పోలీసులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని శవ పంచనామా నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఎస్సై కే తిరుపతిరావు జరిగిన ఘటనపై విచారణ చేపట్టారు.

## హుటాహుటిన గ్రామానికి ఎమ్మెల్యే తెల్లం

కర్రెగుటల్లో జరిగిన ఘటన తెలియగానే తెల్లం వెంకటరావు భద్రాచలం నుండి హుటాహుటిన బయలుదేరి వెంకటాపురం చేరుకొని స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి నూగూర్ కాలనీలోని మృతుని కుటుంబాన్ని పరామర్శించి, మృతునికి ఘన నివాళి అర్పించారు. ఈ ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు మాట్లాడుతూ మావోయిస్టులు అమర్చిన మందు పాతర పేలి అమాయక గిరిజనులు మృతి చెందడం చాలా బాధాకరమని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మోహన్ రావు,సయ్యద్ హుస్సేన్, బాలసాని వేణు, శివ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు శాంక్షన్ అయినా తీరని అవస్థలు!

- పలిమెలలో రైతుల కష్టాలు
- ఏడాది గడిచినా నత్తనడకన పనులు
- వర్షాకాలంలో బురదమయంగా మారుతున్న బాట
- స్పందించాలని జిల్లా అధికారులకు వినతి

**ప్రజా వాయిస్ పలిమెల** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండల కేంద్రంలో వ్యవసాయ భూములకు వెళ్లే సరైన రహదారి లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలిమెల పోలీస్ స్టేషన్ సర్కిల్ ప్రాంతం నుంచి గోదావరి తీరంలో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ పాత బావి వరకు సుమారు 3 నుంచి 4 కిలోమీటర్ల మేర రహదారి సౌకర్యం లేకపోవడంతో సాగు పనులు భారంగా మారాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## 500 ఎకరాలకు పైగా సాగు.. అయినా తిప్పలే:

ఈ ప్రాంతంలో సుమారు 5 నుంచి 6 వందల ఎకరాల వరకు వ్యవసాయ భూములు ఉన్నాయి. ప్రతి పంట కాలంలో ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పరికరాలు పొలాలకు తరలించాల్సి వస్తోంది. అయితే రహదారి సరిగా లేకపోవడంతో రైతులు, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు ఆ సామగ్రిని భుజాలపై మోసుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

## బురదలో ఎద్దుల బండి కూడా వెళ్లలేని పరిస్థితి:

ప్రస్తుతం ఉన్న పాత రహదారి వర్షాకాలంలో పూర్తిగా బురదమయంగా మారుతోంది. కనీసం ఎద్దుల బండి, ట్రాక్టర్లు కూడా వెళ్లలేని పరిస్థితి ఉండటంతో అత్యవసర సమయంలో వ్యవసాయ పనులు నిలిచిపోతున్నాయి. దీంతో పెట్టుబడి ఖర్చులు పెరగడమే కాకుండా రైతులు అదనపు శ్రమ, సమయాన్ని వెచ్చించాల్సి వస్తోంది.



## ఏడాది దాటినా ప్రారంభంకాని పనులు:

ఈ మార్గానికి ప్రభుత్వం రోడ్డు శాంక్షన్ చేసి సుమారు సంవత్సరం గడిచినా, క్షేత్రస్థాయిలో పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. రోడ్డు మంజూరైందన్న సంతోషం ఉన్నా, పనులు ప్రారంభం కాకపోవడంతో తమ కష్టాలు నిత్యకృత్యంగా మారాయని రైతులు వాపోతున్నారు.



## అధికారులు వెంటనే స్పందించాలి:

పోలీస్ స్టేషన్ సర్కిల్ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ పాత బావి వరకు మంజూరైన రహదారి పనులను జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి వెంటనే ప్రారంభించాలని స్థానిక రైతులు కోరుతున్నారు. వర్షాకాలంలో కూడా సునాయాసంగా రాకపోకలు సాగించేలా చర్యలు చేపట్టి, వందలాది ఎకరాల సాగు భూములకు మహర్దశ కలగజేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



# రోడ్ల ఆక్రమణల తొలగింపునకు గడువు

- రోడ్డు విస్తరణ పనులకు పట్టణ ప్రజలు సహకరించాలి
- పట్టణ మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్

**ప్రజా వాయిస్ జహీరాబాద్:** పట్టణ పరిధిలోని హనుమాన్ మందిర్ రోడ్డును 40 అడుగుల మేర విస్తరించేందుకు మున్సిపాలిటీ చర్యలు చేపట్టింది. రోడ్డుపై ఉన్న ఆక్రమణదారులు సెప్టెంబర్ 6లోగా ఆక్రమణలను తొలగించేందుకు అంగీకరించినట్లు మున్సిపల్ కమిషనర్ జి. ప్రభాకర్ తెలిపారు. రోడ్డు విస్తరణ పనులకు ప్రజలు సహకరించాలని, నిర్ణీత గడువులోగా ఆక్రమణలను తొలగించాలని కమిషనర్ కోరారు.

### లతీఫ్ రోడ్డులో ఆక్రమణల తొలగింపునకు గడువు

జహీరాబాద్ లతీఫ్ రోడ్డును 40 అడుగుల మేర విస్తరించేందుకు మున్సిపాలిటీ చర్యలు చేపట్టింది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణదారులు సెప్టెంబర్ 7లోగా ఆక్రమణలను తొలగించేందుకు అంగీకరించినట్లు మున్సిపల్ కమిషనర్ జి. ప్రభాకర్ తెలిపారు. రోడ్డు విస్తరణ పనులకు ప్రజలు సహకరించాలని, నిర్ణీత గడువులోగా ఆక్రమణలను తొలగించాలని కమిషనర్ కోరారు.



# మంథనిలో 2,000 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

- అక్రమ గుడుంబా తయారీపై పోలీసుల ఆకస్మిక దాడి

ప్రజా వాయిస్ మంథనిపట్టణ శివారులోని నిర్మానుష్య ప్రాంతంలో అక్రమంగా నిల్వ ఉంచిన 2,000 లీటర్ల బెల్లం పానకాన్ని మంథని పోలీసులు శనివారం ఆకస్మిక దాడి చేసి ధ్వంసం చేశారు. నమ్మదగిన సమాచారంతో సీఐ బుద్దె స్వామి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టిన సిబ్బంది, ప్లాస్టిక్ క్యాన్లు, డ్రమ్ముల్లో ఉన్న పానకాన్ని పంచుల సమక్షంలో నాశనం చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గుడుంబా తయారీ, నిల్వ, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ మద్యం సమాచారం తెలిస్తే పోలీసులకు అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ దాడిలో హెడ్ కానిస్టేబుళ్లు కృష్ణ నాయక్, రమేష్ రావు, కానిస్టేబుళ్లు శివ, అజిత్, సతీష్, అంజి పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వాడితే దుకాణాలు సీజ్

- మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ అరుణ్ కుమార్



**ప్రజా వాయిస్, కోరుట్ల:** పట్టణంలో నిషేధిత ప్లాస్టిక్ వాడుతున్న వ్యాపారులపై మున్సిపల్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇంచార్జ్ కమిషనర్ అరుణ్ కుమార్ ఆదేశాల మేరకు పట్టణంలోని బిర్యానీ, టిఫిన్ సెంటర్లు, స్వీట్ హౌస్‌లలో ఆకస్మిక తనిఖీలు చేసి, రూ. 30,000 జరిమానా విధించారు. ప్లాస్టిక్ వాడితే దుకాణాలు సీజ్ చేస్తామని, వ్యాపారులు వెంటనే ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలని కమిషనర్ హెచ్చరించారు. చెత్తను తడి, పొడిగా వేరుచేసి మున్సిపల్ వాహనాలకే అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, రికార్డ్ అసిస్టెంట్ జగదీష్, వార్డ్ఆఫీసర్లు వెంకటేష్, రాజు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# దుకాణాల వేలంపై అధికారుల 'మౌనం'!!

- మార్చిలో జరగాల్సిన వేలం.. సెప్టెంబర్ వచ్చినా ఉలుకు పలుకు లేదు
- ఐదు నెలలుగా కిరాయి పెండింగ్
- పంచాయతీ ఆదాయానికి గండి
- వారం రోజుల క్రితం నోటీసులు ఇచ్చినా ఫలితం శూన్యం



**ప్రజా వాయిస్ బూర్గుంపాడు** బూర్గుంపాడు గ్రామపంచాయతీకి చెందిన దుకాణాల వేలం వ్యవహారం రోజు రోజుకూ అనేక అనుమానాలకు, ప్రశ్నలకు తావిస్తోంది. మార్చి నెలలోనే జరగాల్సిన దుకాణాల వేలం ప్రక్రియ సెప్టెంబర్ వచ్చినా పూర్తికాకపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఐదు నెలలుగా వేలం ప్రక్రియ ఎందుకు పెండింగ్‌లో ఉంది? దీనికి బాధ్యులు ఎవరు? పంచాయతీకి రావాల్సిన ఆదాయం పరిస్థితి ఏమిటి? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.

### ఐదు నెలలుగా ఎందుకీ జాప్యం?...

పంచాయతీకి చెందిన వాణిజ్య దుకాణాలను నిర్ణీత కాలానికి వేలం వేసి, తద్వారా పంచాయతీకి ఆదాయం సమకూర్చాల్సి ఉంటుంది. అయితే మార్చిలో జరగాల్సిన వేలం ప్రక్రియ నెలలు గడుస్తున్నా ముందుకు సాగకపోవడంపై అధికారుల పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఒక సాధారణ వేలం ప్రక్రియను పూర్తి చేయడానికి ఇంత సమయం ఎందుకు పడుతోంది? మూడు రూములకు సంబంధించి వేలానికి సంబంధించిన నిబంధనలు పూర్తయ్యాయా? లేక ఉద్దేశపూర్వకంగానే ప్రక్రియను నెమ్మదిస్తున్నారా? అన్నది అధికారులే తేల్చాల్సి ఉంది.

### పంచాయతీ ఆదాయం సంగతేంటి?...

పంచాయతీకి ఆదాయం సమకూర్చే దుకాణాలే నెలల తరబడి వేలం కాకుండా ఉండటం వల్ల పంచాయతీ ఆదాయంపై ప్రభావం పడుతుందా? అన్నదే ప్రధాన ప్రశ్నగా మారింది.వేలం ద్వారా ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, ప్రక్రియ ఆలస్యం చేయడం వల్ల పంచాయతీకి ఆర్థిక నష్టం జరుగుతుందా? గత వేలం ద్వారా ఒక్కొక్క దుకాణానికి ఎనిమిది వేల రూపాయల పైచిలుకు కిరాయి చెల్లించే వారని ప్రస్తుతం నూతన పాలక వర్గం ఏర్పడిన తర్వాత దుకాణాల నుంచి నెల ఎటువంటి అద్దెలు రాకపోవడం పై అధికారుల పని తీరు పై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

### దుకాణదారులు అద్దెలు చెల్లిస్తున్నారా?...

దుకాణాల అద్దెలు.. వేలం ప్రక్రియ పెండింగ్‌లో ఉన్న ఈ ఐదు నెలల కాలంలో దుకాణాలను ఏ అధికారి అనుమతితో నిర్వహిస్తున్నారు? అద్దెలు చెల్లించకుండా దుకాణాలు కొనసాగుతున్నట్లయితే అధికారులు ఎందుకు స్పందించలేదు? ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషిస్తున్న అధికారి ఎవరు అనే ప్రశ్నలు ఇప్పుడు స్థానికంగా హాట్‌టాపిక్‌గా మారాయి.

### వారం రోజుల క్రితం నోటీసులు జారీ... ఫలితం శూన్యం...

దుకాణాల వ్యవహారంలో పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేసి వారం గడుస్తున్న కానీ మండల స్థాయి అధికారులు ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా పంచాయతీ శాఖ అధికారులు ఈ వ్యవహారంపై దృష్టి సారించాలని స్థానిక ప్రజల కోరుకుంటున్నారు.

# కొండాపురం లో బీ ఆర్ ఎస్ శ్రేణుల నిరసన ధర్నా

- 7 ఎల్ కాల్వ వెంట పెద్ద ఎత్తున ఆందోళన
- రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపణ
- .మాజీ మంత్రి ఎర్రబెల్లి



**ప్రజా వాయిస్ పాలకుర్తి**/సెప్టెంబర్ 03జనగామ జిల్లా: పాలకుర్తి మండలం కొండాపురం గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో రైతులకు చేసిన మోసాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన ధర్నా నిర్వహించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాల మేరకు 7ఎల్ కాలువ వెంట చేపట్టిన ఈ ఆందోళనలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులను మోసం చేస్తోందని ఆరోపించారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, సాగునీటి సమస్యలపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పసునూరి నవీన్, మాజీ ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, మాజీ జడ్పీటీసీ పుస్కురి శ్రీనివాస్‌రావు, జిల్లా నాయకులు బానోత్ మహేందర్, గడ్డం కిరణ్‌కుమార్, వేణు గౌడ్, నారాయణ గౌడ్‌తో పాటు మండల నాయకులు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు అన్యాయం జరగొద్దు



- పదవులపై నిర్ణయం అధిష్ఠానానిదే..
- రాహుల్ నిర్ణయానికి కట్టుబడి ఉంటా
- మునుగోడులో రూ.76.20 కోట్ల రహదారి పనులకు శంకుస్థాపన.
- త్రిబుల్ ఆర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు మెరుగైన పరిహారం అందేలా చొరవ తీసుకున్న.
- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

**ప్రజా వాయిస్,మునుగోడు.**పదేళ్లపాటు బీఆర్ఎస్‌పై పోరాడిన నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరగకూడదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఎవరికి ఏ పదవులు ఇవ్వాలనేది పార్టీ అధిష్ఠానం చూసుకుంటుందని, తమ నాయకుడు రాహుల్‌గాంధీ తీసుకునే ప్రతి నిర్ణయానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. మంత్రి పదవుల అంశంతో పాటు కొండా సురేఖ వ్యవహారం కూడా అధిష్ఠానం పరిధిలోనే ఉందని, అధిష్ఠానం నిర్ణయమే తుది నిర్ణయమని తెలిపారు.యాదాద్రి భువనగిరి జిల్లా మునుగోడు నియోజకవర్గంలో రూ.76.20 కోట్లతో చేపట్టనున్న పలు రహదారి అభివృద్ధి పనులకు రాజగోపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. సర్వేల్ నుంచి పలివెల, గుడిమల్కాపూర్ నుంచి చల్మెడ, నారాయణపూర్ నుంచి సర్వేల్ వరకు రోడ్లను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల మధ్య గతంలో ఉన్న 3.75 మీటర్ల రోడ్లను ప్రజల రాకపోకలకు అనుగుణంగా 5.5 మీటర్లకు విస్తరించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వానికి తానే విన్నవించానని చెప్పారు.తండాల రహదారుల అభివృద్ధికి కూడా ప్రాధాన్యమిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పొర్లగడ్డ తండా నుంచి పీసీ తండా క్రాస్‌రోడ్డు వరకు రూ.5.20 కోట్లు, పొర్లగడ్డ నుంచి గరికగడ్డ తండా వరకు రూ.1.20 కోట్లు, కేలోతు తండా నుంచి బండలేమునూరు వరకు రూ.6.60 కోట్లతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు.లచ్చమ్మగూడెం నుంచి అంతంపేట వరకు రూ.10.76 కోట్లు, అంతంపేట నుంచి శివన్నగూడెం వరకు రూ.13.50 కోట్లతో నిర్మించనున్న రోడ్ల పనులకు కూడా శ్రీకారం చుట్టారు. రోడ్ల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారం ఉందన్నారు.త్రిబుల్ ఆర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు మెరుగైన పరిహారం అందేలా చొరవ తీసుకున్నానని రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. రహదారి పనులు సజావుగా సాగేందుకు గ్రామస్థులు, అధికారులు, మీడియా ప్రతినిధులు సహకరించాలని కోరారు.

# "బిడ్డా ధనా' ఎక్కడున్నావురా..?"

- మానస సరోవర్ వరదల్లో మణికొండ వాసి గల్లంతు
- శివుడికి పరమ భక్తుడు' కైలాస దర్శనానికి వెళ్లి అదృశ్యం
- ఆచూకీ కోసం కన్నీరుమున్నీర వుతున్న కుటుంబం



**ప్రజా వాయిస్/రాజేంద్రనగర్:** వీపు, భుజాలు,చేతులపై శివుడి గుర్తులతో పచ్చబొట్లు, మనసంతా శివుడిపైనే భక్తి, అదే ఆధ్యాత్మిక భావనతో కైలాస పర్వత దర్శనం కోసం మానస సరోవర్ యాత్రకు వెళ్లారు.కానీ, ఆకస్మిక వరదల తర్వాత ఆయన ఆచూకీ తెలియకుండా పోయింది. మణికొండకు చెందిన రాళ్లగూడెం ధన్‌పాల్‌రెడ్డి కోసం కుటుంబ సభ్యులు కన్నీటితో ఎదురుచూస్తున్నారు. వివరాల్లోకి వెళితే.గండిపేట మండలం, నార్సింగి సర్కిల్ పరిధిలోని మణికొండ డివిజన్‌లోని వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన ధన్‌పాల్‌రెడ్డి శివుడికి అత్యంత పరమ భక్తుడని కుటుంబ సభ్యులు తెలిపారు.శివుడిపై ఉన్న భక్తిని చాటేలా వీపు, భుజాలు,చేతులపై శివుడి గుర్తులతో పచ్చబొట్లు వేయించుకున్నారని పేర్కొన్నారు.ఈ ఆధ్యాత్మిక భావనతోనే కైలాస పర్వత దర్శనం కోసం మానస సరోవర్ యాత్రకు వెళ్లారు.

### 66 మందితో యాత్ర పూణె నుంచి బయలుదేరి

ధన్‌పాల్‌రెడ్డి ఆగస్టు 23న హిల్స్ అండ్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో పూణె నుంచి 66 మందితో కూడిన బృందంతో కలిసి యాత్రకు బయలుదేరారు.బృందంలో ఎక్కువ మంది పూణెకు చెందినవారు కాగా,కొందరు హైదరాబాద్‌కు చెందిన వారు కూడా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఆగస్టు 26న ఉదయం సుమారు 8.30 గంటలకు టిబెట్‌లోని ఇమిగ్రేషన్ కేంద్రం వద్ద ఉన్నామని,ఇమిగ్రేషన్ ప్రక్రియ పూర్తయిన అనంతరం ముందుకు వెళ్తామని ధన్‌పాల్‌రెడ్డి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.అయితే అదే రోజు ఆకస్మికంగా భారీ వరదలు సంభవించడంతో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి.

### వరదల తర్వాత స్విచాఫ్ ' పెరుగుతున్న ఆందోళన

వరదల అనంతరం ధన్‌పాల్‌రెడ్డి ఫోన్‌కు కుటుంబ సభ్యులు ఎన్నిసార్లు ప్రయత్నించినా స్విచాఫ్ వస్తోందని ఆయన తండ్రి నర్సింహారెడ్డి తెలిపారు.అప్పటి నుంచి కుమారుడి ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబంలో తీవ్ర ఆందోళన నెలకొంది.ధన్‌పాల్‌రెడ్డి ఆచూకీ కోసం అక్కడి ఎంబసీ అధికారులను సంప్రదించగా,కుటుంబ సభ్యుల డీఎన్ఏ నమూనాలు పంపిస్తే, లభ్యమయ్యే వివరాలతో పరిశీలిస్తామని అధికారులు తెలిపినట్లు నర్సింహారెడ్డి పేర్కొన్నారు.

### భార్య,ఇద్దరు పిల్లలు తండ్రి కోసం ఎదురుచూపులు

ధన్‌పాల్‌రెడ్డికి భార్యతో పాటు 8వ తరగతి చదువుతున్న కుమారుడు, 7వ తరగతి చదువుతున్న కుమార్తె ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న ధన్‌పాల్‌రెడ్డి ఆచూకీ తెలియకపోవడంతో భార్య, పిల్లలు,తల్లిదండ్రులు తీవ్ర వేదనలో ఉన్నారు."శివుడి దర్శనం కోసం వెళ్లిన మా ధనా,క్షేమంగా తిరిగి రావాలి.ఎక్కడ ఉన్నాడో,ఏ పరిస్థితిలో ఉన్నాడో తెలియక ప్రతిక్షణం భయంతో గడుపుతున్నాం" అంటూ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

### ప్రభుత్వాలు చొరవ చూపాలని వేడుకోలు

ధన్‌పాల్‌రెడ్డి ఆచూకీని త్వరగా గుర్తించేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు, సంబంధిత అధికారులు తక్షణమే చొరవ చూపాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.టిబెట్ ప్రాంతంలోని అధికారులతో సమన్వయం చేసుకుని రెస్క్యూ,గాలింపు చర్యలను ముమ్మరం చేసి ధన్‌పాల్‌రెడ్డి క్షేమ సమాచారాన్ని అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.శివుడి గుర్తులను తన ఒంటిపై పచ్చబొట్లుగా మోసిన ఆ భక్తుడు,శివయ్య దర్శనానికి వెళ్లి ఇప్పుడు జాడ లేకుండా పోవడంతో,"మా ధనాను ఎలాగైనా క్షేమంగా మా వద్దకు చేర్చండి"అంటూ కుటుంబ సభ్యులు కన్నీటితో వేడుకుంటున్నారు.

# కట్టుకుంటాం.. లీజుకిస్తాం



- పెద్దమంగళారం రెవెన్యూలో 111 జీవో నిబంధనలకు సవాల్ గా భారీ ఫార్మ్ హౌస్ నిర్మాణం
- వీళ్లకు అధికారులంటే భయం లేదు.. నిబంధనలంటే లెక్క లేదు!
- కమిషనర్ గారూ ..రంగులు వేస్తె అక్రమాలు సక్రమం అవుతాయా..?
- ప్రభుత్వ ఆదాయానికి గండి పడకముందే.. అక్రమ ఫార్మ్ హౌస్ పై కొరడా ఝుళిపించాలి!
- లేదంటే జిల్లా కలెక్టర్ కు కంప్లైంట్ చేస్తామంటున్న స్థానికులు

**మొయినాబాద్ (ప్రజావాయిస్ ):** దీనికి కనీసం పర్మిషన్ ఉందో లేదో పట్టించుకునే నాథుడే లేడు..నిబంధనలు ఉన్నాయా లేదా అన్నది చూసే అధికారి లేడు..కానీ అక్రమంగా ఫార్మ్‌హౌస్ నిర్మాణం మాత్రం దడదడా సాగిపోతోంది!ఇది ఏదో గుడిసె కట్టుకుని ఉండటానికి కాదండోయ్.. లక్షలు, కోట్ల విలువ చేసే నిర్మాణం! ఉట్టిగనే కట్టి వదిలేయడానికి కూడా కాదట.. లీజుకు ఇచ్చి దండుకోవడానికేనన్న ఆరోపణలు బలంగా స్థానికుల నోట వినిపిస్తోంది.వివరాల్లోకి వెళితే మొయినాబాద్ మున్సిపాలిటీలోని పెద్దమంగళారం రెవెన్యూలో భారీ ఫార్మ్‌హౌస్ నిర్మాణం దర్జాగా సాగుతోంది.111 జీవో నిబంధనలు అమలులో ఉన్న ప్రాంతంలో ఇంత భారీ నిర్మాణం ఎలా సాగుతోందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వీళ్లకు అధికారులంటే భయం లేదు.. నిబంధనలంటే లెక్క లేదు అన్నట్టుగా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని ఆరోపిస్తున్నారు.ఇక నిర్మాణం పూర్తికాకముందే రంగులు వేయడంపైనా స్థానికులు తీవ్రంగా ప్రశ్నిస్తున్నారు. "కమిషనర్ గారూ.. రంగులు వేస్తే అక్రమాలు సక్రమం అవుతాయా?" అంటూ నిలదీస్తున్నారు. నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, ప్లాన్, భూమి వినియోగం తదితర అంశాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరుతున్నారు.ఈ ఫార్మ్‌హౌస్‌ను భవిష్యత్‌లో లీజుకు ఇచ్చి భారీగా ఆదాయం పొందే ప్రయత్నం జరుగుతోందని స్థానికులు చెబుతున్నారు . అంతమాత్రమే కాకుండా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి భారీగా గండి పడే అవకాశం ఉందని చెబుతున్నారు.ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి నిర్మాణాన్ని తనిఖీ చేసి, నిబంధనలు ఉల్లంఘించిన ఈ భారీ ఫార్మ్ హౌస్ పనులు నిలిపివేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి..చర్యలకు డిమాండ్ చేస్తామని స్థానికులు చెబుతున్నారు.



## విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం

# బిఆర్ఎస్ నిరంతర పోరాటం

**కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో విద్యార్థులు, యువతకు తీవ్ర అన్యాయం**

**హామీల అమలులో ఘోర వైఫల్యం**

**జీవో 97ను వెంటనే రద్దు చేయాలి**

**ప్రభుత్వం మెడలు వంచి విద్యార్థుల సమస్యల పరిష్కారం**

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్ చెరువు ప్రజావాయిస్**

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో విద్యార్థులు, యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి. విద్యార్థి, యువతకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే వరకు బిఆర్ఎస్ పార్టీ పక్షాన నిరంతర పోరాటం చేస్తామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ 420 మోసాల పైన బిఆర్ఎస్ పార్టీ పోరుబాటలో భాగంగా గురువారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానం వేదికగా




విద్యార్థులతో కలిసి భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నేడు వాటి అమలులో ఘోరంగా వైఫల్యం చెందిందని విమర్శించారు. ప్రధానంగా విద్యార్థులకు 5 లక్షల రూపాయల భరోసా కార్డు, కాలేజీ విద్యార్థినులకు ఉచిత స్కూటీ, అర్హులైన నిరుద్యోగ యువతకు ప్రతినెల రూ. 4,000 నిరుద్యోగ భృతి, అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడం.. అంశాలలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. జీవో నంబర్ 97 పేరుతో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థు ఆశలను అడియాశలు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడకుండా, పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, విద్యార్థి, యువజన నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది

**రైతు కంట కన్నీరు వస్తే ఆ ప్రభుత్వానికి పతనం తప్పదు..**

**కాంగ్రెస్ 1000 రోజుల పాలనలో రైతాంగానికి తీవ్ర అన్యాయం..**

**వ్యవసాయం, సాగునీరు, యూరియా, రైతుబీమా రంగాలను నిర్వీర్యం..**

**రేవంత్ సర్కారుపై ఎమ్మెల్యే మాణిక్ రావు విమర్శలు..**

**ప్రజా వాయిస్ జహీరాబాద్:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ లో కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల విఫల పాలనలో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని బిఆర్ఎస్ పార్టీ శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు అదేవిధంగా మాజీ డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్ లు అన్నారు . బిఆర్ఎస్ పార్టీ చేపట్టిన 7 రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జహీరాబాద్ పట్టణంలో నియోజవర్గ రైతులు , బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు నుండి ర్యాలీ నిర్వహించి అనంతరం లైఫ్ స్టైల్ కాంప్లెక్స్ (మోర్ సూపర్



మార్కెట్) వద్ద వ్యవసాయం, సాగునీటి రంగం, యూరియా కొరత, రైతుబీమా విధ్వంసంపై రైతు సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్ రావు మాట్లాడుతూ, రైతుల సంక్షేమమే లక్ష్యంగా గత బిఆర్ఎస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేసిందని, రైతుబంధు, రైతుబీమా, సాగునీటి ప్రాజెక్టులు, 24 గంటల ఉచిత విద్యుత్ వంటి పథకాలతో తెలంగాణ రైతాంగానికి అండగా నిలిచిందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సమస్యలు మరింత తీవ్రమయ్యాయని ఆయన విమర్శించారు. రైతుబంధు సకాలంలో అందకపోవడం, రైతుబీమా అమలులో నిర్లక్ష్యం, సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం, యూరియా కోసం రైతులు రోజుల తరబడి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని మోసం చేస్తోందని ఎమ్మెల్యే మండిపడ్డారు. రైతుల కష్టాలు ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. రైతు కంట కన్నీరు వస్తే ఆ ప్రభుత్వానికి పతనం తప్పదు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. అంతేకాకుండా బిఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ రైతుల పక్షానే ఉంటుందని, రైతుల హక్కుల కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు , బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనకు 1000 రోజులు గుర్రంపోడులో కాంగ్రెస్ జోష్

**వెయ్యి రోజుల పాలనకు ఘనంగా విజయోత్సవం**

**మార్మోగిన కాంగ్రెస్ నినాదాలు**

**రేవంత్ రెడ్డి పాలనకు జైకొట్టిన కాంగ్రెస్ శ్రేణులు**

**గుర్రంపోడులో హోరెత్తిన సంబరాలు**

**ప్రజా వాయిస్ : గుర్రంపోడు మండలం**

తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన 1000 రోజులు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా గుర్రంపోడు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు మిన్నంటిన ఉత్సాహంతో జరిగాయి. గుర్రంపోడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్ము శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున సమావేశమై వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు ప్రభుత్వ విజయాలను, సంక్షేమ పథకాలను గుర్తుచేసుకుంటూ హర్షం వ్యక్తం చేశారు. గత 1,000 రోజుల పాలనలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి గడపకూ చేరాయని నాయకులు స్పష్టం చేశారు. తెలంగాణ అమరుల ఆశయాలు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సాగుతున్న ఈ పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు. రైతు సంక్షేమం, మహిళా సాధికారత, నిరుద్యోగ యువతకు భరోసా, మరియు అన్ని వర్గాలకు సామాజిక న్యాయం అందించడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అగ్రగామిగా నిలిచిందని నేతలు పేర్కొన్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల, మండల కేంద్రాల్లో ఈ 1000 రోజుల వేడుకలను ఘనంగా జరుపుకుంటున్నామని, రాబోయే రోజుల్లో ప్రభుత్వాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని



పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, పార్టీ శ్రేణులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సర్పంచులు ఉప సర్పంచ్ ను ప్రజాప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల పండుగపై కాంగ్రెస్ భారీ ర్యాలీ

**రూ.500 కి గ్యాస్ సిలిండర్**

**మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం**

**గృహజ్యోతి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్**

**రైతు రుణమాఫీ ఇచ్చాం**

**మండల పార్టీ అధ్యక్షులు సురేష్ నాయక్**

**ప్రజ వాయిస్ /కొడకండ్ల:**

జనగామ జిల్లా కొడకండ్ల మండల కేంద్రం లో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కొడకండ్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధారావత్ సురేష్ నాయక్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. ప్రతి కుటుంబానికి ప్రయోజనం చేకూరేలా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన సంక్షేమ కార్యక్రమాలను ఆయన వివరించారు.



మహాలక్ష్మి పథకం – రూ.500కే గ్యాస్ సిలిండర్
మహాలక్ష్మి – మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
గృహజ్యోతి – 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్
రైతు రుణమాఫీ
రాజీవ్ ఆరోగ్యశ్రీ / చేయూత
ఇందిరమ్మ ఇండ్లు
రాజీవ్ యువ వికాసం
నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు
సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్
ఉచిత సన్న బియ్యం

ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యం మేరకు 5 లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని సురేష్ నాయక్ అన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షురాలు ఝాన్సమ్మ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు చేరవేస్తూ నిరంతరం ప్రజల మధ్య ఉంటున్నారని అన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై మాట్లాడే అవకాశం కూడా ప్రతిపక్షాలకు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని సురేష్ నాయక్ అన్నారు. ప్రజలకు అండగా నిలవడంలో విఫలమైన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని ఆయన ఘాటుగా విమర్శించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి ధర్మారపు బిక్షపతి, సీనియర్ నాయకులు పసునూరి మధుసూదన్, దేశగాని నాగరాజు, దూదిమెట్ల యాకేష్ యాదవ్, దూలం మమత, సతీష్, మసురం మనోహర్, ఎన్నం శ్రీనివాస్, నరేష్ నాయక్ తదితరులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అన్ని గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు.



## 22-ఏ జాబితాతో మణికొండ,నెక్నాంపూర్ ప్రజలకు ఇక్కట్లు

**సుమారు 1,500 ఎకరాల ఆస్తులపై నిషేధం ఎత్తివేయాలని బీఆర్ఎస్ డిమాండ్**

**ప్రజా వాయిస్/రాజేంద్రనగర్:** మణికొండ, నెక్నాంపూర్ ప్రాంతాల్లో భూ–భారతి కింద 22–ఏ నిషేధిత జాబితాలో ఆస్తులను చేర్చడంపై బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 1,500 ఎకరాల భూములు,ఆస్తులు నిషేధిత జాబితాలో ఉండటంతో యజమానులు రిజిస్ట్రేషన్లు చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఈ అంశంపై గురువారం నిర్వహించిన నిరసనలో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజల ఆస్తి హక్కులకు భంగం కలిగేలా నిషేధిత జాబితా సమస్యను జటిలం చేయడం సరికాదని పేర్కొన్నారు. అర్హత ఉన్న భూములు,ఆస్తులను 22–ఏ జాబితా నుంచి తొలగించి రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**జలమండలి బిల్లులపైనా ఫిర్యాదు**

నిరసనలో భాగంగా జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్‌ను కలిసి స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యలను నాయకులు వివరించారు. గతంలో వినియోగించిన నీటి బకాయిలను ప్రస్తుత బిల్లుల్లో చూపిస్తూ వసూలు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజలతో కొందరు సిబ్బంది దురుసుగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేసి,బిల్లుల సమస్యలను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని కోరారు. ప్రజల ఆస్తి హక్కులు,నీటి బిల్లుల సమస్యలపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.



## ఓటరు జాబితా సవరణలో పారదర్శకత

**అర్హులైన ప్రతి ఓటరు పేరు ఉండేలా చర్యలు**

**ఈఆర్ఓ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి**

**ప్రజా వాయిస్/రాజేంద్రనగర్:** ఓటరు జాబితాలో పేర్లలో తప్పులు,మ్యాపింగ్ సమస్యలపై అందిన అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిష్కరిస్తామని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం హైదర్‌గూడ డివిజన్‌లోని ఓటరు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నోటీసులు అందుకున్న ఓటర్లు సమర్పించే ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి,అర్హత ఉన్న వారి పేర్లు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ధ్రువపత్రాల పరిశీలన,వివరాల ఆన్‌లైన్ అప్‌లోడ్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ప్రతి ఓటరుకు నిబంధనల ప్రకారం న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.



## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజా వాయిస్– జైపూర్**

ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీపతి బాపురావు కోరారు. గురువారం జైపూర్ మండలంలోని మిట్టపల్లి, కాన్కూర్ గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి, 'విబిజి రామ్' గ్రామసభల్లో పాల్గొని మాట్లాడారు. ప్రతి ఇంట్లో తప్పనిసరిగా మరుగుదొడ్డి, ఇంకుడు గుంత నిర్మాణం పూర్తి చేసుకోవాలని, ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తిచేసుకోవాలని సూచించారు. అనంతరం ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, మార్పులు–చేర్పుల కోసం అర్హులైన వారి నుంచి వెంటనే దరఖాస్తులు స్వీకరించాలని బీఎల్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అలాగే గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ, గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కామెర మనోహర్, కే.సాగరిక వెంకటేశ్వర గౌడ్, జీపీవో స్వామి, కార్యదర్శులు పి.సురేష్, బి.శ్రావణ్ కుమార్, పలువురు అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ధరూర్ రైతులకు ఎరువుల కొరత తీర్చాలి

**డీఏపీ, యూరియా, కాంప్లెక్స్ ఎరువుల సరఫరాపై బీఆర్ఎస్ వినతి**

**ప్రజావాయిస్/వికారాబాద్:**
ధారూర్ మండల రైతులు ఎదుర్కొంటున్న ఎరువుల కొరత సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ ధారూర్ మండల మాజీ అధ్యక్షుడు పట్లోళ్ల శ్రీకాంత్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, స్థానిక నాయకులతో కలిసి జిల్లా వ్యవసాయ అధికారికి వినతిపత్రం సమర్పించారు.ధారూర్ మండలంలోని రైతులకు డీఏపీ, యూరియా, కాంప్లెక్స్ ఎరువులు యాప్ ద్వారా బుక్ చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ, ధారూర్ మండలంలోని షాపులకే పరిమితంగా అనుమతి ఇవ్వడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు. ముఖ్యంగా మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో లేవని, డీఏపీ, యూరియా కూడా రైతులకు సక్రమంగా సరఫరా కావడం లేదని వినతిపత్రంలో తెలిపారు.ఎరువుల కోసం రైతులు రోజుల తరబడి దుకాణాల చుట్టూ తిరగాల్సి వస్తోందని, దీంతో సాగు పనులు ఆలస్యమవుతున్నాయని బీఆర్ఎస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ధారూర్ మండలంతో పాటు వికారాబాద్ జిల్లాలోని ఇతర ప్రాంతాల ఎరువుల దుకాణాల నుంచి కూడా రైతులు ఎరువులు కొనుగోలు చేసుకునేలా అనుమతి కల్పించాలని వారు కోరారు.




# ఇంటర్న్‌షిప్ అనుభవం..

**- విద్యార్థుల భవిష్యత్‌కు బాట**
**- గాయత్రి కళాశాలలో ఐపీపిబీ ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్ల పంపిణీ**

**ప్రజా వాయిస్, పెద్దపల్లి :**
గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్ (ఐపీపిబీ) ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐపీపిబీ సీనియర్ మేనేజర్ రాజేష్, ఐపీపిబీ మేనేజర్ శ్రీనివాస్, పోస్టుమెన్ అనూష, కళాశాల కరస్పాండెంట్ అల్లెంకి శ్రీనివాస్ పాల్గొని విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లను అందజేశారు.ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ అల్లెంకి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇంటర్న్‌షిప్ ద్వారా విద్యార్థులు పొందిన జ్ఞానం, అనుభవాన్ని భవిష్యత్తులో తమ కెరీర్ అభివృద్ధికి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పుస్తక జ్ఞానంతో పాటు ఆచరణాత్మక అనుభవం విద్యార్థుల వ్యక్తిగత, వృత్తిపరమైన ఎదుగుదలకు ఎంతో దోహదపడుతుందని తెలిపారు.విద్యార్థులకు వాస్తవిక పని అనుభవాన్ని అందించే ఇటువంటి ఇంటర్న్‌షిప్ కార్యక్రమాలు వారి బంగారు భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని పేర్కొన్నారు. అనంతరం గాయత్రి విద్యాసంస్థల అధినేత శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు ఐపీపిబీ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇటుక బట్టీల దందాపై క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలి

**ఆదిలాబాద్‌లో టీఆర్పీ నేతల డిమాండ్**



**ప్రజా వాయిస్ /ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**
అదిలాబాద్ జిల్లా కేంద్రంలో అసైన్డ్ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఇటుక బట్టీలు నిర్వహిస్తున్న అక్రమ దందాపై రెవెన్యూ మరియు సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు తాళ్ళ రవిందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.పేదలకు ప్రభుత్వం జీవనోపాధి కోసం కేటాయించిన అసైన్డ్ భూములు కొందరి చేతుల్లోకి వెళ్లి అక్రమ కార్యకలాపాలకు అడ్డగా మారుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ వ్యవహారంపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని కోరారు. సంబంధిత భూముల రికార్డులను పరిశీలించి, ఇటుక బట్టీల నిర్వహణకు ఏమైనా అనుమతులు ఉన్నాయా లేదా అనే కోణంలో వాస్తవాలను ప్రజల ముందుంచాలని ఆయన స్పష్టం చేశారు.ఒకవేళ ఈ బట్టీల నిర్వహణలో ఎలాంటి నిబంధనల ఉల్లంఘనలు జరిగినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని తాళ్ళ రవిందర్ డిమాండ్ చేశారు. పేదల భూముల అన్యాక్రాన్ని, అక్రమాలను అడ్డుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలని, ప్రజల భూముల పరిరక్షణ కోసం తమ పార్టీ తరఫున నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటామని ఆయన తేల్చిచెప్పారు.

# ప్రజా సమస్యలపై ప్రతిపక్ష హోదాలో పోరాటాలు

**రేవంత్ రెడ్డి ఫెయిల్యూర్ సీఎం**
**ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం**
**8 వరకు వివిధ దశలలో సర్కారుపై పోరాటం**
**యూరియా సరఫరా లేక రైతుల ఆరాటం**
**దోమకొండ రైతు సదస్సులో మాజీ ఎమ్మెల్యే గోవర్ధన్ మాజీ ఎమ్మెల్సీ విజి గౌడ్**



**ప్రజా వాయిస్ దోమకొండ/**
ప్రతిపక్ష హోదాలో ప్రజా సమస్యలపై పోరాటాలు చేపట్టాలని ప్రజలకు ప్రభుత్వ అసమర్థత పై అవగాహన చేయాలని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ మాజీ ఎమ్మెల్సీ ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ ఇంచార్జ్ విజి గౌడ్ గులాబీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం నాడు దోమకొండ పెద్దమ్మ గుడిలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కామారెడ్డి నియోజకవర్గ రైతు సదస్సులో వారిద్దరు ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీల అమలుకు పోరాటం చేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విఫల సీఎం అని గోవర్ధన్ ,వీ జీ గౌడ్ ఆరోపించారు. ఈనెల 10న ఉద్యోగస్తులు కామారెడ్డి కలెక్టర్ కార్యాలయం ముందు చేపడుతున్న సమ్మెకు మద్దతు ఇవ్వాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 8న ప్రతి గ్రామంలో మండలంలో అంబేద్కర్ కు వినతి పత్రాలు సమర్పించాలన్నారు. 7న మాచారెడ్డి లో కాంగ్రెస్ కళ్ళు చేర్పించాలని ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. సోమవారం నాడు అన్ని మండల కేంద్రాలలో ప్రజావాణిలో కాంగ్రెస్ 420 హామీలపై సంబంధిత అధికారులకు వినతి పత్రాలు సమర్పించాలన్నారు. అరుణ వైకుంఠధామం పారిశుధ్యం పై సర్కారు నిర్లక్ష్యంపై ఆందోళన చేపట్టాలన్నారు. ఈనెల ఐదున కామారెడ్డి నిజాం సాగర్ చౌరస్తాలో విద్యార్థి యువకుల చేత ఆందోళన కార్యక్రమం ఉందన్నారు. నాలుగున బిబిపేట మండల కేంద్రంలో మహిళ నిర్వహిస్తున్నారు. మూడేళ్ల అనంతరం వెయ్యి రోజుల కారణ ముగిసిన కాంగ్రెస్పై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని మాజీ ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీ ఆరోపించారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని గంప గోవర్ధన్ భరోసా ఇచ్చారు. సోషల్ మీడియాలో టిఆర్ఎస్ కార్యకర్తల కార్యక్రమాలపై కాంగ్రెస్ వైఫల్యాలపై విస్తృత ప్రచారం చేపట్టాలని సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అసమర్ధ పాలనపై ప్రచారం చేయాలని కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కాంగ్రెస్ 420 హామీలపై పోరాటం ఉధృతం చేయాలన్నారు. సోషల్ మీడియాలో కాంగ్రెస్ వైస్ పర్యాయాలపై స్టేటస్ పెట్టుకోవాలని వాట్సప్ లలో కాంగ్రెస్ వైఫల్యాలను ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ వైఫల్యాలు గులాబీ పార్టీ కార్యక్రమాలు ప్రజలకు చేరేంతవరకు విస్తృతం ప్రచారం అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నోరు విప్పితే అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆయన బూతు పదజాలం ముఖ్యమంత్రి హోదాను కించపరుస్తుందని గులాబీ నేతలు ఆరోపించారు. రైతులకు అవసరమున్న యూరియా సరఫరా లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని ఆరోపించారు. కరెంటు సరఫరా లో అప్రకటిత కరెంటు కోతలు కోతలు పంటలను దెబ్బతీస్తున్నాయన్నారు. మహిళలకు 2500 అమలు చేయడం లేదన్నారు. రేవంత్ రెడ్డి సోదరులు వందల కోట్ల రూపాయల భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. లక్ష రూపాయలకు రెండు వందల కోట్ల రూపాయల భూమిని హైదరాబాదులో ముఖ్యమంత్రి సోదరుడు కొండల్ రెడ్డి ఆక్రమించారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నయవంచన పాలన చేస్తుందని మాజీ ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీ ఆరోపించారు. టిఆర్ఎస్ ప్రదీప్ ప్రజలు అధికారంలో ఉండి హోదాలు పదవులు కాంట్రాక్టులు పొందినవారు కాంగ్రెస్ ప్రభుత్వం రాదని ఆ పార్టీలో చేరారని వారిని మళ్లీ గులాబీ పార్టీలో చేర్చుకోవద్దని మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్ డిమాండ్ చేశారు. మక్కలు కొనే దిక్కు లేదని పార్టీ వివిధ మండలాల అధ్యక్షులు కాంగ్రెస్ ప్రభుత్వం పై ఆరోపణ చేశారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలకు ప్రజలు మోసపోయి ఓట్లు వేసి ఇప్పుడు గోష పడుతున్నారని పార్టీ నేతలు గుర్తు చేశారు.నియోజకవర్గంలోని 8 మండలాలకు చెందిన నాయకులు కార్యకర్తలు రైతు సదస్సులో పాల్గొన్నారు.కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు ముజీబుద్దీన్, కామారెడ్డి మున్సిపాలిటీ వైస్ చైర్పర్సన్ గోదావరి, మాజీ మార్కెట్ కుంచాల శేఖర్, గంద్ర మధు, మాజీ ఎంపీపీలు బాలమణి శారద, ఉపసర్పంచ్ బొమ్మెర శ్రీనివాస్ కామారెడ్డి,దోమకొండ బీబీపేట బిక్కనూరు మాచారెడ్డి రాజంపేట పాల్వంచ మండలాల పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో ఆధునికీకరించిన అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ కేంద్రం ప్రారంభం

**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి**
మత్తు పదార్థాలకు బానిసలై తమ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టుకుంటున్న యువతను తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో నూతనంగా ఆధునికీకరించిన అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ (ఏటీఎఫ్) కేంద్రాన్ని ఈగల్ ఫోర్స్ వారి సహకారంతో ఏర్పాటు చేయడం జరిగింది. మద్యం, పొగాకు, గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వ్యసనం నేడు యువతతో పాటు వారి కుటుంబాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న ప్రధాన సామాజిక సమస్యగా మారింది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వ మరియు విక్రయాలపై డ్రగ్స్ కంట్రోల్ టీమ్ ఆధ్వర్యంలో కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతోంది. అదే సమయంలో మత్తు పదార్థాలకు బానిసలైన యువతను శిక్షించడం మాత్రమే కాకుండా, వారిని వ్యసన విముక్తి చేసి తిరిగి ఆరోగ్యకరమైన జీవితంలోకి తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతోంది. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా, జి.ఓ. ఎం.ఎస్. నెం.4, తేదీ 10-02-2026 ప్రకారం ఎంజీఎం ఆసుపత్రిలో అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ ఏర్పాటు చేయబడింది. వరంగల్ పోలీస్ కమిషనర్ చొరవతో, ఎంజీఎం ఆసుపత్రి అధికారులు మరియు సిబ్బంది సహకారంతో అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ (ఏటీఎఫ్) కేంద్రాన్ని మరింత ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేశారు.కేంద్రంలో ప్రత్యేక అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ వార్డు ఏర్పాటు చేసి పడకల సామర్థ్యాన్ని 10 నుంచి 20 కు పెంచడం జరిగింది. రోగుల భద్రత కోసం ఇనుప గ్రిల్స్, సీసీటీవీ నిఘా మరియు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణాన్ని ఏర్పాటు చేశారు.బాధితుల మానసిక ప్రశాంతత కోసం క్యారమ్ బోర్డు, చెస్ వంటి వినోద సౌకర్యాలను కూడా కల్పించారు.అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో బాధితులకు వైద్య చికిత్స, కౌన్సెలింగ్ మరియు అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ సేవలు అందించబడతాయి. మత్తుకు బానిసైన యువతను తిరిగి సాధారణ, ఆరోగ్యకరమైన మరియు బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడమే ఈ కేంద్రం ప్రధాన లక్ష్యం.తమ పిల్లలు లేదా కుటుంబ సభ్యులు మత్తు పదార్థాలకు బానిసలైనట్లు గుర్తించిన తల్లిదండ్రులు ఆ సమస్యను దాచిపెట్టకుండా వెంటనే సహాయం పొందాలని వరంగల్ పోలీస్ కమిషనరేట్ విజ్ఞప్తి చేస్తోంది. సరైన సమయంలో చికిత్స, కౌన్సెలింగ్ మరియు కుటుంబ సభ్యుల సహకారం ద్వారా మత్తు బానిసత్వం నుంచి పూర్తిగా బయటపడే అవకాశం ఉంది. డీ-అడిక్షన్ చికిత్స అవసరమైన వారు ఎంజీఎం ఆసుపత్రిలోని కేంద్రాన్ని సంప్రదించి అవసరమైన సేవలను పొందవచ్చు.అవసరమైన సహాయం కోసం సమీప పోలీస్ స్టేషన్ అధికారులను, ఎంజీఎం మానసిక వైద్య సిబ్బందిని కూడా సంప్రదించవచ్చు."మత్తును వదిలి - జీవితాన్ని ఎంచుకోండి." "వసనాన్ని దాచకండి - సహాయం



పొందండి.""చికిత్స ఒక జీవితాన్ని మార్చగలదు."మత్తు పదార్థాల వ్యసనానికి సంబంధించిన ఏదైనా సహాయం, సమాచారం లేదా మార్గదర్శకత్వం కోసం 87125 84473/87126 85299 సంప్రదించండి.ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, ఎస్. బి యం. జి. యం సూపరింటెండెంట్ డా. రాంరెడ్డి, ఆర్.యం.ఓ అశ్వని కుమార్, ఎస్. బి ఇంచార్జి ఏసీపీ మధుసూదన్, డ్రగ్స్ కంట్రోల్ టీం ఇన్స్ స్పెక్టర్ సాయి రాం, ఆర్.ఐ శివ కేశవులు, ఈగల్ టీం ఇన్స్ స్పెక్టర్ రవీందర్, ఎస్. ఐ శ్రీకాంత్,ఆర్. ఎస్. ఐలు పూర్ణ చందర్ రెడ్డి,మనోజ్ రెడ్డి, నాగరాజు, పోలీస్ మరియు యం.జి.యం హాస్పటల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# కొండపోచమ్మ సాగర్ జలాల కోసం బొమ్మలరామారం రైతుల పాదయాత్ర

**చెరువులకు కొండపోచమ్మ జలాలు ఇవ్వాలి: రైతుల డిమాండ్**
**సాగునీరు అందే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తాం: గొంగిడి సునిత**

**ప్రజా వాయిస్ /బొమ్మలరామారం:**
కొండపోచమ్మ సాగర్ ద్వారా కాళేశ్వరం జలాలను యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలానికి విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం భారీ పాదయాత్ర నిర్వహించారు. మండలంలోని రైతులకు గత మూడు సంవత్సరాలుగా కాళేశ్వరం జలాలు అందకపోవడంతో సాగునీటి సమస్య తీవ్రంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఖాజీపేట గ్రామంలోని శామీర్‌పేట వాగు బ్రిడ్జి వద్ద నుంచి తిమ్మాపూర్ గ్రామంలోని గూడెం చెరువు వరకు సుమారు 500 మంది రైతులతో పాదయాత్ర చేపట్టారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కొండపోచమ్మ సాగర్ జలాలను మండలంలోని చెరువులకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ పాదయాత్రలో మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, గొంగిడి సునిత మహేందర్ రెడ్డి పాల్గొని రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బొమ్మలరామారం మండల రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతులకు నీరు అందే వరకు బీఆర్ఎస్ పార్టీ తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కొండపోచమ్మ సాగర్ జలాలను బొమ్మలరామారం మండలంలోని చెరువులకు అందించి రైతుల సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు



కోరారు.ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పోలగోని వెంకటేష్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గుధే బాలనర్సింహ, మాజీ ఎంపీపీ చిమ్ముల సుధీర్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, మండల నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలంటూ...

**విద్యుత్ సబ్ స్టేషన్ ముందు బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా**

**ప్రజా వాయిస్/ఆత్మకూర్(ఎం):-** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎం)మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ మండల అధ్యక్షులు, రైతు బీసు చందర్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం దొంగ హామీలతో గెలిచి గతంలో రైతులకు ఇచ్చే విద్యుత్ లో సమయం తగ్గించటమే కాకుండా సరఫరా చేస్తున్న విద్యుత్ లో నాణ్యత లేకపోవటం సిగ్గుచేటు అన్నారు.త్రి ఫేస్ విద్యుత్ లో నాణ్యమైన విద్యుత్ సరఫరా కాకపోవటం వల్ల మోటార్ల పైన భారంపడి కాలిపోతున్నా యన్నారు. ఒక పక్క ఎలినో ప్రభావం మరో పక్క ప్రభుత్వం నాణ్యత లేని విద్యుత్ వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పాలిట శనిలా వచ్చిందని ఇప్పటికైనా మొద్దు నిద్ర లేచి ప్రభుత్వం విద్యుత్ విషయంలో చర్యలు తీసుకోవాలన్నారు.లేని పక్షంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్,లింగరాజుపల్లి సర్పంచ్ ఎర్ర సోమిరెడ్డి, పట్టణ మాజీ ఎంపీటీసీ యాస కవిత ఇంద్రారెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు యాస ఇంద్రారెడ్డి, మండల సెక్రటరీ జనరల్ పంజాల వెంకటేష్ గౌడ్,మామిడి శ్రీనివాస్ రెడ్డి,జిల్లా నాయకులు కోరే బిక్షపతి,లగ్గాని రమేష్, బూడిద రాములు,కొల సత్తయ్య గౌడ్,మండల నాయకులు గడ్డం దశరథ గౌడ్,కాలే



మల్లేష్,పుట్ట నర్సిరెడ్డి,యాస అంజిరెడ్డి, సోమరాజు, నాతి రాజు,నాతి స్వామి,గజ్జెల్లి శంకర్,కావటి స్వామి,నాగుల రాజు,చిక్కిరి రవి, యాట మధు,లోడి మధు యువజన విద్యార్థి నాయకులు, రైతులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

# కాంగ్రెస్ దగా పాలనపై బిఆర్ఎస్ రైతు సదస్సు

- రైతాంగానికి కాంగ్రెస్ తీరని అన్యాయం చేస్తోంది
- ఎకరానికి 15,000 రైతు భరోసా హామీని వెంటనే నెరవేర్చాలి
- పాలకుర్తిలో వ్యవసాయ మార్కెట్ నిర్మించాలి: మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

ప్రజా వాయిస్ పాలకుర్తి
రామగుండం నియోజకవర్గంలోని పాలకుర్తి మండలం, బసంత్ నగర్ జిఎం గార్డెన్‌లో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మురళీధర్ రావు అధ్యక్షతన కాంగ్రెస్ దగా పాలనపై రైతు సదస్సు ప్రారంభమైంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, రైతాంగం పట్ల చూపుతున్న నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సదస్సులో పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పాల్గొని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుండి రైతాంగం తీవ్ర నిరాశా నిస్పృహలకు లోనైందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం ప్రతి ఎకరానికి ఏడాదికి 15,000 రైతు భరోసా సాయాన్ని వెంటనే విడుదల చేయాలని, అలాగే క్వింటాల్‌కు 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాలకుర్తి ప్రాంత రైతులకు సౌకర్యార్థం వెంటనే వ్యవసాయ మార్కెట్‌ను నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతుల ఇబ్బందులు, సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిలదీసేందుకు రాబోయే ఎనిమిది రోజుల పాటు నియోజకవర్గవ్యాప్తంగా వివిధ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ పోరాటాన్ని ఉధృతం చేసేందుకు ప్రతి కార్యక్రమానికి వేర్వేరు సమన్వయకర్తలను నియమించినట్లు స్పష్టం చేశారు. ?రాజకీయాల్లో డబ్బుల



కంటే ప్రజాబలమే ముఖ్యమని పేర్కొంటూ, పెద్దపేట గ్రామంలో ప్రత్యర్థులు రూ. 20 లక్షలు ఖర్చు చేసినప్పటికీ, బిఆర్ఎస్ పార్టీ కేవలం ప్రజల మద్దతుతో ఘన విజయం సాధించిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిందని, బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ రైతులకు అండగా ఉండి ఉద్యమిస్తుందని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మూల విజయరెడ్డి, హరీష్ రెడ్డి, రాగం శ్రీనివాస్, సతీష్, బండారి ప్రవీణ్, రామారావుపల్లె వెంకటేష్, పద్మ, సమ్మయ్య యాదవ్, అలవాల రాజయ్య, శ్రీవాణి కిరణ్, మధికరరెడ్డి స్రవంతి తదితరులతో పాటు నియోజకవర్గానికి చెందిన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, కార్పొరేటర్లు, ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆత్మ కమిటీ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం

## రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం: బీర్ల అయిలయ్య

ప్రజా వాయిస్ /యాదగిరిగుట్ట: యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని మున్నూరు కాపు సత్రంలో ఆత్మ కమిటీ (ఆలేరు) చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనిత ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన ఆత్మ కమిటీ చైర్మన్ ఎనగండ్ల సుధాకర్, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య వారిని ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ సాగు విధానాలపై అవగాహన కల్పించడంతో పాటు, వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో ఆత్మ కమిటీలు కీలకపాత్ర పోషించాలని సూచించారు. ఆలేరు నియోజకవర్గంలోని రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వ్యవసాయ శాఖ ద్వారా అందుతున్న సేవలు పూర్తిస్థాయిలో చేరేలా కమిటీ సభ్యులు కృషి చేయాలని కోరారు. రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎనగండ్ల సుధాకర్‌తో పాటు నూతన డైరెక్టర్లందరికీ ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. ప్రభుత్వం, రైతులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఆలేరు నియోజకవర్గాన్ని వ్యవసాయ రంగంలో మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేసి, అర్హులైన ప్రతి రైతుకు వాటి ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ నూతన చైర్మన్, డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతు ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ అంటేనే మోసం

**ఆరు గ్యారంటీలు, 420 హామీలతో ప్రజలను మోసం చేశారని ఆరోపణ**

**కీసర తహసీల్దార్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నిరసన**

**మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి**

ప్రజావాయిస్, కీసర:
కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై మాజీ మంత్రి మేడ్చల్ నియోజకవర్గం శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గం కీసర తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని 'రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్', 'వద్దురా నాయనా కాంగ్రెస్ పాలన' అంటూ నినాదాలు చేశారు. మల్లారెడ్డి మాట్లాడుతూ.... గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు తీసుకెళ్లి ధనిక రాష్ట్రంగా తీర్చిదిద్దితే, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 77 సార్లు ఢిల్లీకి వెళ్లారని మల్లారెడ్డి పేర్కొన్నారు. 22ఏ అంశంతో రాష్ట్రంలో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఆరోపిస్తూ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనతో ప్రజలు విసిగిపోయారని, అందుకే మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని మల్లారెడ్డి వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని తెలిపారు. వచ్చేది బీ ఆర్ ఎస్ ప్రభుత్వమేనని మల్లారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, పిఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్ రెడ్డి, కీసర మాజీ సర్పంచ్ నాయకపు మాధురి వెంకటేష్, బీఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు జలాల్ పురం సుధాకర్ రెడ్డి, మాజీ ఛైర్పర్సన్ ప్రణిత శ్రీకాంత్ గౌడ్, మోర రవికాంత్ ముదిరాజ్, బీఆర్ ఎస్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, గుర్రం శ్రీధర్ రెడ్డి, నాయకపు వెంకటేష్, సాయినాథ్, ప్రభాకర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్లు మాజీ ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపాలిటీ కమిషనర్ కార్యాలయంలో నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాలు..?

**రైతు బీమా నిలిపివేతతో.. నకిలీ సర్టిఫికెట్ల దందా!**

**తప్పుడు ధ్రువపత్రాలతో పథకం పొందేందుకు యత్నం**

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి
మున్సిపాలిటీ కమిషనర్ కార్యాలయంలో నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాలు కొనసాగుతున్నాయి.? రైతు బీమా నిలిపివేతతో నకిలీ సర్టిఫికెట్ల దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుందని. కొందరు బ్రోకర్ అవతారాలు ఎత్తి సామాన్యుల నుండి సర్టిఫికెట్ల ఇప్పిస్తామని భారీ మొత్తంలో ముడుపులు తీసుకుని నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాలతో ప్రభుత్వ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు ప్రయత్నం కొనసాగిస్తున్నారు.



వివరాలలోకి వెళితే రాష్ట్ర ప్రభుత్వం రైతు బీమా పథకాన్ని తాత్కాలికంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. అయితే పథకం నిలిపివేత తర్వాత మరణించిన రైతుల పేరిట, నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాలు, పొంది? రూ. 5 లక్షల బీమా సొమ్ము పొందేందుకు కొందరు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గం ఆత్మకూర్ మండలం కామారం గ్రామంలో



దళారులు రైతు కుటుంబాలను మభ్యపెట్టి, మున్సిపాలిటీ కమిషనర్ కార్యాలయంలో నకిలీ సర్టిఫికెట్లు తయారు చేసి అధికారులకు సమర్పిస్తున్నట్లు సమాచారం. నిబంధనల ప్రకారం రైతు మరణించిన 10 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి. కానీ పథకం ఆగిపోయిందని తెలిసి, గత తేదీలతో సర్టిఫికెటు సృష్టించారు.. తహశీల్దార్, పంచాయతీ కార్యదర్శి ధ్రువీకరణ లేకుండా ఏ ఒక్క దరఖాస్తును ఆమోదించద్దని ప్రజలు బహిరంగంగా ఆరోపణలు ఉన్నాయి.. నకిలీ పత్రాలు సమర్పించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు మున్సిపాలిటీ కమిషనర్ను కోరుతున్నారు.



# కొండపోచమ్మ సాగర్ జలాల కోసం బొమ్మలరామారం రైతుల పాదయాత్ర

**చెరువులకు కొండపోచమ్మ జలాలు ఇవ్వాలి: రైతుల డిమాండ్**

**సాగునీరు అందే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తాం: గొంగిడి సునిత**

ప్రజా వాయిస్ /బొమ్మలరామారం:
కొండపోచమ్మ సాగర్ ద్వారా కాళేశ్వరం జలాలను యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలానికి విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం భారీ పాదయాత్ర నిర్వహించారు. మండలంలోని రైతులకు గత మూడు సంవత్సరాలుగా కాళేశ్వరం జలాలు అందకపోవడంతో సాగునీటి సమస్య తీవ్రంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఖాజీపేట గ్రామంలోని శామీర్‌పేట వాగు బ్రిడ్జి వద్ద నుంచి తిమ్మాపూర్ గ్రామంలోని గూడెం చెరువు వరకు సుమారు 500 మంది రైతులతో పాదయాత్ర చేపట్టారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కొండపోచమ్మ సాగర్ జలాలను మండలంలోని చెరువులకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ పాదయాత్రలో మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, గొంగిడి సునిత మహేందర్ రెడ్డి పాల్గొని రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బొమ్మలరామారం మండల రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతులకు నీరు అందే వరకు బీఆర్ఎస్ పార్టీ తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కొండపోచమ్మ సాగర్ జలాలను బొమ్మలరామారం మండలంలోని చెరువులకు అందించి రైతుల సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పోలగోని వెంకటేష్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గుధే బాలనర్సింహ, మాజీ ఎంపీపీ చిమ్ముల సుధీర్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, మండల నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# పాలకుర్తి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన సీఐ భరత్ సుమన్

**పాలకుర్తిలో కొత్త సీఐకి ఎమ్మెల్యే శుభాకాంక్షలు**

**ప్రజా భద్రతే ప్రథమ లక్ష్యం..**

**నూతన సీఐకి ఎమ్మెల్యే సూచన శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి..**

**శాంతిభద్రతలే ప్రథమ ప్రాధాన్యం.. నూతన సీఐ**

ప్రజా వాయిస్ /పాలకుర్తి/సెప్టెంబర్ 03/
పాలకుర్తి పోలీస్ సర్కిల్‌కు నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) గా బాధ్యతలు స్వీకరించిన భరత్ సుమన్ నేడు పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి నూతన సీఐకి శుభాకాంక్షలు తెలియజేసి, పాలకుర్తి నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు న్యాయం, భద్రత కల్పించేలా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజల సమస్యలపై వెంటనే స్పందిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించగా, సీఐ భరత్ సుమన్ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిబద్ధతతో పనిచేస్తానని తెలిపారు.

# పాఠశాలల్లో ఘనంగా జన్మాష్టమి వేడుకలు

**- కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారుల సందడి**



ప్రజావాయిస్/వికారాబాద్:
వికారాబాద్ పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి, విద్యార్థులకు శ్రీకృష్ణుడి జన్మదిన విశిష్టతను వివరించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ముస్తాబై అందరినీ ఆకట్టుకున్నారు. కృష్ణుడి వేషంలో చిన్నారులు ఎంతో ముద్దుగా కనిపించడంతో పాఠశాల ప్రాంగణాలు సందడిగా మారాయి. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. పండుగల ద్వారా చిన్నారుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంపొందుతుందని తెలిపారు. వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



## సిద్ధార్థ పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**ప్రజావాయిస్ /పాలకుర్తి,తేదీ: 3 సెప్టెంబర్**
పాలకుర్తి మండల కేంద్రంలోని సిద్ధార్థ పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు పాఠశాల ప్రాంగణంలో అత్యంత వైభవంగా మరియు భక్తిశ్రద్ధలతో జరిగాయి ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు మరియు యాజమాన్యం ఉత్సాహంగా పాల్గొన్నారు.శ్రీ కృష్ణ లీలల ప్రదర్శన ప్రీ ప్రైమరీ మరియు ప్రైమరీ విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ ,గోపికల వేషధారణలో అలరించారు.విద్యార్థులు కృష్ణుని భక్తి గీతాలు, నృత్యాలు, కృష్ణ లీలలను కళ్ళకు కట్టినట్టు చూపారు.ఉట్టి ఉత్సవం (దహి హాండి) వేడుకల్లో భాగంగా ఉట్టిగొట్టే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జక్కుల రవీందర్ మాట్లాడుతూ. శ్రీకృష్ణుని జీవితం గురించి తెలియజేస్తూ అలాగే విద్యార్థులు చిన్నతనం నుంచే మన సంస్కృతి సాంప్రదాయాలను గౌరవిస్తూ నైతిక విలువలతో కూడిన ఉత్తమ పౌరులుగా ఎదగాలి అని సందేశాన్ని ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ జక్కుల ఊర్మిళ, దామోదర్ ,సౌమ్య పాఠశాల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు పాల్గొన్నారు.




## స్థలం కబ్జాకు యత్నించిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి పై కేసు

### - సర్పంచ్ భర్త కొడుకు పై కేసు నమోదు

**ప్రజా వాయిస్ (సంగారెడ్డి) జోగిపేట :**
తనకు చెందిన 3.5 గుంటల భూమిలో అక్రమంగా చొరబడి షెడ్యూ వేసిన సర్పంచ్ భర్త, కొడుకు ( అందోల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ) పై బాధితుడు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు జోగి పెట ఎస్సై గిరి శ్రీకాంత్ గురువారం తెలిపారు. కన్సన్ పల్లి గ్రామానికి చెందిన ప్రభాకర్ రెడ్డి భూమిలో అదే గ్రామానికి చెందిన సర్పంచ్ భర్త మహిపాల్ ఆయన కొడుకు ప్రవీణ్( మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు) అక్రమంగా చొరబడి షెడ్యూ వేయడం జరిగిందన్నారు. ఈ విషయంపై బాధితుడు వారిని సంప్రదించగా ఆ స్థలం మాదేనని అందుకే షెడ్డు వేసామని బెదిరించడం జరిగిందన్నారు. దీంతో బాధితుడు ప్రభాకర్ రెడ్డి ఫిర్యాదు మేరకు మహిపాల్, అతడి కొడుకు ప్రవీణ్ పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.



## పాఠశాలలే విద్యా దేవాలయాలు: ఎస్సై రవి కిరణ్ భూషణరావుపేటలో విద్యార్థులకు యూనిఫామ్లు వితరణ

**ప్రజా వాయిస్, కథలాపూర్:**
మండలంలోని భూషణరావుపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అంబేద్కర్ ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో యూనిఫామ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్సై సిహెచ్. రవి కిరణ్ మాట్లాడుతూ.. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే పాఠశాలలు విద్యా దేవాలయాలని, సమితి సభ్యుల సేవా దృక్పథంఅభినందనీయమని కొనియాడారు. ఎంఈఓ శ్రీనివాస్, సర్పంచ్ బద్దం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం దాతలు ముందుకు రావడం సంతోషకరమన్నారు. సమితిఎఅధ్యక్షుడు తలారి మోహన్, సలహాదారు కూన అశోక్ మాట్లాడుతూ దాతల సహకారంతో గ్రామంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం దాతలను, ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి, విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు జిన్నా ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి కరెంగుల ప్రణయ్, కోశాధికారి కూన నవీన్, సభ్యులు కూన ప్రవీణ్, కూన చంద్రకాంత్, సోమిడి ప్రభు దాసు, బుర్రి శ్యాంసుందర్, బంటు సురేష్ మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## హరిత సాంకేతికతలతోనే చిన్న పరిశ్రమలకు అధిక లాభాలు

### ఇంధన పొదుపు, సౌర విద్యుత్‌తో పోటీతత్వం పెంపు

### రైస్ మిల్లులు హరిత సాంకేతికతలను స్వీకరించాలి: బాదం ప్రవీణ్

**ప్రజా వాయిస్ ములుగు జిల్లా న్యూస్:**
ములుగు రైస్ మిల్ అసోసియేషన్ సహకారంతో రిచ్ ఆధ్వర్యంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో హరిత సాంకేతికతల వినియోగంపై అవగాహన సదస్సును మంగళవారం ములుగులో నిర్వహించారు.ఈ సందర్భంగా రిచ్ ప్రాజెక్ట్ మేనేజర్ సస్టైనబిలిటీ చరణ్ ఉప్పరపల్లి మాట్లాడుతూ చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఇంధన సామర్థ్యాన్ని పెంచుకోవడం, వనరులను పొదుపుగా వినియోగించడం, సౌర విద్యుత్‌ను ఉపయోగించడం వంటి హరిత సాంకేతికతలను స్వీకరించాలని సూచించారు. తద్వారా ఉత్పత్తి వ్యయాలను తగ్గించుకోవడంతో పాటు మార్కెట్‌లో పోటీతత్వాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. పర్యావరణ పరిరక్షణతో పాటు వ్యాపార స్థిరత్వం, భవిష్యత్‌లో పరిశ్రమల అభివృద్ధికి హరిత సాంకేతికతలు ఎంతో కీలకమని పేర్కొన్నారు.ములుగు రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రైస్ మిల్లులు ఇంధన సామర్థ్య చర్యలను పాటించడంతో పాటు సౌర విద్యుత్, ఇతర హరిత సాంకేతికతలను విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఇంధన వినియోగాన్ని తగ్గించడం ద్వారా నిర్వహణ వ్యయాలు తగ్గి పరిశ్రమలకు మరింత లాభదాయకత చేకూరుతుందని తెలిపారు. స్థిరమైన అభివృద్ధి సాధించేందుకు పారిశ్రామికవేత్తలు కొత్త సాంకేతికతలను అందిపుచ్చుకోవాలని అన్నారు.ములుగు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఏ. సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ప్రభుత్వ హరిత పరిశ్రమల ప్రోత్సాహక కార్యక్రమాలను సద్వినియోగం



చేసుకోవాలని సూచించారు. ఇంధన వినియోగాన్ని తగ్గిస్తూ పర్యావరణహిత సాంకేతికతలను అవలంబించడం ద్వారా పరిశ్రమల ఉత్పాదకత, సామర్థ్యాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. ఈ అవగాహన సదస్సులో రైస్ మిల్ పరిశ్రమల ప్రతినిధులు, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

## వనపర్తి పాత బస్టాండ్‌ను అభివృద్ధి చేయరా:ఎమ్మెల్యే మేఘ రెడ్డి

### వేల కోట్లు తెచ్చామంటున్నారు.. రూ.2 కోట్లతో ఆధునీకరణ చేయలేరా ?

### నెల రోజుల్లో పనులు చేపట్టకపోతే ప్రజా ఆందోళన

### అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డా. సతీష్ యాదవ్

**ప్రజా వాయిస్.. వనపర్తి**
నాలుగైదు జిల్లాలకు రాకపోకలకు కీలకంగా ఉన్న వనపర్తిపాత బస్టాండ్ అభివృద్ధికి నోచుకోకపోవడంపై అఖిలపక్ష ఐక్యవేదిక, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పాత బస్టాండ్‌ను పరిశీలించిన వారు ప్రయాణికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డా. సతీష్ యాదవ్ మాట్లాడుతూ.. నియోజకవర్గానికి వేల కోట్ల నిధులు తెచ్చామని చెబుతున్న నాయకులు రూ.2 కోట్లతో పాత బస్టాండ్‌ను ఆధునీకరించలేరా? అని ప్రశ్నించారు. తాగునీరు, మూత్రశాలలు, నిలువ నీడ వంటి కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు దుమ్ము, ధూళిలో, ఎండా వానలో అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ అధికారులు ఎవరూ లేక ప్రైవేటు వాహనాలకు పార్కింగ్ సౌకర్యం చేశారు.కనుక రాజకీయాలు, విమర్శలు, ఆరోపణలు పక్కనపెట్టి ప్రజలకు అవసరమైన అభివృద్ధిపై దృష్టి పెట్టండి. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయండి” అని అన్నారు.పాత బస్టాండ్‌ను వెంటనే ఆధునీకరించి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. నెల రోజుల్లో పనులు ప్రారంభించకపోతే ప్రజా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్యవేదిక వేదిక అధ్యక్షులు డా”సతీష్ యాదవ్, డి.ఎస్.పి జిల్లా



అధ్యక్షులు రామకృష్ణ మహారాజ్, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ జేఏసీ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు కొత్త గొల్ల శంకర్, రాజనగరం రామస్వామి, మధు, ఎల్లయ్య, సూర్య ప్రకాష్, గంధం రవి, చందు యాదవ్, ఆంజనేయులు, శివకుమార్, శాంతయ్య, జు రవి, రమేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## నూతన సీఐ కొండ్రు శ్రీనివాస్‌కు ఎమ్మార్పీఎస్ ఘన శుభాకాంక్షలు

### ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన పోలీస్ సేవలు అందించాలి

### ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అడ్డూరి అనిల్ మాదిగ

**ప్రజా వాయిస్ ఎల్కతుర్తి**
ఎల్కతుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కొండ్రు శ్రీనివాస్‌ను ఎమ్మార్పీఎస్ ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు అడ్డూరి అనిల్ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు, సభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సీఐ కొండ్రు శ్రీనివాస్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం చిరు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఎల్కతుర్తి మండలంతో పాటు సీఐ పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలకు పోలీస్ శాఖ ద్వారా మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రజలకు ఎలాంటి సమస్య ఎదురైనా పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించినప్పుడు వారి సమస్యలను సానుకూలంగా విని, చట్టపరంగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, మహిళలు, చిన్నారుల భద్రత, యువతలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం, అసాంఘిక



కార్యకలాపాల నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. గ్రామాల్లో ప్రజలు నిర్భయంగా జీవించే వాతావరణాన్ని కల్పించడంలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.

**ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలి**
ఎల్కతుర్తి మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలకు నూతన సీఐ కొండ్రు శ్రీనివాస్ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అడ్డూరి అనిల్ మాదిగ కోరారు. ప్రజలు–పోలీసుల మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతం కావడంతో పాటు, పోలీస్ శాఖపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా నూతన సీఐ తన సేవలను అందించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా అడ్డూరి అనిల్ మాదిగ మాట్లాడుతూ.. “ఎల్కతుర్తి మండలానికి నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన కొండ్రు శ్రీనివాస్‌కు ఎమ్మార్పీఎస్ ఎల్కతుర్తి మండల కమిటీ తరఫున హృదయపూర్వక శుభాకాంక్షలు. ఆయన ఆధ్వర్యంలో మండలంలో శాంతిభద్రతలు మరింత మెరుగుపడి, అన్ని వర్గాల ప్రజలకు సమానంగా న్యాయం, రక్షణ లభించాలని కోరుకుంటున్నాం. ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీస్ శాఖకు ఎమ్మార్పీఎస్ తరఫున అవసరమైన సహకారం అందిస్తాం” అని తెలిపారు.అలాగే ఎల్కతుర్తి మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. నూతన సీఐ కొండ్రు శ్రీనివాస్ తన అనుభవంతో సమర్థవంతమైన పోలీసింగ్ అందిస్తూ ఎల్కతుర్తి సర్కిల్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అడ్డూరి అనిల్ మాదిగ తో పాటు మండల ఎంఎస్పి మండల అధ్యక్షులు కొయ్యడ రాజేందర్ మాదిగ, అధికార ప్రతినిధి మారుపాక మధుకర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ అంబాల రవీందర్ మాదిగ,మేకల రవీందర్ మాదిగ, అంబాల సంపత్ మాదిగ, పోగుల రమేష్ మాదిగ, జూపాక సదానందం మాదిగ, మండల నాయకులు అడ్డూరి నవీన్ మాదిగ, అడ్డూరి ప్రశాంత్ మాదిగ, కోతుల నడుమ గ్రామ శాఖ అధ్యక్షులు ఎర్రోళ్ల అనిల్ మాదిగ, గోపాల్పూర్ గ్రామ శాఖ అధ్యక్షులు నమిండ్ల నరేష్ మాదిగ, ఎంఎస్పి గోపాల్పూర్ గ్రామ శాఖ అధ్యక్షులు మంద అనిల్ మాదిగ, మరియు నాయకులు , ఎమ్మార్పీఎస్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొని నూతన సీఐ కొండ్రు శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## కేటీఆర్ గారూ.. బత్తాయి రైతుల గోడు వినండి

### నల్లగొండ బత్తాయి సాగును కాపాడాల్సిన సమయం ఇదే.. గిట్టుబాటు ధర కోసం రైతుల విజ్ఞప్తి

**ప్రజా వాయిస్,నల్లగొండ:**
ఒకప్పుడు నల్లగొండ జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన బత్తాయి సాగు నేడు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని బత్తాయి రైతు వేదిక జిల్లా కన్వీనర్, అడ్వకేట్ నామిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బత్తాయి రైతుల సమస్యలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని పత్రికా విలేకరులను ఆయన కోరారు.వేలాది రైతు కుటుంబాలకు జీవనాధారంగా ఉన్న బత్తాయి సాగు.. మార్కెట్ ధరలు, పెరుగుతున్న పెట్టుబడులు, నీటి సమస్యలు, తెగుళ్లు, మధ్యవర్తులపై ఆధారపడాల్సిన పరిస్థితి తదితర కారణాలతో క్రమంగా తగ్గిపోతోందన్నారు. గతంలో ఉమ్మడి నల్లగొండలో లక్షల ఎకరాల్లో ఉన్న బత్తాయి సాగు విస్తీర్ణం భారీగా తగ్గిపోయిందని తెలిపారు.రైతు తోటలో బత్తాయికి లభించే ధరకు, వినియోగదారుడి చేతికి చేరే ధరకు మధ్య భారీ వ్యత్యాసం ఎందుకు ఉంటోందని ప్రశ్నించారు. రైతులకు గిట్టుబాటు ధర ఎందుకు దక్కడం లేదో ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. బత్తాయి వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధరలను నియంత్రిస్తున్నారనే ఆరోపణలపై స్వతంత్రంగా, పారదర్శకంగా విచారణ జరిపి వాస్తవాలను రైతుల ముందుంచాలని డిమాండ్ చేశారు

**ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి**
బత్తాయి రైతులపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి, జిల్లా మార్కెటింగ్ వ్యవస్థను పరిశీలించాలని కోరారు. రైతుకు గిట్టుబాటు ధర అందేలా ధరల రక్షణ, మార్కెట్ జోక్య విధానం తీసుకురావాలని సూచించారు. మధ్యవర్తులు, కమిషన్లు, కొనుగోలు ధరలు, మార్కెట్ ధరలపై పారదర్శకత తీసుకురావడంతో పాటు ప్రత్యామ్నాయ మార్కెట్లు, ప్రాసెసింగ్ యూనిట్లు, జ్యూస్ పరిశ్రమలు, ఎగుమతి అవకాశాలను పెంచాలని కోరారు.రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఫ్పీఓ) ద్వారా సామూహిక విక్రయ శక్తిని పెంచాలని, అప్పుల భారంతో తోటలను తొలగిస్తున్న రైతులకు ప్రత్యేక ఆర్థిక సహాయం, రుణ పునర్వ్యవస్థీకరణ వంటి చర్యలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. 2023, 2024, 2025లో నల్లగొండలో నిర్వహించిన బత్తాయి రైతు సమీక్షలు, సిట్రస్ సెమినార్లలో మార్కెటింగ్, ఎగుమతులు, ఆధునిక సాగు పద్ధతులపై చర్చించి సంబంధిత అధికారులకు నివేదికలు అందజేసినట్లు తెలిపారు.బత్తాయి రైతు సమస్య కేవలం వ్యవసాయ సమస్య కాదని, ఇది నల్లగొండ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన అంశమని శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రైతులు తోటలను తొలగించే పరిస్థితి వస్తుందని, తద్వారా నల్లగొండకు దశాబ్దాలుగా ఉన్న “బత్తాయి జిల్లా” గుర్తింపు ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.“ఇది రాజకీయ ఆరోపణల సమయం కాదు.. రైతును కాపాడే నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయం. ప్రభుత్వం, ఉద్యానవన, మార్కెటింగ్, వ్యవసాయ శాఖలు, రైతు సంఘాలు, వ్యాపారులు, నిపుణులు కలిసి సమగ్ర బత్తాయి మార్కెటింగ్ విధానాన్ని రూపొందించాలి. రైతు బతికితేనే బత్తాయి బతుకుతుంది.. బత్తాయి బతికితేనే నల్లగొండ ప్రత్యేకత బతుకుతుంది” అని ఆయన అన్నారు.





# మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే సహించేది లేదు

**- రోడ్డు ప్రమాదలకు కారణం మద్యం మస్తులో డ్రైవింగ్..**
**- పుల్కల్ ఎస్సై విశ్వజాన్**

**ప్రజా వాయిస్,సంగారెడ్డి :**
బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి వాహనాలను నడపడం చట్ట విరుద్ధమని పుల్కల్ ఎస్సై విశ్వజన్ అన్నారు. మండల కేంద్రమైన పుల్కల్ లో గురువారం సాయంత్రం బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న వ్యక్తులను పట్టుకున్నారు. ఈ మేరకు వాళ్లకి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేయగా మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో వారి సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకొని కోర్టు చాలన్ కట్టి తీసుకోవాలని సూచించారు. తమ ఫోన్లు తమకు ఇవ్వాలని కోరిన మద్యం కేసులో ఫోన్లు తీసుకోవడం జరిగిందని కోర్టు నుంచి తీసుకోవాలని ఎస్ఐ సూచించారు.

# ఏకేఆర్ స్టడీ సర్కిల్ పుస్తకాల ఆవిష్కరణ

**ప్రజావాయిస్/వికారాబాద్:**



ఏకేఆర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం ఏకేఆర్ అధ్యాపకులచే రచించబడిన కానిస్టేబుల్, ఎస్ఐ, ఎఫ్‌బీఓ, ఇతర పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను గురువారం తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు.పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు నాణ్యమైన, సమగ్రమైన స్టడీ మెటీరియల్ అందించాలనే ఉద్దేశంతో ఏకేఆర్ స్టడీ సర్కిల్ ఈ పుస్తకాలను రూపొందించింది. అభ్యర్థుల పరీక్షా సన్నద్ధతకు ఈ పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడనున్నాయి.ఈ కార్యక్రమంలో ఏకేఆర్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ బీవీ రమణ, స్రవంతి, రైట్ ఛాయిస్ చైర్మన్ మెండం కిరణ్, ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ ఆకెళ్ల రాఘవేంద్ర పాల్గొన్నారు.

# శరవేగంగా విద్యుత్ సమస్యల పరిష్కారం

**ఎస్.ఈ, మహేందర్ ప్రత్యేక చొరవతో నూతన విద్యుత్ కనెక్షన్లు**
**విద్యుత్ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న గ్రామ ప్రజలు**

**ప్రజా వాయిస్ పాల్వంచ**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండల రూరల్ పరిధిలోని రంగాపురం గ్రామపంచాయతీలో గురువారం నాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎస్.ఈ, మహేందర్ ప్రత్యేక చొరవతో గ్రామపంచాయతీ పరిధిలోని 6 వార్డులో ఇండ్లు నిర్మించుకొని ఎన్నో సంవత్సరాలుగా విద్యుత్ కనెక్షన్ అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సమాచారం తెలుసుకున్న ఎస్.ఈ, మహేందర్ ఎలాగైనా తక్షణమే విద్యుత్ కనెక్షన్ లేని ఈ బాధితులకు నూతన విద్యుత్ కనెక్షన్లు తక్షణమే మంజూరు చేయాలంటూ స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. సత్వరగా విద్యుత్ సమస్యను పరిష్కరించినందుకు రంగాపురం గ్రామ ప్రజలు, 6 వార్డు అయినటువంటి నూనవత్ విజయ ప్రత్యేకంగా జిల్లా ఎస్.ఈ, మహేందర్ కు అలాగే విద్యుత్ శాఖ అధికారులకు కార్మికులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

# తిర్యాణి అడవుల్లో ఎలుగుబంట్ల దాడి..

**మేకల కాపరికి గాయాలు**

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**



కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం రోంపల్లి పంచాయతీ పరిధిలోని నాయకపుగూడ గ్రామానికి చెందిన మోడితే శంకర్(54)పై మూడు ఎలుగుబంట్లు దాడి చేసిన సంఘటన చోటుచేసుకుంది. సమీప అటవీ ప్రాంతంలో మేకలు మేపుతున్న సమయంలో అకస్మాత్తుగా ఎలుగుబంట్లు దాడి చేశాయి. బాధితుడు కేకలు వేయడంతో సమీపంలోని పశువుల కాపరులు, రైతులు స్పందించి కేకలు వేస్తూ ఎలుగుబంట్లను అడవిలోకి తరిమికొట్టారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన శంకర్‌ను చెలిమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**- సైబర్ నేరగాళ్ల ఫోన్ కాల్స్ కి భయపడొద్దు**
**- యాలాల్ ఎస్ఐ విఠల్ రెడ్డి**

**ప్రజా వాయిస్/యాలాల్:**



యువత మత్తు పదార్థాలకు గంజాయి లాంటి పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.ఎస్సై విఠల్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు మద్యానికి బానిసై ఉజ్వల భవిష్యత్తు ను మరిచిపోతున్నారు మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా ఉన్నత విద్యా వ్యాసం స్పోర్ట్స్ వైపు దూసుకెళ్లాలని అన్నారు సమాజంలో గంజాయి మత్తు పదార్థాలకు క్రయ విక్రయాల జరిపే వారిపట్ల పోలీసులకు సమాచారం ఇవ్వండి ఫోన్ నెంబర్ 8712670054 లేదా 112 కి సమాచారం ఇవ్వాలి అన్నారు.డాక్స్ తో పాటు ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచితుల వ్యక్తుల నుండి ఫోన్ కాల్ వచ్చి మీకు లోన్ వస్తుంది అంటూ కొత్త లింక్స్ ఓపెన్ చేయమంటారు,అలాంటి వ్యక్తుల ఫోన్ కాల్ అసలు లిఫ్ట్ చేయవద్దు కొందరు వ్యక్తులు అమ్మాయిల ప్రొఫైల్ ఫొటోస్ పెట్టి యువతకు బ్లాక్ మెయిల్ చేస్తూ ఉంటారు, ఇలాంటి వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలన్నారు ఆన్లైన్ ఆటలు జోలికి వెళ్లకూడదు అని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదు అని అన్నారు. ముఖ్యంగా యువత ర్యాష్ డ్రైవింగ్ చేయరాదు, ద్విచక్ర వాహనాలు నడుపుతున్న ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యం చేరుకోవాలని సూచించారు.




# కెరమెరిలో కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశం

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**
కొమరం భీం ఆసిఫాబాద్ నియోజకవర్గం కెరమెరి మండల పార్టీ కార్యాలయంలో అజ్మీరా శ్యామ్ నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశం జరిగింది. పార్టీ బలోపేతం, రాబోయే కార్యక్రమాల నిర్వహణ, ప్రజా సమస్యల పరిష్కారం తదితర అంశాలపై నాయకులు చర్చించారు. ప్రజలకు అండగా ఉంటూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. అజ్మీరా శ్యామ్ నాయక్ పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో కెరమెరి మండల అధ్యక్షుడు జునైత్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సెయింట్ థామస్ అల్టిట్యూడ్ పాఠశాలలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**ప్రజా వాయిస్ ఎల్కతుర్తి**
ఎల్కతుర్తి మండల కేంద్రంలోని సెయింట్ థామస్ అల్టిట్యూడ్ హై స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి. చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలో ముస్తాబై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆటపాటలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాఠశాల ఆవరణ సందడిగా మారింది.వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఉట్టి కొట్టేందుకు పోటీపడ్డారు. చిన్నారుల ఆనందోత్సాహాలతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పుస్కూరి కార్తీక్ రావు మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడి జీవితం, ఆయన బోధించిన ధర్మం, సత్యం, ప్రేమ, మానవతా విలువలను విద్యార్థులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పాఠ్యాంశాలతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను విద్యార్థులకు పరిచయం చేయడం ద్వారా వారిలో నైతిక విలువలు పెంపొందుతాయని తెలిపారు. కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మర్రి అశోక్, వైస్ ప్రిన్సిపల్ లింగం మొగిలి, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రె తిరుపతి, ఉపాధ్యాయులు సరిత, లావణ్య, మమత, కవిత, స్వప్న, గీత, కావ్య, కళ్యాణి, కృష్ణ, ఆశా బేగం, సురేష్, లలిత, సుమలత, రమేష్, రమ్య తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల సమన్వయంతో కృష్ణాష్టమి వేడుకలు విజయవంతంగా నిర్వహించారు.



# కన్నెపల్లిలో రహదారి వెంట మొక్కల పెంపకం

**ప్రజా వాయిస్ కౌటాల**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం కన్నెపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గురువారం అవెన్యూ ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కన్నెపల్లి నుంచి కనికి వెళ్లే ప్రధాన రహదారి వెంట మొక్కలు నాటారు. పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టారు.రహదారుల వెంట మొక్కలు నాటడం వల్ల పచ్చదనం పెరగడంతో పాటు భవిష్యత్‌లో ప్రయాణికులకు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని సర్పంచ్ మోర్లె పార్వతి తెలియజేశారు. నాటిన మొక్కలను క్రమం తప్పకుండా సంరక్షిస్తామని, గ్రామపంచాయతీ పరిధిలో పచ్చదనం పెంపొందించే కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మోర్లె సమత, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, ఎఫ్‌ఏ, మేట్, యువకులు, గ్రామపంచాయతీ లేబర్స్, ఉపాధి హామీ పథకం కూలీలు తదితరులు పాల్గొన్నారు.



# శివపూర్‌లో అంగన్వాడీ భవన ప్రారంభం..

**రజక సంఘం సమస్యలపై హామీ ఇచ్చిన ఎమ్మెల్యే హరీష్ బాబు**

**ప్రజా వాయిస్ కగజ్ నగర్**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లోని తన నివాసంలో రజక సమాజం సమస్యలను సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు దృష్టికి రజక సంఘం నాయకులు తీసుకెళ్లారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన 250 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు కావడం లేదని, రజకులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. వచ్చే వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో ఈ సమస్యలను లేవనెత్తి పరిష్కారానికి కృషి చేస్తానని హరీష్ బాబు హామీ ఇచ్చారు.అదే రోజు బారెగూడ గ్రామపంచాయతీ పరిధిలోని శివపూర్‌లో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని హరీష్ బాబు ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ ఉపాధి హామీ పథకం నిధులతో రూ.12 లక్షల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించారు. సర్పంచ్ కోట వేణుగోపాల్‌తో కలిసి భవనాన్ని ప్రారంభించిన హరీష్ బాబు, పిల్లలు, గర్భిణీ మహిళలకు పౌష్టికాహార లోపం లేకుండా ఐసీడీఎస్ పథకాన్ని ప్రభుత్వం చేపడుతుందని, ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిర్మాణంలో ఎదురైన ఆటంకాలను అధిగమించి పనులు పూర్తి చేసినట్లు సర్పంచ్ వెల్లడించారు. గ్రామపంచాయతీ బీటీ రోడ్డు రెన్యూవల్, శివపూర్ ప్రాథమిక పాఠశాల నూతన భవనం మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు.

# రాహుల్ గాంధీపై అక్రమ కేసును ఎత్తివేయాలి కోరుట్లలో కాంగ్రెస్ శ్రేణుల ధర్నా

**ప్రజా వాయిస్, కోరుట్ల:**
ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై ఉత్తరాఖండ్ పోలీసులు నమోదు చేసిన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ మంగళవారం కోరుట్ల పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద కాంగ్రెస్ నాయకులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, సీనియర్ నేత జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ.. ఉత్తరాఖండ్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభ నిర్వహించిన ప్రాంగణాన్ని బీజేపీ నేతలు గంగాజలంతో శుద్ధి చేయడం దళితుల పట్ల వారికున్న వివక్షకు నిదర్శనమన్నారు. దీనిని ప్రశ్నించిన రాహుల్‌పై కేసు పెట్టడం దుర్మార్గమని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పన్నాల అంజిరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.





## చేపల పెంపకంతో అదనపు ఆదాయం..

### లబ్ధిదారులకు చేప పిల్లల పంపిణీ

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో గురువారం చేప పిల్లల పంపిణీ కార్యక్రమం జరిగింది. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలోని వీబీజీ రామ్‌జీ పథకం కింద చేపట్టిన పంట కుంటలు, నీటి కుంటలు, ఊట కుంటలకు ప్రధానమంత్రి కేఏఎస్‌వై ద్వారా జల్ జీవిక స్వచ్ఛంద సంస్థ ఈ చేప పిల్లలను అందించింది. జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావుతో కలిసి లబ్ధిదారులకు చేప పిల్లలను పంపిణీ చేశారు.స్వయం సహాయక సంఘాల మహిళలు, ఉపాధి కూలీలు తమ వ్యవసాయ భూముల్లోని ఊట కుంటలు, నీటి కుంటలు, పంట కుంటల్లో చేపల పెంపకం చేపట్టి అదనపు ఆదాయంతో ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవచ్చని కలెక్టర్ హరిత తెలిపారు. జల్ జీవిక స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చి చేప పిల్లలను అందించడం అభినందనీయమని, లబ్ధిదారులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



## కల్వరాల గ్రామంలో ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా నోడల్ వైద్య అధికారి డాక్టర్ వంశీకృష్ణ

ప్రజా వాయిస్.. వనపర్తి

వనపర్తి జిల్లావీపనగండ్ల మండల పరిధిలోని కల్వరాల గ్రామాన్ని డా. వంశీకృష్ణ (పో --టీబీ ఒ ఎన్ వీబీడీసీపీ ), డా. రాజశేఖర్ గురువారం సందర్శించి జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, టీబీ నియంత్రణ చర్యలు, సీజనల్ వ్యాధుల నివారణ కార్యక్రమాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.ముఖ్యంగా ప్రతి రోజు డ్రై డే నిర్వహించాలి ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి దోమల వృద్ధి ప్రదేశాలను గుర్తించి తొలగించాలి,టీబీ లక్షణాలు ఉన్న వారిని గుర్తించి పరీక్షలకు పంపించాలి ఇంటింటా జ్వర సర్వే నిర్వహించాలి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు.కార్యక్రమంలో ఏఎన్ఎం సునీత, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## భర్త హత్య కేసులో భార్యకు జీవిత ఖైదు

### నాగర్‌కర్నూల్ జిల్లా కోర్టు సంచలన తీర్పు.. 2004 నాటి కేసులో శిక్ష

**లింగాల, సెప్టెంబర్ 3 (ప్రజావాయిస్):**

భర్తను హత్య చేసిన కేసులో భార్యకు నాగర్‌కర్నూల్ జిల్లా సెషన్స్ కోర్టు జీవిత ఖైదు విధించింది. లింగాల మండలం చెన్నంపల్లికి చెందిన మేకల ఎల్లమ్మ తన భర్త మేకల రాములును హత్య చేసిన కేసులో నిందితురాలిగా ఉంది. ఈ ఘటనపై లింగాల పోలీస్‌స్టేషన్‌లో క్రైం నంబర్ 150/2004 కింద కేసు నమోదైంది. కేసు విచారణ అనంతరం నిందితురాలు ఎల్లమ్మకు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి డి.రమాకాంత్ జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెలువరించారు. నిందితురాలికి శిక్ష పడేలా కేసును సమర్థవంతంగా నడిపించిన కోర్టు కానిస్టేబుల్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్, లింగాల పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓను జిల్లా ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జి.పాటిల్ అభినందించారు.

## ములుకనూరు రైతులకు పి.వి. నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయంలో రెండు రోజుల శిక్షణ



**ప్రజా వాయిస్, భీమదేవరపల్లి:**

రాజేంద్రనగర్‌లోని పి.వి. నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయంలో (్రాఎచీ=ుఎఖ) ములుకనూరు సంఘం రైతులకు నిర్వహించిన రెండు రోజుల ప్రత్యేక శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. "సమగ్ర పశుపోషణ జీవనోపాధి శిక్షణా కార్యక్రమం"లో భాగంగా సెప్టెంబర్ 2, 3 తేదీలలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆరోగ్యకరమైన జంతువుల పెంపకం ద్వారా అధిక పెరుగుదల, ఎక్కువ లాభాలు సాధించే మార్గాలతో పాటు గొర్రెలు, మేకల పెంపకం, శాస్త్రీయ నిర్వహణ, మేత-దాణా యాజమాన్యం, ఉత్తమ జాతులు మరియు పెంపకం పద్ధతులపై విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు రైతులకు సమగ్రమైన అవగాహన కల్పించారు.ఈ శిక్షణా కార్యక్రమంలో ములుకనూరు సంఘానికి చెందిన 62 మంది రైతులు పాల్గొని మెళకువలు నేర్చుకున్నారు. ్రాఎచీ=ుఎఖ విస్తరణ విభాగం డైరెక్టర్ డాక్టర్ కిషన్, అసోసియేట్ డీన్ డాక్టర్ మాధురి, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ అమరేశ్వరి మరియు ఇతర ప్రముఖ శాస్త్రవేత్తలు హాజరై రైతులకు తగిన సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యవర్గ సభ్యులతో పాటు వ్యవసాయ అధికారులు ఎస్. శ్రీనివాస్, బి. స్వామి రావు మరియు సహాయ వ్యవసాయ అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఖ

## జల్సాల కోసం దొంగతనాలు. ముగ్గురు సభ్యుల ముఠా అరెస్ట్

### రెండు నెలల్లో ఐదు చోరీలు.. 30 తులాల వెండి, సిలిండర్లు, బ్యాటరీలు, నగదు స్వాధీనం

**ప్రజా వాయిస్,నల్గొండ.**




జల్సాలకు అలవాటు పడి తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల ముఠాను నల్గొండ వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ పాతబస్తీ ప్రాంతంలోని వివిధ కాలనీలకు చెందిన నదీమ్ (25), షేక్ రిజ్వాన్ (26), మహమ్మద్ అబ్దుల్ సమీర్ (23) ముఠాగా ఏర్పడి గత రెండు నెలలుగా తాళం వేసిన ఇళ్లను గుర్తించి చోరీలకు పాల్పడుతున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా ఐదు దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించినట్లు తెలిపారు. వారి నుంచి 30 తులాల వెండి ఆభరణాలు, నాలుగు గ్యాస్ సిలిండర్లు, మూడు బ్యాటరీలు, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.14,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులకు గతంలోనూ నేర చరిత్ర ఉండి జైలుకు వెళ్లినట్లు పోలీసులు వెల్లడించారు. డీఎస్పీ కె. శివరాం రెడ్డి ఆదేశాల మేరకు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐలు సైదులు, వెంకట్ నారాయణ, సిబ్బంది రబ్బానీ, సాగర్ల శంకర్, అంజద్, కిరణ్, అంజయ్యలు చాకచక్యంగా వ్యవహరించి ముఠాను పట్టుకున్నారు. పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించినట్లు తెలిపారు.

## పుల్గర్‌చర్ల గ్రామంలో అన్నపై తమ్ముడు గొడ్డలితో దాడి

### తమ్ముడిపై కేసు నమోదు, రిమాండ్‌కు తరలింపు,,

### ఎస్సై జె నరేష్ కుమార్

**ప్రజా వాయిస్.. వనపర్తి**



వనపర్తి జిల్లావీపనగండ్ల మండల పరిధిలోని పుల్గర్‌చర్ల గ్రామానికి చెందిన బిజ్జా జగదీష్‌పై గొడ్డలితో దాడి చేసిన అతని తమ్ముడు బిజ్జా శివరాజుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వీపనగండ్ల ఎస్సై నరేష్ కుమార్ తెలిపారు.ఎస్సై వివరాల ప్రకారం.. ఆగస్టు 30న ఇంటి ముందు ఉన్న అన్న జగదీష్‌పై పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని తమ్ముడు శివరాజు గొడ్డలితో దాడి చేశాడు.ఈ ఘటనలో జగదీష్‌కు గాయాలయ్యాయి.బాధితుడు జగదీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శివరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గురువారం నిందితుడిని కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై నరేష్ కుమార్ తెలిపారు.

## రైతులను హరిగోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

రైతులను హరిగోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### ఇచ్చిన హామీలు అమలు చేయలేదు

### ఎండుతున్న పంటలు

### బిఆర్ఎస్ నాయకులు

**ప్రజా వాయిస్.. వనపర్తి**

రైతు భరోసా గత ప్రభుత్వం ఎకరాకు రెండు పంటలకు పదివేల ఇస్తుంది మేము 15000 రూ " ఇస్తామని చెప్పి రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ వరంగల్ డిక్లరేషన్ పేరిట వరి పంటకు 500 బోనాస్ ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రభుత్వం సన్న వడ్లకే ఇస్తామని చెప్పి ఈరోజు మళ్లీ మాట మార్చి ఏడు రకాల సన్న వడ్లకే 500 బోనాస్ ఈస్తామని అదేవిధంగా ఈరోజే ఉరికి పోయి బ్యాంకులో రెండు లక్షలు తెచ్చుకోండి మేము వచ్చిన వెంటనే మాఫీ చేస్తామని చెప్పి రాష్ట్రవ్యాప్తంగా 50 లక్షల మంది రైతులు రుణాలు తెచ్చుకుంటే ఈరోజు వరకు కూడా ఈ ప్రభుత్వం 20 లక్షల మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేసింది 50% కూడా చేయలేదు కెసిఆర్ ప్రభుత్వం రైతులకు 24 గంటలు కరెంటు ఇస్తే ఈ ప్రభుత్వం ఈరోజు సగానికి కుదించి 13 గంటలు ఇస్తుంది చిన్నంబావి మండలం లో ఎండుతున్న పంటలు సరిగా నీళ్లు అందక ఎండుతున్న మొక్కజొన్న , ఉల్లి, పంటలు అధికారంలోకి రాకముందు అడ్డగోలు హామీలు ఇచ్చి ఈరోజు బొక్క బోర్లా పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 6 గ్యారంటీలు అమలు చేస్తామని ఓట్లు దండుకున్న తర్వాత 1000 రోజులు దాటిపోతున్న ఇచ్చిన హామీలను ఉచిత బస్సు మినహా ఏ ఒక్క హామీని కూడా సంపూర్ణంగా అమలు చేసిన దాకలం లేదు మూడు సంవత్సరాల లో చేయలేని పనులు మిగిలిన రెండు సంవత్సరాల లో ఏ విధంగా చేస్తారు అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు మీ అసమర్థతలను



బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు నిరంతరం ప్రశ్నిస్తూనే అని మాజీ ఎంపీపీ సొమెస్వరమ్మ , మాజీ జడ్పిటిసి వెంకటరమణమ్మ చిన్నారెడ్డి, మాజీ మండల అధ్యక్షులు గజ్జె ఈదన్న యాదవ్ సింగిల్ విండో డైరెక్టర్ డేగ శేఖర్ యాదవ్ , నిరంజన్ రెడ్డి, కరుణాకర్ గౌడ్, జయ గౌడ్ ,మహి చందర్ యాదవ్ , జింకల రమేష్, వడ్డేమాన్ రామకృష్ణుడు, పెద్ద నరసింహ మరియు రైతులు బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## సెయింట్ థామస్ అల్టిట్యూడ్ పాఠశాలలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**ప్రజా వాయిస్ ఎల్కతుర్తి**

ఎల్కతుర్తి మండల కేంద్రంలోని సెయింట్ థామస్ అల్టిట్యూడ్ హై స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి. చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలో ముస్తాబై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆటపాటలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాఠశాల ఆవరణ సందడిగా మారింది.వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఉట్టి కొట్టేందుకు పోటీపడ్డారు. చిన్నారుల ఆనందోత్సాహాలతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా పాఠశాల




కరస్పాండెంట్ పుస్కూరి కార్తీక్ రావు మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడి జీవితం, ఆయన బోధించిన ధర్మం, సత్యం, ప్రేమ, మానవతా విలువలను విద్యార్థులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పాఠ్యాంశాలతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను విద్యార్థులకు పరిచయం చేయడం ద్వారా వారిలో నైతిక విలువలు పెంపొందుతాయని తెలిపారు. కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మర్రి అశోక్, వైస్ ప్రిన్సిపల్ లింగం మొగిలి, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రె తిరుపతి, ఉపాధ్యాయులు సరిత, లావణ్య, మమత, కవిత, స్వప్న, గీత, కావ్య, కళ్యాణి, కృష్ణ, ఆశా బేగం, సురేష్, లలిత, సుమలత, రమేష్, రమ్య తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల సమన్వయంతో కృష్ణాష్టమి వేడుకలు విజయవంతంగా నిర్వహించారు.

## కాంగ్రెస్ 1000 రోజుల దగా పాలనపై టేక్మాల్‌లో బీఆర్ఎస్ సమరభేరి

### రైతు సదస్సులో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్..

### 420 హామీలు, 6 గ్యారంటీల అమలుకు డిమాండ్..

**ప్రజావాయిస్ టేక్మాల్ :**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనను నిరసిస్తూ టేక్మాల్ మండలంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సమరభేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సదస్సు ఏర్పాటు చేసి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హామీలను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు.

**రైతులకు యూరియా అందించడంలో ఇబ్బందులు**

రైతు సదస్సులో ప్రధానంగా యూరియా సమస్యపై చర్చించారు. ప్రస్తుతం యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని, యాప్ ద్వారా నమోదు చేసుకోవడం వల్ల అనేక సమస్యలు ఎదురవుతున్నాయని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. రైతులకు అవసరమైన సమయంలో సులభంగా యూరియా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.యూరియాను కేవలం యాప్ ద్వారా మాత్రమే పంపిణీ చేయకుండా, రైతులకు నేరుగా ఎరువుల దుకాణాల వద్ద అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు యూరియా కోసం గంటల తరబడి వేచి ఉండే పరిస్థితి లేకుండా, గ్రామీణ ప్రాంతాల్లోనే సరిపడా ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

**హామీల అమలుపై నిలదీత**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా



అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీలతో పాటు ప్రజలకు ఇచ్చిన ఇతర హామీలను కూడా అమలు చేయాలని, ప్రజలకు ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని అన్నారు.రైతులు, మహిళలు, యువత, పేదలు, ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైతే బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున మరింత బలంగా పోరాటాలు నిర్వహిస్తుందని నాయకులు హెచ్చరించారు.

**రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది**

రైతుల సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందించడంతో పాటు, వ్యవసాయానికి సంబంధించిన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.టేక్మాల్ మండలంలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. రైతుల ఇబ్బందులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనపై ప్రజల్లో చర్చ జరగాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలయ్యాయో ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో గ్రామగ్రామాన ప్రజలను కలుస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.రైతు సదస్సులో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొని రైతుల సమస్యలు, ప్రభుత్వ హామీల అమలు, యూరియా పంపిణీ తదితర అంశాలపై చర్చించారు.

# చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి...

**- క్రీడలతోనూ ఉద్యోగ అవకాశాలు.**
**- ఎంఈఓ ఆరేపల్లి రాజయ్య**
**- ఐపీఎస్ పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్.**

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలతో శారీరక దారుఢ్యంతోపాటు అధిక ఉద్యోగ అవకాశాలు సైతం ఉన్నాయని సుల్తానాబాద్ మండల ఎంఈఓ ఆరేపల్లి రాజయ్య, పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ అన్నారు. క్రీడలే ఆరోగ్యానికి బాట అని పేర్కొన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో మూడు రోజులుగా నిర్వహించిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు గురువారం



ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ఎంఈఓ ఆరేపల్లి రాజయ్య, పెద్దపల్లి జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్, ఇండియన్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఎస్‌జీఎఫ్ పోటీలు ఎంతో దోహదపడతాయన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్ మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలనతో సాధన చేస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. అనంతరం వివిధ క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు, పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ మండల ఎస్‌జీఎఫ్ కార్యదర్శి తాండ్ర ప్రణయ్, ఆల్ఫోర్స్ ప్రిన్సిపల్ సత్యం, సీనియర్ ఖోఖో క్రీడాకారుడు బైరగోని రవీందర్, ఖేల్ ఇండియా కోచ్ గెల్లు మధుకర్, టగ్ ఆఫ్ వార్ జిల్లా కార్యదర్శి సంపత్, వ్యాయామ ఉపాధ్యాయులు దాసరి ప్రసాద్, వెంకటేష్, ఆసియా, శ్రీవాణి, సంధ్య, సత్యనారాయణ, శివ, సతీష్, జ్యోతి, రాజేష్, వెంకటలక్ష్మి, సునీత తో పాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ది దగా పాలన.. ప్రజలకు ఇచ్చిన

# హామీల్లో ఒక్కటీ సక్రమంగా అమలు కాలేదు

**వెయ్యి రోజులు పూర్తి అవుతున్న ప్రజలకు ఉపయోగపడే పని కాంగ్రెస్ ప్రభుత్వం చేయలేదు**

**మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి**

ప్రజా వాయిస్.. వనపర్తి

ఖిల్లా ఘనపూర్ మండల కేంద్రంలోని పద్మశాలి కల్యాణ మండపంలో నిర్వహించిన రైతు నిరసన సదస్సులో మాజీ మంత్రి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ ఆదేశాల మేరకు రైతుల సమస్యలపై నిరసన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు 1000 రోజులు పూర్తవుతున్నా ప్రజలకు ఉపయోగపడే ఒక్క ముఖ్యమైన ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదని నిరంజన్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికల సమయంలో 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా సరైన పద్ధతిలో అమలు చేశారా అని ఆయన ప్రశ్నించారు.

**కేసీఆర్‌హయాంలో రైతులకు భరోసా**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో ప్రవేశపెట్టిన రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. గతంలో



సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీలు రైతుల కోసం ఇలాంటి పథకాలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వడంతో వలస వెళ్లిన అనేక మంది రైతులు తిరిగి గ్రామాలకు చేరుకుని సాగు చేసుకున్నారని తెలిపారు. "సాగు బాగుంటేనే తెలంగాణ బాగుపడుతుంది" అని అన్నారు.

**సాగునీటి ప్రాజెక్టులపై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి**

తక్కువ వర్షపాతం ఉన్నప్పటికీ శ్రీశైలం జలాశయం నిండిందని, అయితే ఆ నీటిని ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందడంతో రైతులు ఆత్మవిశ్వాసంతో వ్యవసాయం చేస్తున్నారని అన్నారు. గణప సముద్రం ప్రాజెక్టు రైతులకు రూ.20 లక్షల పరిహారం అందిస్తామని తెలిపారు. రైతులకు తాము ఇచ్చిన హామీ మేరకే నిధులు వచ్చాయని, దీనిపై గతంలో విమర్శలు చేసిన వారు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చెరువులోని ఒండ్రుమట్టిని అక్రమంగా విక్రయించిన వారిపై కూడా చర్యలు తీసుకోవాలని అన్నారు.

**ప్రజలను భయభ్రాంతులకు గురిచేయొద్దు**

పనులు చేసుకుని జీవించే వారిపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేయడం సరికాదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ప్రజలకు ప్రభుత్వం జీవనోపాధి చూపించాల్సిన బాధ్యత ఉందన్నారు.

గిరిజన ప్రాంతాల రైతులకు సాగునీరు అందించేందుకు కర్నెతండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీ ఇచ్చామని గుర్తుచేశారు. అయితే సబ్‌స్టేషన్ ఏర్పాటుకే మూడేళ్లు పట్టిందని విమర్శించారు.

**కాంగ్రెస్ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

గత బీఆర్ఎస్ పాలనకు, ప్రస్తుత కాంగ్రెస్ పాలనకు ఉన్న తేడాను ప్రజలు చర్చించుకుంటున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. "నిజం నిప్పులాంటిది.. ప్రజలు కాల్చి చూపిస్తారు" అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటి అమలులో జరిగిన వైఫల్యాలను ప్రతిరోజూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తాము తీసుకొచ్చిన అభివృద్ధి పనులు తప్ప ప్రస్తుత ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త పనులు కనిపించడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కృష్ణ నాయక్, లక్ష్మారెడ్డి, రాళ్ల కృష్ణయ్య, సామ్య నాయక్, బాల్‌రెడ్డి, రంగారెడ్డి, సురేందర్, జత్రు నాయక్, పీనానాయక్, ఆంజనేయులు గౌడ్, ఆదికేశవరెడ్డి, కేశవరెడ్డి, నవీన్, రవీందర్‌రెడ్డి, సత్యం తదితరులతో పాటు ఆయా గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట..నిలబెట్టుకున్న ఎమ్మెల్యే

**గుడిసెలోని కుటుంబానికి 'ఇందిరమ్మ' అండ**

**ఎన్నికల వేళ ఇచ్చిన హామీ అమలు**

**తిమ్మాపురంలో పేద కుటుంబానికి సొంతింటి కల సాకారం**

**గ్రామపంచాయతీలో సుమారు 25 ఇళ్లకు మంజూరు**

ప్రజా వాయిస్,దామరచర్ల.

ఎన్నికల ప్రచారంలో ఓ పేద కుటుంబానికి ఇచ్చిన మాటను మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి నిలబెట్టుకున్నారు. దామరచర్ల మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన బోరిగళ్ల మాధవి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. దీంతో ఇన్నాళ్లూ గుడిసెలో జీవనం సాగించిన ఆ కుటుంబంలో సొంతింటి ఆశలు చిగురించాయి. ఎన్నికల ప్రచార సమయంలో తిమ్మాపురం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే దీ=ను మాధవి కలిసి తమ కుటుంబ పరిస్థితిని వివరించారు. ముగ్గురు పిల్లలతో గుడిసెలో ఉంటున్నామని, పేదరికం కారణంగా పిల్లల భవిష్యత్‌పై ఆందోళనగా ఉందని ఆమె వాపోయారు. తమకు ఇల్లు మంజూరు చేయించాలని కోరగా.. గెలిచిన వెంటనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు స్థానిక కాంగ్రెస్ నాయకుడు దానవత్ కిషన్ నాయక్ ద్వారా ప్రజాపాలనలో దరఖాస్తు చేయించి, మాధవి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నారు. తిమ్మాపురం గ్రామపంచాయతీలో అర్హులైన పేద కుటుంబాలను గుర్తించి సుమారు 25 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు స్థానిక నాయకులు తెలిపారు. ఇల్లు మంజూరు కావడంతో బోరిగళ్ల మాధవి ఎమ్మెల్యే దీ=కు, ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు నుంచి మంజూరు వరకు సహకరించిన కిషన్ నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం తమ కుటుంబానికి ఎంతో సంతోషాన్ని కలిగించిందని పేర్కొన్నారు.



# విషం చిమ్మే పరిశ్రమలను వెంటనే తొలగించాలి

**అంతమ్మగూడెం, దోతిగూడెం ప్రజల ప్రాణాలు బలిపీఠంపై.. రైతులకు పూర్తి నష్టపరిహారం చెల్లించాలి**

**అధికారులు, పరిశ్రమల యాజమాన్యాల కుమ్మక్కుపై విచారణ జరపాలి: సీపీఎం**

ప్రజా వాయిస్,అంతమ్మగూడెం.

కెమికల్ పరిశ్రమల కాలుష్యంతో ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి. జహంగీర్ ప్రశ్నించారు. విషాన్ని చిమ్మే పరిశ్రమలతో అధికారులు, పాలకులు కుమ్మక్కయ్యారనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అంతమ్మగూడెం, దోతిగూడెం గ్రామాల ప్రజలను బలిపీఠంపై పెట్టే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో అంతమ్మగూడెం గ్రామ రైతులు, ప్రజలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో జహంగీర్ మాట్లాడారు. ప్రజల ఆరోగ్యం, వ్యవసాయ భూములు, పర్యావరణాన్ని దెబ్బతీస్తున్న కెమికల్ పరిశ్రమలను వెంటనే తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు. పరిశ్రమల కారణంగా ఇంతకాలం నష్టపోయిన రైతాంగాన్ని గుర్తించి పూర్తి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలో కేవలం అధికారులు, పరిశ్రమల ప్రతినిధులకే కాకుండా బాధిత గ్రామాల రైతులు, ప్రజలకు కూడా అవకాశం కల్పించాలని



అన్నారు. పరిశ్రమల వల్ల నష్టపోయిన రైతులు, వ్యవసాయ భూములను గుర్తించేందుకు రీ-సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. కాలుష్యం వల్ల ప్రజలకు, పంటలకు, భూములకు జరిగిన నష్టంపై సమగ్ర అధ్యయనం చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహా, మాజీ డివిజన్ కార్యదర్శి గూడూరు అంజిరెడ్డి, మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, మండల కార్యదర్శివర్గ సభ్యులు పగిల్ల లింగారెడ్డి, ప్రసాదం విష్ణు, మంచాల మధు తదితరులు మాట్లాడారు. సీపీఎం నాయకులు గుర్రం రామచంద్రారెడ్డితో పాటు గ్రామ రైతులు, ప్రజలు జి. దామోదర్‌రెడ్డి, కే. మహేష్, ఆర్. బాల్‌రెడ్డి, ఆర్. లింగయ్య, వి. పకీర్, ఆరు శ్రీనివాస్‌రెడ్డి, రాకేష్, అంతమ్మ, ప్రభ, జంగమ్మ, వరలక్ష్మి, లావణ్య, ముత్తమ్మ, రాములమ్మ, జయమ్మ, లక్ష్మమ్మ, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.



# గౌతమ్ స్కూల్‌లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారుల సందడి.. ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు**

**కృష్ణతత్వం ధర్మానికి ప్రతీక.. విద్యార్థులు ధర్మబాటలో నడవాలి**

**ఉట్టి కొట్టే కార్యక్రమంతో మార్మోగిన పాఠశాల ప్రాంగణం**

ప్రజా వాయిస్ : గుర్రంపోడు

మండలం నల్గొండ జిల్లా,గుర్రంపోడు మండలంలోని గౌతమ్ గ్రూప్ ఆఫ్ స్కూల్‌లో శ్రీకృష్ణాష్టమి జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం శ్రీకృష్ణ నామస్మరణతో సందడిగా మారింది. విద్యార్థినీ విద్యార్థులు రాధాకృష్ణుల వేషధారణలో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. ఉదయం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించగా, మధ్యాహ్నం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. చిన్నారుల వేషధారణలు, నృత్య ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ కృష్ణతత్వం ధర్మం, ప్రేమ, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. ధర్మ సంరక్షణ కోసం శ్రీకృష్ణుడు అవతరించారని, అధర్మంపై ఎప్పటికైనా ధర్మమే విజయం సాధిస్తుందని తెలిపారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే కృష్ణతత్వాన్ని అర్థం చేసుకుని ధర్మం, ప్రేమ, మంచితనం వంటి విలువలను జీవితంలో ఆచరించాలని సూచించారు. రాధాకృష్ణుల వేషధారణలో ప్రతిభ కనబరిచిన చిన్నారులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నింబారి రమేష్ రెడ్డి, కరస్పాండెంట్ నింబారి శిరీష రెడ్డి, ప్రిన్సిపాల్ రాచెల్ నాలో, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# న్యూకిడ్స్ పాఠశాలలో రాధాకృష్ణ వేషధారణలో చిన్నారులు....

ప్రజా వాయిస్ /నల్గొండ క్రైమ్:

అనుముల మండలం హాలియా న్యూ కిడ్స్ పాఠశాలలో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు పాఠశాల చిన్నారులు రాధాకృష్ణ వేషధారణలో వచ్చి అందరిని అలరింపజేశారు ఉదయం పాఠశాలలో వెల్ బేబీ షో కార్యక్రమం నిర్వహించారు మధ్యాహ్నం సాంస్కృతిక కార్యక్రమాలు అనంతరం ఉట్టి కోట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ శ్రీలత రవీందర్ మాట్లాడుతూ ఈ ప్రపంచాన్ని నడిపిస్తుంది ఐక్యం చేస్తుంది కృష్ణతత్వం మాత్రమేనని అన్నారు శ్రీకృష్ణ పరమాత్ముడు విశ్వగురువు అని తెలిపారు. కృష్ణ తత్వం మొత్తం ధర్మాన్ని ప్రేమను తెలియజేస్తుంది అన్నారు. ధర్మం ఏ వైపు ఉంటే కృష్ణుడు ఆ వైపే ఉంటాడని పేర్కొన్నారు ధర్మ సంరక్షనార్థమే శ్రీకృష్ణుడు జన్మించాడని తెలిపారు. అధర్మం ఎప్పటికీ గెలవదు అన్నారు. అంతిమ విజయం ధర్మానిదే అని పేర్కొన్నారు. కురుక్షేత్ర సంగ్రామం ఇదే విషయాన్ని తెలియజేసిందన్నారు. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు కృష్ణ తత్వాన్ని అర్థం చేసుకొని అనుసరించాలని కోరారు. రాధా వేషధారణలో వచ్చి చక్కటి ప్రతిభ కనబరిచిన చిన్నారులను అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు....

# కేరళ పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



ప్రజా వాయిస్ సైదాపూర్ :-

సైదాపూర్ మండల కేంద్రంలోని కేరళ పాఠశాలలో గురువారం ముందస్తుగా కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని ,విద్యార్థులు గోపికలు , శ్రీకృష్ణుడు వేషధారణ వేసి నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ , ప్రిన్సిపల్ అనగొని తిరుపతి గౌడ్ మాట్లాడుతూ.. కృష్ణాష్టమి అనేది విష్ణు యొక్క ఎనిమిదో అవతారమైన శ్రీకృష్ణుడు పుట్టిన రోజున పాఠశాలలో ముందస్తుగా కృష్ణాష్టమి వేడుకలు జరుపుకుంటున్నామని అన్నారు. ఎంతోమంది భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని తెలిపారు. కృష్ణుడు జీవితం ,బోధనలు మరియు ఆయన చేసిన పనులు విద్యార్థులకు తెలియ చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థిని ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.